www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 39 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి శ్రావణ శుద్ధ పాడ్యమి
05-11 ఆగస్ట్ 2024
వెల : ₹20/-

బడ్జెట్ - 2024-2025

## వికసిత భారతానికి దిక్సూచి





భారత్ శుభారంభం...

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

# ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రదేశంలో సొరంగం

కార్గిల్ విజయ్ దివస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా లద్దాక్‌లో పర్యటించిన ప్రధాని మోదీ ప్రపంచంలోని అతి ఎత్తైన ప్రదేశంలో షిన్‌కున్ లా సొరంగ నిర్మాణం పనులు ప్రారంభించారు. దాదాపు 15,800 అడుగుల ఎత్తులో ఉండే ఈ సొరంగం ఆ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. దాదాపు 4.1 కి.మీ.ల జంట ట్యూబ్ సొరంగం హిమాచల్ ప్రదేశ్ నుంచి నిమ్ము- పదాం- దార్చా రహదారి గుండా లద్దాక్, లేహ ప్రాంతాలను అనుసంధానం చేస్తుంది. దీని నిర్మాణం పూర్తయితే ఇది చైనాలో మైలా సొరంగం (15,590 అడుగుల)ను మించిన ఎత్తుతో ప్రపంచంలోనే ఎత్తైనది కానుంది.








భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావు స్మారక

# కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం
ప్రఖ్యాత సాహితీవేత్త భండారు సదాశివరావు స్మారక
'కథల పోటీ - 2024' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..

**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

**నిబంధనలు :**

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపాచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.
8. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 31 ఆగస్ట్, 2024**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్**
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

ఇది క్రైస్తవులు నిర్వహించే విద్యా సంస్థలకీ, ముస్లిం మత పెద్దలకీ కూడా ఒక చక్కని గుణపాఠం. కేరళలోని మువత్తుపుళ అనే చోట నిర్మల కళాశాలలో జరుగుతున్న పరిణామాల గురించి భారతీయులంతా దృష్టి పెట్టవలసి ఉంది. ఆ కళాశాలలో చదువుతున్న ముస్లిం బాలికలు ప్రార్థన (జుమా లేదా నమాజ్) చేసుకోవడానికి ఒక ప్రత్యేక స్థలం కావాలని కోరడంతో మొదలయిన వివాదమిది. ఆ కళాశాల సైరో–మలబార్ కేథలిక్ చర్చ్ నిర్వహణలోనిది. శుక్రవారమే కాదు, నిత్యం మధ్యాహ్నం నమాజ్ చేయడం తమ సంప్రదాయం కాబట్టి అందుకు ప్రత్యేక స్థలం కావాలని బాలికలు అంటున్నారు. రెండువారాల క్రితం ఒక శుక్రవారం ఆ కళాశాలలో చదివే కొందరు ముస్లిం బాలికలు నమాజ్ కోసం తమకు ఒక స్థలం కేటాయించాలని నిరసనకు దిగారు. అలాంటివి సాధ్యపడవని, రెండువందల మీటర్ల దూరంలోనే ఒక మసీదు ఉంది కాబట్టి, అక్కడికి వెళ్లి నమాజ్ చేసుకోవచ్చునని కాలేజీ యాజమాన్యం చెప్పేసింది. నమాజ్ కోసం వెళ్లే బాలికలకు అటెండెన్స్ ఇస్తామని కూడా తెలియచేసింది.

ఈ రగడను శాంతియుతంగా, వివాదాస్పదం కాకుండానే పరిష్కరించడానికి కళాశాల యాజమాన్యం మొదట ప్రయత్నించిన సంగతి అర్థమవుతుంది. ఇలాంటి కోరిక కోరుతున్న విద్యార్థి బృందం నాయకులను పిలిచి ప్రిన్సిపాల్ ఫాదర్ ఫ్రాన్సిస్ కన్నాదన్ చర్చించారు. కానీ బాలికలు తమ పట్టు వీడలేదు. నిజానికి ముస్లిం బాలికల డిమాండ్‌ను నిరాకరించినందుకు మొదట కళాశాల యాజమాన్యమే క్షమాపణ చెప్పిందని విద్యార్థి సంఘం చెబుతోంది. తరువాత నుంచి బాలికలు వేచి ఉండే గదిలోనే ముగ్గురు బాలికలు కొద్దికాలంగా నమాజ్ కూడా చేస్తున్నారు. దీనినే ఉపాధ్యాయేతర సిబ్బంది ఫిర్యాదు మేరకు ఇటీవల ప్రిన్సిపాల్ నిలిపివేయించారు. వివాదం పెద్దది కావడానికి ఇదే కారణం. సీపీఎం కూడా ముస్లింలకు మద్దతుగా ఈ వివాదం వెనుక నిలబడిందనే అనాలి. ఇటీవలి కాలంలో క్రైస్తవంలో ఒక వర్గం బీజేపీకి దగ్గర కావడం సహించలేని సీపీఎం ఈ రకంగా కక్ష తీర్చుకుంటున్నదని చెప్పినా తొందరపాటు కాదు. ఒక క్రైస్తవ విద్యా సంస్థలో నమాజ్ చేసుకుంటామన్నది

**శాలివాహన 1946 శ్రీ క్రోధి శ్రావణ శుద్ధ పాడ్యమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**వికసిత భారతానికి దిక్సూచి**
10లో

ధారావాహిక నవల (ముగింపు)
**జన్మ**
– సంబరాజు లీల (లట్టుపల్లి)
20లో




కథ
**సమానోమంత్ర**
– అవని సంబరాజు
28లో



# జాగృతి

## సంపాదకీయం

విద్యార్థినులు డిమాండే అయినా ఆందోళనకు దిగిన విద్యార్థులకు చాలా విద్యార్థి సంఘాలు మద్దతు ఇచ్చాయని ఎస్ఎఫ్ఐ (సీపీఎం విద్యార్థి విభాగం) జిల్లా కార్యదర్శి అర్జున్‌బాబు ప్రకటించాడు. రాష్ట్రంలోని రెండు ప్రధాన విద్యార్థి విభాగాలు దీనికి మద్దతు ఇవ్వడం, అధికార పార్టీ అండతో ఇలా వ్యవహరించడం బాధాకరమని క్రైస్తవ మిషనరీ విద్యాసంస్థల కన్వీనర్ బిషప్ థామస్ ఆరోపించడం విశేషం. కేరళలో ప్రధాన విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమే.

ఇది జరిగిన చాలా రోజులు తరువాత అలాంటి కోరిక సరికాదని ముస్లిం మత పెద్దలు తమ పిల్లలకి హితవు చెప్పారు. తమకు నమాజ్ కోసం గది

## ఇదేం రగడ?

కావాలంటూ ముస్లిం బాలబాలికలు ఏకంగా నిరసన కార్యక్రమానికి దిగడంతో దీనికి ప్రచారం వచ్చింది. అంతదూరం వెళ్లకండి, దీనితో అసహనం పెరుగుతుందని ముస్లిం పెద్దలు పిల్లలకి చెప్పారు. బహుశా రాష్ట్రంలో లేదా దేశంలోనే ఇలాంటి ఘటన జరగడం ఇదే తొలిసారి కావచ్చు. ఇలాంటి ఒక వివాదం తలెత్తడమే దురదృష్టం అన్నాడు, దక్షిణ కేరళ జమీయుతుల్లా ఉలేమా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ తౌఫీక్ మౌల్వీ. నమాజ్ అనేది వ్యక్తిగత విషయం, అలాగే కొన్ని వేళలలో మాత్రమే చేయవలసినది. అంతేతప్ప, నమాజ్ చేసేందుకు మాకు ఒక స్థలం కావాలంటూ ఇతరులను గట్టిగా కోరడాన్ని ఇస్లాం అంగీకరించదని ధర్మసూత్రం కూడా బోధించాడాయన. ఇంత జరిగాకే మౌల్వీ కలగ చేసుకొని ఈ వివాదంలో పెద్దలు జోక్యం చేసుకోక తప్పదని పిలుపునిచ్చాడు.

ఆఖరికి ముస్లిం లీగ్ అనుబంధ విద్యార్థి సంఘం కూడా ఇలాంటి కోరికలు కోరేటప్పుడు ముస్లిం విద్యార్థులు కాస్త సంయమనం పాటించాలని హితవు చెప్పింది. ముస్లిం పెద్దలు, ముస్లిం విద్యార్థి సంఘాలు కూడా నమాజ్ కోసం స్థలం కోరడం సరికాదని అంటూ ఉంటే, సీపీఎం మాత్రం దానికి మద్దతు ఇచ్చింది. వివాదం తీవ్రమైన తరువాత కళాశాల యాజమాన్యం కూడా కఠిన వైఖరి తీసుకుంది. నమాజ్‌కు ప్రత్యేక స్థలం విషయంలో కాలేజీ విధానంలో ఎలాంటి మార్పు లేదని ప్రిన్సిపాల్ చెప్పారు.

సైరో-మలబార్ చర్చ్, కేథలిక్ కాంగ్రెస్ ఈ పరిణామం గురించి తీవ్రంగానే స్పందించాయి. ప్రార్థన కోసం స్థలం కోరడం, 'ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న మత దాడి' అనే విమర్శించాయి. రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి దాడి వెనుక క్రైస్తవ మైనారిటీ సంస్థలను ధ్వంసం చేసే వ్యూహం ఉందని, అయినా ప్రతిఘటిస్తామని చర్చ్, కేథలిక్ కాంగ్రెస్ ప్రజా వ్యవహారాల కమిషన్ హెచ్చరించింది. హిందువులు, క్రైస్తవులు నిర్వహించే విద్యా సంస్థలను ఇబ్బందుల పాల్జేయాలని కొన్ని ఉగ్రవాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె. సురేంద్రన్ ఆరోపించారు. ఈ వివాదం మీద సీపీఎం ప్రభుత్వ వైఖరి ఏమిటో తేల్చి చెప్పాలని కూడా కోరారు.

క్రైస్తవ విద్యాసంస్థల పట్ల జాలి చూపించడం ఈ సంపాదకీయం ఉద్దేశం కాదు. భారతదేశంలో మైనారిటీ అంటే ముస్లింలే గుర్తు వస్తారు. క్రైస్తవులు వెంటనే గుర్తుకు రారు. బౌద్ధులు, జైనులు, పార్సీలు అసలే గుర్తుకు రారు. పూర్తిగా చర్చ్ నడిపే విద్యా సంస్థలో నమాజ్ చేసుకోవడానికి చోటు ఇవ్వాలని నిలదీయడం తీవ్రమైన పోకడే. ఇది ఇక్కడితో ఆగిపోతుందని ఎవరూ అనలేరు కూడా. ఈ వ్యవహారంలో ముస్లిం బాలికల వెనుక వారి పెద్దలు లేరంటే నమ్మడం సాధ్యం కాదు. మైనారిటీ వర్గాలలో పెద్దన్న పాత్రనే పోషిస్తున్న ఇస్లాం వాస్తవ రూపం ఏమిటో తెలుసుకోవలసిన అవసరం క్రైస్తవానికి ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంది. ★

05 ఆగస్ట్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**రుగ్మత**

- స్వాతి





| | | |
|---|---|---|
| ఓడితే అసెంబ్లీకి రారా? (తెలంగాణ) | - | 14 |
| శాసనసభలో వైసీపీ పాపాల చిట్టా (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| సురాజ్యలక్ష్మి (మహిళ) | - | 26 |
| హక్కులు సరే..మరి బాధ్యతలు...!? (పౌరస్పృహ) | - | 32 |
| మార్క్సిస్టుల 'భక్తి' మంత్రం (కనువిప్పు) | - | 33 |
| రాష్ట్రాలు వాళ్ల జాగీరులా (సంక్షోభం) | - | 36 |
| మతస్వేచ్ఛ అంటే నిర్బంధ మతమార్పిడి కాదు (జాతీయం) | - | 38 |
| ఒలింపిక్స్‌లో భారత్ శుభారంభం.. (క్రీడ) | - | 43 |
| బాలజాగృతి | - | 46 |
| రెండు... అంతకు మించి! (సినిమా) | - | 50 |



బడ్జెట్ అంటే జమా, ఖర్చుల చిట్టా. మన ఇళ్లల్లో కూడా ప్రతి నెలా ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంటుంది. మనకు వచ్చే ఆదాయాన్ని బట్టి, అత్యవసర ఖర్చులను బట్టి మన ఇంటి బడ్జెట్‌ను కూడా సర్దుబాటు చేసుకుంటాం. దేశ బడ్జెట్ అయినా అంతే! రాష్ట్రానికి, దేశానికీ సంబంధించిన బడ్జెట్లు భారీగా ఉంటాయి కనుక దాని పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా, కళ్లకు అంత భారీగా అంకెలు కనిపిస్తుంటే ఏదో ఒక రూపంలో పన్ను కడుతున్న ప్రతి పౌరుడికీ అందులో తనకెంత వస్తుందోనన్న ఆశ కలుగుతుంటుంది. ఈసారి బడ్జెట్ విషయంలోనూ అంతే! నిజానికి, ఎన్నికలకు ముందే తాత్కాలిక బడ్జెట్ వచ్చేసింది. అందులోనే చాలా అంశాలను కేంద్రం పొందుపరిచింది. ఇప్పుడు వచ్చిన బడ్జెట్ కొన్ని నెలలకు మాత్రమే సంబంధించింది. అయినప్పటికీ, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే మనం దుబారా ఖర్చులు మానుకొని ఆదా చేసినట్టే, దేశాన్ని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపే దిశలో బడ్జెట్ కూడా చాలా పొదుపుగా, పెద్దగా రాయితీలు లేకుండా వచ్చేసింది. ఆర్థిక

# పురోగామి

ఆర్థిక మంత్రి కూడా ఇందులో అవసరమైన సవరణల కోసం దేశవ్యాప్తంగా పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, ఇఫ్కీ వంటి సంస్థల అభిప్రాయాలను తెలుసుకొని, హేతుబద్ధమైన, లబ్ధి చేకూర్చే సూచనలు వస్తే అవసరమైన మార్పులు చేయనున్నారు. ఇదే దేశ అభివృద్ధికి, పౌరుల జీవన ప్రమాణాలకు మార్గాన్ని సుగమం చేసే ఆర్థిక ప్రక్రియ కానుంది.

ఈసారి బడ్జెట్‌లో మంచి విషయాలే ఎక్కువ ఉన్నాయి. అంతర్గత ఆర్థిక సరళులపై తక్కువ ప్రభావాన్ని బడ్జెట్లు చూపుతున్న సమయంలో బడ్జెట్ చుట్టూ రాజకీయ, మీడియా ఉన్మాదం పెరిగి పోతుండడం విచిత్రమే. మనకు ఫలితాలు కూడా కనిపించడం కష్టమే, ఎందుకంటే, ఈ వ్యయాలు ఆరునెలలకు మాత్రమే వర్తిస్తాయి. ఈ నెలాఖరులోగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ఆమోదించాక, వచ్చే బడ్జెట్‌కు కేవలం ఆరు నెలలే మిగులుతాయి. ముఖ్యంగా జనవరి– మార్చి 2025 త్రైమాసికంలో బడ్జెట్ ప్రతిపాదనల ఆధారంగా కాక, అప్పటికే కనిపించే రాబడి, ఖర్చు సరళులపై ఆధారపడి వ్యయాలు ఉంటాయి. అక్టోబర్– డిసెంబర్ త్రైమాసిక సరళులను గమనించిన తర్వాత ఆర్థిక మంత్రిత్వ శాఖకు వచ్చే అవగాహనను బట్టి మంత్రిత్వ శాఖల ఖర్చులను తగ్గించుకోమని కానీ పెంచమని కానీ సూచనలు అందుకుంటాయని ఆర్థికవేత్తలు అంటున్నారు. పార్లమెంటు విత్త బిల్లును ఆమోదించిన ఒక నెలవరకూ అనేక బడ్జెట్ పథకాలను అమలు చేయరు కాబట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక నెల ఊరికే గడిచిపోతుందంటే, విచిత్రంగా అనిపించక మానదు.

ఈ క్రమంలో బడ్జెట్ ప్రతిపాదనల దిశలో ఎటువంటి తప్పూలేదని అనేకమంది ఆర్థికవేత్తలు చెప్తున్నారు. ఈ ప్రతిపాదనలలో ఉపాధి, స్కిల్లింగ్, మౌలిక సదుపాయాలపై ఖర్చును నిలకడగా ఉంచడం, మూలధన లాభాలను, మూలరేట్ల వద్ద పన్ను తగ్గింపును క్రమబద్ధీకరించడం వంటి వాటిపై కీలకంగా దృష్టి పెట్టిన విషయం మనకు కనిపిస్తుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇలు)కు, పట్టణాల పేదలకు మరిన్ని ఇళ్ల నిర్మాణానికి పరపతి సజావుగా అందేందుకు ఈ ప్రతిపాదనలు తోడ్పడతాయి. ముఖ్యంగా, అణు ఇంధన రంగంలో తొలిసారిగా ప్రైవేటు సంస్థలు దోహదం చేసే దిశగా ప్రైవేటు భాగస్వామ్యానికి ఆమోదం తెలపడం ఒక మైలురాయి నిర్ణయంగా చెబుతున్నారు. గతంలో చేసిన చట్టాలు ఈ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని నిరోధించాయి. దీనివల్ల కలిగే లాభాలలో నూతన దృక్పథాలకు, పెట్టుబడులకు, నైపుణ్యాలకు చోటు లభించి భారత్ మరింత నిలకడైన, సాంకేతికంగా ఆధునిక భవిష్యత్తు దిశగా పయనించేందుకు అవకాశం లభ్యమవుతుంది.

ఈ బడ్జెట్‌లో ప్రశంసించవలసిన విషయం, కూటమి ప్రభుత్వం అయినప్పటికీ, ఆర్థిక స్థిరీకరణ

డి. అరుణ

క్రమశిక్షణను నేర్పాలని కటువుగా వ్యవహరించే తండ్రిలా మోదీ కూడా ఈ బడ్జెట్‌ను అదే రీతిలో రూపొందించేలా ఆర్థికమంత్రిని ప్రోత్సహించినట్టు కనిపిస్తోంది. దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చేసిన బడ్జెట్‌ను ఈసారి ఒక జమా ఖర్చుల పత్రంలా కాక ఒక ప్రక్రియలా రూపొందించారు. భారం మొత్తాన్నీ కేంద్రమే మోయకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తున్న రాష్ట్రాలకు, మంత్రిత్వ శాఖలకు, పరిశ్రమలకు తోడ్పడేలా ఇకపై బడ్జెట్‌లు ఉండనున్నాయి. అంతేకాదు, సంప్రదాయ పరామితులను పక్కకు పెట్టి, అవసరమైన చోట మాత్రమే ఖర్చు పెట్టాలన్న దృష్టితో బడ్జెట్‌ను తయారు చేశారు.




# బడ్జెట్

పధానికే ఈ బడ్జెట్టు కట్టుబడి ఉండడం. అనేక సందర్భాలలో ప్రభుత్వాలు, తమ కూటమిలో ఉన్న పార్టీలకు తల ఒగ్గడం మనం చూసే ఉన్నాం. అయితే, ఈసారి అలా జరుగకుండా ఉండడం ప్రభుత్వ నిబద్ధతకు ఒక తార్కాణంగా చెప్పుకోక తప్పదు. బీజేపీకి సార్వత్రిక ఎన్నికలలో వచ్చిన ఫలితాలు, త్వరలోనే జరుగనున్న మూడు రాష్ట్రాల ఎన్నికలు (మహారాష్ట్ర, ఝార్ఖండ్, హరియాణా) నేపథ్యంలోనూ ఆర్థిక మంత్రి ఉచితాలను ప్రకటించాలన్న ఉత్సాహాన్ని మోదీ ప్రభుత్వం నిలవరించుకోవడం నిజంగా హర్షించవలసిన విషయం. ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నప్పుడు కూడా ఉచితాల జోలికి పోని ప్రధాని ఈసారి కూడా యుక్తమైన ఆర్థిక ఆలోచనలకే కట్టుబడి ఉన్నారు.

ఎన్నికలకు ముందు ఏమీ ఇవ్వకపోయినా, గెలిచిన తర్వాత అయినా ఏదో ఒకటి ఇవ్వకపోతారా అని అందరూ ఎదురు చూస్తున్న 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్లో ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలతో పాటు ఆర్థిక రంగంలో పలు వ్యవస్థలకు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా పలు మార్పులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఆర్థిక మంత్రి చేసిన కీలక ప్రకటనలు ఏమిటో చూద్దాం –

### కస్టమ్స్ డ్యూటీలో సవరణలు

**1. బంగారం, వెండి, ప్లాటినం:**

బంగారం వెండిపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 6శాతానికి, ప్లాటినమ్‌పై సుంకాన్ని 6.4శాతానికి తగ్గించారు. పోటీతత్వాన్ని పెంచేందుకు తక్కువ సుంకాలను ప్రతిపాదిస్తున్న ఆభరణాలు, విలువైన రాళ్ల పరిశ్రమకు ఈ చర్య ప్రయోజనాన్ని చేకూరుస్తుందని భావిస్తున్నారు.

**2. లోహయుక్త నికెల్, దుక్కరాగి (ఫెర్రోనికెల్, బ్లిస్టర్ కాపర్):**

ఈ లోహాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని తొలగించారు. ఇది తత్సంబంధిత పరిశ్రమలకు వ్యయాన్ని తగ్గించేందుకు తోడ్పడుతుందని అంచనా.

**3. టెలికాం పరికరాలు:**

నిర్దిష్టమైన టెలికాం పరికరాలపై సుంకాన్ని 10 నుంచి 15శాతాన్ని పెంచారు. ఇది దేశీయ పరిశ్రమను ప్రోత్సహించే చర్యగా పలువురు భావిస్తున్నారు.

**4. వైద్య పరికరాలు:**

వైద్యపరంగా ఎక్స్-రే మెషీన్లలో ఉపయోగించేందుకు ఎక్స్-రే ట్యూబులు, చదునైన పానెల్ డిటెక్టర్లపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలన్న ప్రతిపాదన హర్షణీయం.

ఇది దేశీయ సామర్థ్యాల జోడింపు, స్థానిక ఉత్పత్తి రంగానికి తోడ్పాటుతోపాటు కాన్సర్ రోగుల వ్యాధినిర్ధారణ ఖచ్చితత్వాన్ని, చికిత్సా ఫలితాలను మెరుగుపరచేందుకు ఆధునిక సాంకేతిక అందుబాటులో ఉండేలా హామీ.

### వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం

వ్యవసాయ రంగం, రైతాంగం పట్ల మోదీ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పని చేస్తోంది. ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు చర్యలను బడ్జెట్‌లో ప్రకటించడం జరిగింది.

**1. అధిక దిగుబడిని ఇచ్చే పంటలు:**

32 రకాల ఆహార ధాన్యాల, ఉద్యాన పంటల కోసం 109 అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల రకాల విడుదల.

**2. డిజిటల్ పంట సర్వే**

వ్యవసాయానికి సార్వజనిక డిజిటల్ మౌలిక సదుపాయాలను పెంచేందుకు 400 జిల్లాల్లో అమలు.

**3. చమురు విత్తనాల వ్యూహం**

విదేశీ మారకాన్ని తగ్గించి, దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు చమురు విత్తనాల ఉత్పత్తిలో స్వావలంబనను సాధించే కృషికి ప్రోత్సాహం.

### వ్యవసాయ ఆధునీకరణ

**1. బడ్జెట్ కేటాయింపు:**

గత ఏడాదితో పోలిస్తే 21.6శాతం పెంపుతో బడ్జెట్ కేటాయింపును 1.52 లక్షల కోట్లకు పెంచారు.

**2. సార్వజనీన డిజిటల్ మౌలికసదుపాయాలు**

వీటిని అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు పరపతి అందుబాటును మెరుగుపరచేందుకు లంకెలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**3. వ్యవసాయ – మౌలికసదుపాయ నిధి**

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను పెంచేందుకు కేటాయింపులు రూ. 30,000 కోట్లకు పెంపు చేశారు.

### గ్రామీణ ఆదాయాలకు ప్రోత్సాహం

మెరుగైన కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) పెంపు, గ్రామీణ ఆదాయాలను, అనుసంధానతను మెరుగుపరిచేందుకు పిఎంజిఎస్‌వై 4ఫేజ్‌ను (ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన) ప్రారంభించడం, ఆటో అమ్మకాలను పెంచే సంభావ్యతను పరిశీలించడం.

### ఉపాధి, స్కిల్లింగ్

ముద్రా రుణాల పెంపు, ఉపాధి అనుసంధాన ప్రోత్సాహకాలు వంటి పథకాల ద్వారా వ్యవస్థాపకత, ఉపాధి సృష్టిపై దృష్టి. వ్యవస్థాపకతను ప్రోత్సహించడం ద్వారా దేశీయ వినిమయాన్ని, ఎగుమతులను పెంచేందుకు అవకాశం లభ్యమవుతుంది.

**స్టార్టప్ ఇకో సిస్టం పెంపు, పెట్టుబడులకు ప్రోత్సాహం**

గతంలో ఏదైనా సంస్థలలో పెట్టుబడులు పెట్టాలంటే ముందుగా దానికి కూడా పన్ను కట్టవలసి ఉండేది. ఇప్పుడు పెట్టుబడులపై వేసే 'ఏంజెల్ టాక్స్'ను రద్దు చేయడం అన్ని వర్గాల పెట్టుబడిదారులకు ఉపయోగకరం కానుంది. దీని ఫలితంగా నూతనంగా పెట్టే సంస్థలకు అంటే స్టార్టప్‌లకు లాభం చేకూరనుంది. ఈ చర్య దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించి శక్తిమంతమైన స్టార్టప్ వాతావరణాన్ని పెంచిపోషిస్తుంది.

**స్టార్టప్ వృద్ధి**

ఈ చర్య ఎఐ రంగం (కృత్రిమ మేథా)లో ఆవిష్కరణలను, వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రోత్సహిస్తుంది.

**నైపుణ్యాల అభివృద్ధి**

పరిశ్రమలకు సంబంధించిన 1,000 శిక్షణా సంస్థలు నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడమే కాకుండా భవిష్యత్ ఉద్యోగాలకు యువతను సన్నద్ధం చేస్తాయి. ముఖ్యంగా మహిళల నేతృత్వంలో అభివృద్ధి, ఎఐ–తోడ్పాటుతో వారి నైపుణ్యాలను పెంచడం దీని లక్ష్యం. ముఖ్యంగా, కార్పొరేట్ రంగం సామాజిక బాధ్యతతో ఇచ్చే నిధులను యువతకు స్కాలర్‌షిప్‌ల రూపంలో ఇచ్చి, వారి నైపుణ్యాలను పెంచడం ద్వారా ఉపాధికి అర్హులుగా తయారు చేయాలని చేసిన ప్రతిపాదన భవిష్యత్తులో నిరుద్యోగ సమస్యను తగ్గించనుంది.

**పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం**

జన విశ్వాస్ బిల్లు, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్ వంటి చొరవలు పరిశోధనలను ప్రోత్సహించడమే కాక వ్యాపారం చేయడాన్ని సులభతరం చేస్తాయి. కాగా, ప్రభుత్వం ఈ పరిశోధనలకు దిశను నిర్ణయించి, పర్యవేక్షించేందుకు నిపుణులను నియమించుకుంటే ఈ ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశముంది. లేదంటే పరిశోధనా సంస్థలు కూడా బ్యూరోక్రటిక్ పద్ధతిలో చిక్కుకుని లక్ష్యమే విఫలమయ్యే అవకాశం మెండు.

# రుణ– జీడీపీ నిష్పత్తి

ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద భారంగా మారింది రుణ–జీడీపీ (స్థూల దేశీయ ఉత్పత్తి) నిష్పత్తి కనుకనే ప్రభుత్వం దీనిని తగ్గించడంపై ఎక్కువగా దృష్టి పెట్టింది. దీని కారణంగానే, ప్రస్తుతం రూ.7.1 లక్షల కోట్లగా ఉన్న మార్కెట్ రుణాలను మహమ్మారి కాలానికి ముందు ఉన్న సాధారణ స్థాయికి తెచ్చే సంకల్పంతో ఉంది. ఉపాధిని ప్రోత్సహించేందుకు పథకాలను, కొన్ని రాష్ట్రాలకు సహాయాన్ని 2024–25 బడ్జెట్‌లో ప్రకటించినప్పటికీ, విత్త స్థిరీకరణ మార్గానికే కట్టుబడి ఉండాలన్న ఉద్దేశాన్ని ఉద్ఘాటిస్తూ విత్త లోటు లక్ష్యాన్ని తగ్గించింది. ముఖ్యంగా, తాత్కాలిక బడ్జెట్లో ప్రకటించిన 5.1 శాతం నుంచి 4.9 శాతానికి విత్త లోటు లక్ష్యాన్ని తగ్గించినట్టు రేటింగ్ ఏజెన్సీలకు సంకేతాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. అంటే, జీడీపీలో కేంద్ర ప్రభుత్వ రుణ శాతం తగ్గుతూ వస్తుందనే విషయాన్ని నొక్కి చెప్పింది. అంతేకాదు, జీడీపీలో కేంద్ర ప్రభుత్వ రుణశాతం తగ్గిస్తూ, ప్రతి ఏడాదీ విత్త రుణాన్ని తగ్గించడమే 2026–27 నుంచి తమ ప్రయత్నంగా ఉంటుందని ఆర్థిక మంత్రి సీతారామన్ తన ఉపన్యాసంలో ప్రకటిస్తూ, ఒక స్థాయిని మించి విత్తలోటు దాటకూడదన్నారు. డెట్ డైనమిక్స్ లెక్కింపులోకి వెళ్లే ప్రస్తుత మున్న వృద్ధి రేట్లు, వడ్డీ రేట్లు, ఇతర కొలమానాలపై ఆధారపడి ఇది ఉంటుందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి విత్త లోటును తగ్గించేందుకు రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయాన్ని కుదింపు చేశారు. ప్రభుత్వ ఖర్చు 1.3శాతం పడిపోయింది. మూలధన వ్యయం కూడా 0.2 శాతం తగ్గి, అంచనాల కన్నా కిందకు వచ్చింది.

ఈ చర్యల కారణంగా దీర్ఘకాలిక విత్త లోటు 3శాతం ఉంచాలన్న లక్ష్యం ఇకపై కల కాదు.

**ఇంధన పరివర్తన విధానాలు**

కర్బనీకరణను తగ్గించడం క్లిష్టమైన రంగాలలో అణు ఇంధనం, ఉష్ణాధార విద్యుదుత్పత్తిని వినియోగించడంపై దృష్టి పెట్టి ఇంధన పరివర్తనకు మార్గాలను, ఇంధన నిల్వ వ్యవస్థలను ప్రతిపాదిస్తూ, ఇంధన పరివర్తన విధాన పత్రాలను ఈసారి బడ్జెట్లో ప్రవేశపెట్టడం హర్షణీయం. ముఖ్యంగా, అణు ఇంధనంలోకి ప్రైవేటు భాగస్వాములను అనుమతించాలని నిర్ణయించిన నేపథ్యంలో జీరోకార్బన్ దిశగా ప్రయాణం సులువుకానుందని నిపుణుల భావన.

**పర్యావరణం, హరిత ఇంధనాలలో పెట్టుబడులకు ప్రోత్సాహం**

పర్యావరణ అనుకూల ప్రాజెక్టులలో హరిత పెట్టుబడులను, మూలధనాన్ని ఆకర్షించేందుకు, పెట్టుబడిదారుల విశ్వాసం సడలకుండా పారదర్శకతకు హామీ ఇస్తూ ఒక చట్రాన్ని రూపొందించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆ పరిశ్రమల నుంచి ప్రశంసలను అందుకుంటోంది.



**మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు**

ఆర్థిక వ్యవస్థలో మహిళా శ్రామికశక్తిని ప్రోత్సహించేందుకు ఈసారి బడ్జెట్లో పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. హాస్టళ్లు, క్రెచ్‌లు, నైపుణ్యాల వృద్ధి కార్యక్రమాల ద్వారా వారిని ఇందులో సమ్మిళితం చేయాలన్నది లక్ష్యం. అందులో భాగంగానే మహిళా ఉద్యోగులు పిల్లల సంరక్షణను, ఇంట్లో వృద్ధుల సంరక్షణ బాధ్యతలను సమతులం చేసుకోవడానికి తోడ్పడేలా సీనియర్ కేర్‌ను ఉద్యోగ లబ్ధిగా ప్రకటించడం హర్షణీయమైన చర్య. ఉద్యోగం చేస్తున్న మహిళలు తమ కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నామన్న భావనకు గురికాకుండా, మరింత నిబద్ధతతో పనిచేసేందుకు ఇది తోడ్పడుతుంది.

**సరఫరా లంకెల అభివృద్ధి**

కీలక ఖనిజాల సరఫరా లంకె అభివృద్ధి సామర్థ్యాలను పెంచుకునేందుకు ప్రైవేటు, ప్రభుత్వ కంపెనీలను ప్రోత్సహించనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. తద్వారా పర్యావరణ అనుకూల ఇంధనాన్ని ఉత్పత్తి చేసే దేశీయ ఉత్పాదక రంగాలకు తోడ్పాటును అందించడం దీని లక్ష్యం.

**మౌలిక సదుపాయాల అభివృద్ధి**

ఆర్థిక వ్యవస్థపై బలమైన గుణక ప్రభావాన్ని (మల్టిప్లైయర్ ఎఫెక్ట్) చూపిన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై భారీ పెట్టుబడులనే ఈ బడ్జెట్ కేటాయించింది. ఇతర ప్రాధాన్యతలను, విత్త స్థిరీకరణను సమతులం చేస్తూనే రానున్న ఐదేళ్ల వరకూ ప్రభుత్వం బలమైన ఆర్థిక తోడ్పాటును అందించనుంది. అందులో భాగంగానే, రూ. 11,11,111 కోట్ల కాపెక్స్‌ను అంటే జీడీపీలో 3.4 శాతాన్ని




రుణాన్ని 'క్షీణించే మార్గంలో' ఉంచాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని బడ్జెట్ ఎత్తి చూపింది. రేటింగ్ సంస్థ అయిన ఫిచ్ ప్రకారం, విదేశీ కంపెనీలకు ప్రభుత్వం కార్పొరేట్ పన్నును 40శాతం నుండి 35 శాతానికి తగ్గించడం, దాని పబ్లిక్ క్యాపెక్స్–ఆధారిత మౌలిక సదుపాయాలకల్పనకు ప్రోత్సాహం, ఉత్పత్తి పెట్టుబడులకు సానుకూల సంకేతం అని పేర్కొంది. కాగా, మధ్యకాలికంగా, నిలకడగా విత్త స్థిరీకరణ చేయడం అన్నది రుణ–జీడీపీ నిష్పత్తిని తగ్గించేందుకు తోడ్పడడమే కాక, స్థూల ఆర్థిక పనితీరు, విదేశీ పెట్టుబడులకు గల సానుకూల వేగాన్ని కలిపినప్పుడు భారత్ రేటింగ్ పెరిగేందుకు మార్గం సుగమం అవుతుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ పేర్కొనడం ఒక శుభసూచకం.

మొత్తం మీద ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర బడ్జెట్ వ్యవసాయ ఆధునీకరణ, ఆరోగ్యసంరక్షణను మెరుగుపరిచి అందుబాటులోకి తేవడం, పన్ను నిబంధనలను సరళీకరించడం, మౌలిక సదుపాయాలను పెంచడం, నిలకడైన పద్ధతులను ప్రోత్సహించడం అన్నవి సమతులమైన, సమ్మిళిత వృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను పట్టి చూపుతుంది. అయితే, వీటిని సమర్ధవంతంగా అమలు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అన్నవి ఈ చొరవల లాభాలను పూర్తి స్థాయిలో సాకారం చేసేందుకు అవసరం.

కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో భాగంగా, అమృత్‌సర్, కోల్‌కతా పారిశ్రామిక కారిడార్‌పై గయలో ఒక పారిశ్రామిక నోడ్ (వ్యాపారాలకు కీలక సేవలను సమర్ధవంతంగా అందించే ప్రాంతం) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది.

దీనితో పాటుగా రూ. 26వేల కోట్ల వ్యయంతో 1. పాట్నా–పూర్నియా ఎక్స్‌ప్రెస్‌వే, 2.బక్సర్ భగల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వే, 3. బోధగయా, రాజగిర్, వైశాలీ, దర్భంగా మార్గాలను వేగవంతంగా పూర్తి చేయడం, 4. బక్సర్ వద్ద గంగా నదిపై అదనపు 2 లేన్ వంతెన నిర్మాణం ఉన్నాయి.

అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నూతన రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ. 15,000 కోట్ల కేటాయింపు. ఇతరత్రా అభివృద్ధి కోసం మల్టీలేటరల్ సంస్థల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు తోడ్పాటును ఆ రాష్ట్రానికి హామీ ఇచ్చింది.

**పర్యాటక వృద్ధి**

ఇన్‌క్రెడిబుల్ ఇండియా 3.0ను సాధించేందుకు దేశీయంగా పర్యాటకాన్ని ప్రోత్సహించాలని గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు మొత్తాలను ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించారు. ఇందులో భాగంగా గయలోని విష్ణుపాద ఆలయం, బోధగయలోని మహాబోధి ఆలయం వంటి మతపరమైన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. వీటిని కాశీ కారిడార్ తరహాలో రూపొందించాలని ప్రణాళిక. బిహార్‌లోనే రాజ్‌గిర్ ప్రాంతాన్ని, నలందను కూడా అభివృద్ధి చేయనున్నారు. దీనితోపాటు ఒడిషాలో కూడా పర్యాటక వృద్ధికి నిధులు ప్రకటించారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద కొన్ని నిర్దిష్ట ఇతివృత్తాలతో పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేయడం, ఆధ్యాత్మిక యాత్రలను ప్రోత్సహించేందుకు 'ప్రసాద్' పథకానికి కేటాయింపులు చేశారు.

విదేశాలు సహా దేశీయంగా ప్రచారం, తగిన సౌకర్యాల కల్పనతో పర్యాటక రంగం భారత్‌కు విదేశీ మారకాన్ని తెచ్చిపెట్టే పాడి ఆవు అవుతుంది. భారత్‌కు ఆధ్యాత్మికంగా ఉన్న పేరు ప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పర్యాటకులను ఆకర్షించేందుకు



తన ప్రయత్నాలను ముమ్మరం చేయవలసి ఉంటుంది.

**బడ్జెట్ పై నిరర్థక విమర్శలు**

స్థూలంగా బడ్జెట్‌లో ప్రధాన ప్రతిపాదనలు ఇవి. నిజానికి బడ్జెట్ ప్రతిపాదనలపై వస్తున్న విమర్శలన్నీ రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నవే, అందులో ఎక్కడో అణుమాత్రం సత్యం ఉండవచ్చు తప్ప అదే పరమ సత్యం కాదు. అవేంటో చూద్దాం–

మొదటగా కూటమి భాగస్వాములైన తెలుగు దేశం, జనతాదళ్ (యు)లకు ఇతర రాష్ట్రాలకు నష్టం చేకూరుస్తూ బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రాధాన్యతలను ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం అవివేకం. ఎందుకంటే, బడ్జెట్ అనేది ఈ దేశానికి మొత్తానికి సంబంధించిందే తప్ప ఈ రెండు రాష్ట్రాలకూ కాదు. ఒకవేళ వారికి ఎక్కువ ఇచ్చినా, పేద రాష్ట్రమైన బిహార్‌కు లేదా ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మించుకునేందుకు తోడ్పడడంలో నైతికంగా ఎటువంటి తప్పు ఉండదు. ఆంధ్రప్రదేశ్‌ను 2014లో విభజించే సమయంలో ఆ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోలేదు.

పూర్వోదయ రాష్ట్రాలకు (పేద) నిధుల కేటాయింపు కేవలం బిహార్‌కే జరుగలేదు, అవి ఝార్ఖండ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్‌కు కూడా తోడ్పడతాయి. వరద నియంత్రణ చర్యలకు కేటాయించిన నిధుల విషయమైనా అంతే, అవి హిమాచల్‌కు, ఉత్తరాఖండ్‌కు కూడా అందుతాయి. అన్నింటికన్నా ఇక్కడ గుర్తించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, ఈ వ్యయాలన్నీ కూడా కుదించిన ఈ బడ్జెట్ సంవత్సరంలోనే జరుగవు. అవి పలు ఏళ్లకు వ్యాపిస్తాయి. ఇతర రాష్ట్రాలు తమ బకాయిలను వచ్చే ఏడాది పొందేందుకు ఆస్కారం ఉంది.

ఇక మరొక విమర్శ ఉపాధి, ఉద్యోగాలకు సంబంధించింది. బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు మూడు, స్కిల్లింగ్‌కు రెండు పథకాలు ఉన్నాయి. ఈ పథకాలన్నీ విఫలమవుతాయన్నట్టు ప్రతిపక్షాలు మాట్లాడుతున్నప్పటికీ, అన్నీ విఫలం కావడం వారి కోరిక తప్ప సత్యం కాదు. ఈలోగా, ప్రభుత్వం ఏదో ఒక స్థాయిలో వీటిని అమలు చేసి, ఏది బాగా పని చేస్తోందో తెలుసుకుని, ఆ పథకానికి వచ్చే బడ్జెట్‌లో నిధులను ఎక్కువగా కేటాయించవచ్చు. ఇందుకోసం ఈ పథకాల అమలును పర్యవేక్షించి, అప్పటికప్పుడు అవసరమైన దిద్దుబాటు చర్యలను సూచించే ఉపాధి, స్కిల్లింగ్ నిపుణుడిని ప్రభుత్వం నియమించుకోవాలి. ఆ వ్యక్తి రాష్ట్రాలను కూడా కలుపుకుపోయేలా ఉండాలి.

పలు కారణాలతో అసలైన పాలక వ్యవస్థలైన రాష్ట్రాలూ, స్థానిక సంస్థలు ఉపాధి, ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు చేపట్టిన సంస్కరణలను అడ్డుకుంటుండగా, అంతా కేంద్రమే

చేయాలని ఆశించడం సమంజసం కాదు కదా?

పన్నులు కట్టే ఉద్యోగులకు ఎటువంటి ఊరటను కల్పించలేదనే విమర్శ ఉంది. అయితే, ఈ నూతన పన్నుల వ్యవస్థలో తక్కువ కోతలు ఉన్నప్పటికీ, పన్ను రహిత పరిమితిని పెంచిందనేది వాస్తవం.

అలాగే, వివిధ తరగతుల ఆస్తులకు సంబంధించి మూలధన లాభాల పన్ను విధానంలో మార్పులు మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌లపై ప్రభావం చూపుతాయనే విమర్శ కూడా ఉంది. లిస్టెడ్ షేర్లకు దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్ను 12.5 శాతానికి పెరిగ్గా, రియల్ ఎస్టేట్‌కు అదే స్థాయికి తగ్గించారు.

కానీ, రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ కూడా కాస్ట్ ఇండెక్సేషన్ గతంలో ఉన్న ప్రయోజనాన్ని కోల్పోయింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ వ్యాపారం కోసం సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టిటి) కూడా పెంచగా, దానితో పాటుగా షేర్ల నుండి స్వల్పకాలిక మూలధన లాభాలపై కూడా పెంచారు.

దీనిపై వస్తున్న విమర్శలు మరీ అతిగా ఉంటున్నాయి. ఉపాధిని పెంపొందించడం దీర్ఘకాలిక లక్ష్యం అయితే, శ్రమకు, శ్రామిక శక్తికి విరుద్ధంగా మూలధన పెట్టుబడి నుంచి వచ్చే ఆదాయానికి అధిక ప్రోత్సాహకాలు ఉండ కూడదని నిపుణులు చెబుతున్నారు. పైగా, వ్యక్తుల పై అత్యధిక పన్ను రేటు 30 శాతం-ప్లస్ అయినప్పుడు, ఇది ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణ నిధుల నుండి వచ్చే ఆదాయాలకు వర్తిస్తున్నప్పుడు, దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఆ స్థాయిలో మూడవ వంతు పన్ను విధించడంలో తర్కం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఖచ్చితంగా రిస్క్ క్యాపిటల్‌ను ప్రోత్సహించాలి, అయితే అసలు సమస్య మూలధనం, శ్రమపై ఆర్జించే ఆదాయాల రేట్ల మధ్య గల భారీ అంతరం. ఈ అంతరాన్ని కొంతమేరకు మూసివేయడం అవసరం, అందుకోసం ప్రత్యేకించి ఉద్యోగాల ఆటోమేషన్ ఆచరణీయమైన ఎంపికే అయినా, ఎక్కువమంది కార్మికులను నియమించుకునేలా కంపెనీలను ఆ యత్నం ప్రోత్సహించాలి.

ఎంఎస్‌ఎంఇలు, పట్టణ గృహ నిర్మాణాలకు సంబంధించిన అంశాలు కూడా ఉపాధి సృష్టి బాటలోనే ఉన్నాయి. అంతేకాదు, పెద్ద కంపెనీలు కాకుండా ఎంఎస్‌ఎంఇలు, స్టార్టప్‌లు (ఏంజెల్ ట్యాక్స్ రద్దు నుండి ప్రయోజనం పొందు తాయి) ఉద్యోగాలలో వృద్ధికి చోదకులుగా ఉంటాయి.

గమనించదగ్గ పెద్ద విషయం ఏమిటంటే, బడ్జెట్ ప్రవేశపెడుతున్న అన్ని పథకాలు - అది ఉపాధి, నైపుణ్యం, ఎంఎస్‌ఎంఇలకు మద్దతు, పట్టణ గృహాలు లేదా మూలధన లాభాలపై అధిక పన్నులు వంటివన్నీ కూడా కార్మికులకు అనుకూలంగా పథకాలు అమలయ్యేలా సమలేఖనం కావడం. ★

# వికసిత భారతానికి దిక్సూచి




**కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 7వసారి లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2024-2025 వార్షిక బడ్జెట్‌ను సమర్పించినప్పటి వాతావరణం వేరు. అయినా ప్రభుత్వ సుస్థిరతకో, యూపీలో ఉప ఎన్నికల కోసమో, లేదా ఈ ఏడాది జరగనున్న మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో లబ్ధి కోసమో విన్యాసాలు చేయలేదు. పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధి, వికసిత భారత్ లక్ష్యంగా రూ. 48.20 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆర్థికవ్యవస్థలో సమీకృత సమ్మిళిత సమగ్రాభివృద్ధి దిశగా ప్రవేశ పెట్టిన బడ్జెట్ భారత ఆర్థికవ్యవస్థను ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందించేందుకు పునాదిగా నిలుస్తుందని ఆశించవచ్చు. యువత, వెనుకబడిన వర్గాలు, మహిళలు, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనకరంగా వ్యవసాయ 'పారిశ్రామిక' సేవా రంగాలలో ఉత్పాదకత ఉపాధి 'మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడం అభినందనీయం.**

ఆర్థిక వ్యవస్థలో అపార అవకాశాలు సృష్టించడమే లక్ష్యంగా 9 ప్రాధాన్యతాంశాలను కేంద్రం ఎంపిక చేసింది.

1. వ్యవసాయరంగంలో ఉత్పాదకత 2. ఉద్యోగ కల్పన, 3. నైపుణ్యాభివృద్ధి 4.సామాజిక న్యాయం 5. పట్టణాభివృద్ధి 6. ఇంధన భద్రత 7. మౌలిక రంగం 8. పరిశోధనలు- ఆవిష్కరణలు 9. తయారీసేవలు, సంస్కరణలు పారిశ్రామిక సేవా రంగాల్లో వృద్ధి, అభివృద్ధి వ్యూహాలతో స్థూల ఆర్థిక వ్యవస్థ మెరుగుపరిచే దిశగా ఆర్థిక క్రమశిక్షణ పెంచడానికి ఉద్దేశించినదిగా ఈ బడ్జెట్‌ను పేర్కొనవచ్చు.

**గ్రామీణాభివృద్ధి**

గ్రామీణాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో 2.66 లక్షల కోట్లు కేటాయించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన పథకం కింద అదనంగా మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం పీఎం గ్రామ సడక్ యోజన నాలుగో దశ పథకం ద్వారా 25 వేల ఆవాసాలు లబ్ధి పొందుతాయి.

**వరద నివారణ నీటిపారుదల**

రాష్ట్రాల్లో వరద నివారణ నీటిపారుదల ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ. 11,500 కోట్లు ప్రకటించారు. నిర్మాణంలో ఉన్న మరో 20 నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తిచేయనున్నట్లు చెప్పారు. భారీ వర్షాలతో సతమత మవుతున్న హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాల్లో పునర్నిర్మాణ పునరావాస కార్యక్రమాలకు సహాయం చేయనున్నట్టు వెల్లడించారు.

**సోలార్ సౌర విద్యుత్తు**

పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్స హించడం మీద కేంద్రం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా కోటి ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయిం చింది. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేవారికి ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. అణువిద్యుత్తులో

తొలిసారి ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం పలికింది.

**ఫార్మా రంగం నూతన ఆవిష్కరణలు**

ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణల ప్రోత్సాహం, అధ్యాపకులకు శిక్షణ, డిజిటల్ విద్యా విధానం, జాతీయ లైబ్రరీ ఏర్పాటు, మానవ వనరుల అభివృద్ధికి దోహదపడే చర్యలుగా పేర్కోవచ్చు.


**వ్యవసాయ రంగం, సహకార రంగానికి ప్రాధాన్యత**

వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి ప్రవేశపెట్టిన వ్యవసాయాభివృద్ధి నిధి వ్యవసాయ రంగంలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఔత్సాహిక యువతను వ్యవసాయ స్టార్టప్‌ల ఏర్పాటుకు సహకార వ్యవసాయాభివృద్ధి నిధి గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

గ్రామీణ భూములకు భూఆధార్ భూసంస్కరణలలో భాగంగా గ్రామీణ భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య భూ ఆధార్ కేటాయించాలనీ, పట్టణ ప్రాంతాల్లో భూముల రికార్డులు డిజిటీలీకరణ చేయాలని పేర్కొన్నారు. మూడేళ్లలో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయడానికి రాష్ట్రాలకు ఆర్థిక తోడ్పాటు ఇస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ పరిపాలన, ప్రణాళిక నిర్మాణం పట్టణ ప్రాంతాల అర్బన్ ప్లానింగ్ ఉపచట్టాల రూపకల్ప బాధ్యతరాష్ట్ర ప్రభుత్వాలదే. భూసంస్కరణలు వేగవంతం చేయడానికి రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు వడ్డీ రహిత రుణాల్లో గణనీయమైన మొత్తాన్ని కేటాయించాలని ప్రతిపాదించారు.

**సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం**

సాంకేతిక నైపుణ్యంతో కూడిన సేంద్రియ వ్యవసాయం విధానానికి కూడా బడ్జెట్ ప్రోత్సాహం కల్పించింది. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన కిసాన్ డ్రోన్స్ ఏర్పాటు రైతులకు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో డిజిటల్ హైటెక్ సేవలను అందించడం, సస్యరక్షణ, పిచికారి 'సేవలు' భూదస్త్రాల డిజిటీలీకరణ గ్రామీణ వ్యవసాయ ఆర్థికవ్యవస్థ అభివృధికి దిక్సూచిగా ఆక్సిలరేటర్ ఇరిగేషన్ ప్రోగ్రాం ఇతర పథకాల కింద




**నేదునూరి కనకయ్య**

**అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, హైదరాబాద్, 9440245771**




రూ.11500 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తారు.

మహిళా సాధికారికతకు పెద్దపీట వేసింది బడ్జెట్. మహిళ పేరిట ఆస్తులకు స్టాంప్ డ్యూటీ తగ్గించారు. మహిళా సాధికారితను ప్రోత్సహించేందుకు వీలుగా వారి పేర్ల మీద రిజిస్టర్ అయ్యే ఆస్తుల మీద స్టాంప్ డ్యూటీ తగ్గించారు. ప్రధానమంత్రి గ్రామీణ యోజన నాలుగో దశ కింద 25వేల గ్రామీణ ఆవాస ప్రాంతాలకు రహదారి అనుసంధానం కల్పించాలని సంకల్పించారు.

**'యువత సాధికారిత**

వచ్చే ఐదేళ్లలో 20 లక్షలమంది యువతకు నైపుణ్యాల శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పించే పథకాల అమలు. మహిళా సాధికారికతకు ప్రాధాన్యత నిస్తూ మహిళలు బాలికలను ప్రోత్సహించేందుకు 2024-25 బడ్జెట్లో వివిధ మంత్రిత్వశాఖల ద్వారా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా కేటాయించింది. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ. 26,092 కోట్లు కేటాయిం చారు.

మహిళా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ మెన్స్ కోసం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నారు. 'బేటీ బచావో బేటి పడావో' మహిళల భద్రతకు సంబంధించి ఈ బడ్జెట్‌లో రూ.3145 కోట్లు కేటాయించారు. శిశు మహిళాభివృద్ధికి సంబంధించిన పరిశోధన శిక్షణ కార్యక్రమాలు చేపట్టే ఎన్. ఐ.పి.సి.డి.కి రూ. 88.87 కోట్లు కేటాయించారు. నిర్భయ నిధికి రూ.500 కోట్లు కేటాయించారు.

ఇది మహిళా సాధికారత యువత సాధికారిత సాంఘిక సంక్షేమం అన్ని రంగాలలో పౌరులకు అవకాశాల కల్పన, ఉద్యోగాల కల్పన, నైపుణ్యం మెరుగు పరిచే దిశగా అడుగులు వేసిన బడ్జెట్ అని చెప్పవచ్చు. యువతలో ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయడానికి, ప్రపంచ స్థాయిలో ప్రతిభా పాటవాల వికాసానికి బడ్జెట్ చేయూతనిస్తుంది. మహిళలకు వృద్ధులకు మేలు చేసే పథకాలు ప్రకటించారు. సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీం కింద ప్రస్తుతం వున్న 15 లక్షల రూపాయల పరిమితిని 30 లక్షల వరకు పెంచారు.

**ఆదాయపు పన్ను**

కొత్త పన్నులో నూతన విధానానికి బడ్జెట్లో పెద్దపీట వేశారు. ప్రస్తుత నిబంధన ప్రకారం రూ.7 లక్షల ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్ను ఉండదు. ఉద్యోగులకు 50 వేల వరకు ప్రామాణిక తగ్గింపు వర్తిస్తుంది. ప్రస్తుతం వున్న 6ఆదాయపు పన్ను స్లాబులను 5 స్లాబులకు తగ్గించారు ఆదాయ, పన్ను పరిమితి 7లక్షల నుండి 10 లక్షల వరకు పెంచారు. గతంలో 10 శాతం పన్ను చెల్లించేది దాన్ని బడ్జెట్లో ఎత్తివేశారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధి**

ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్లో రూ.11, 11, 111 కోట్ల మూలధన వ్యయంగా నిర్ణయించారు. మౌలిక వసతుల్లో ప్రైవేట్ పెట్టుబడులను పెంచే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రాబోయే ఐదు సంవత్సరాలు కాలంలో మౌలిక వసతులకు బలమైన ఆర్థిక మద్దతు సాధించడానికి మార్కెట్ ఆధారిత సహాయ విధానాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు. రైల్వేల అభివృద్ధికి, కొత్త రైల్వేల నిర్మాణానికి మౌలిక వసతుల అభివృధికి అధికంగా నిధుల కేటాయింపు, ఏర్ కనెక్టివిటీ, కొత్త ఏర్ పోర్టులు ఏర్పాటు, రాష్ట్రాలకు వడ్డీలేని రుణాలు పథకం 13 పీఎం ఆవాస యోజనకు పెద్ద ఎత్తున కేటాయించడం వల్ల ఆర్థికవ్యవస్థలో ఉత్పాదక ఆస్తుల కల్పనకు ఊతం ఇస్తుంది. బడ్జెట్ సుస్థిర సమ్మిళిత అభివృధికై స్థిరమైన స్థూల ఆర్థిక వాతావరణం సృష్టించి శీఘ్రతర ఆర్థికాభివృదితో ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత ఉపాధి ఆదాయ సృష్టికి దోహద పడుతుంది.

**చేతివృత్తులకు ప్రోత్సాహం**

పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ ప్యాకేజీలో భాగంగా సంప్రదాయ చేతి వృత్తుల వారు తమ ఉత్పత్తుల నాణ్యత పెంచుకునే విధంగా చర్యలు చేపట్టడం ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకం

బడ్జెట్‌లో ఉంది.

సూక్ష్మ చిన్న మధ్య సాయి సంస్థల కోసం క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ఈ బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ స్కీం ద్వారా ఎం 'ఎస్,ఎం' సంస్థలు యంత్రాలు, పరికరాలు కొనుగోలు కోసం ఎలాంటి తనఖా లేదా థర్డ్ పార్టీ గ్యారంటీ అవసరం లేకుండా టర్మ్ లోన్ తీసుకునే అవకాశం కల్పించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల వ్యాపార అభివృద్ధి అంతర్జాతీయంగా పోటీ పడేట్లు చర్యలు చేపట్టనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ ఫైనాన్స్ ఫండ్ ప్రతి దరఖాస్తుదారుకు తీసుకునే రుణ విలువలో రూ. 100 కోట్ల వరకు ప్రభుత్వం గారంటీ కల్పిస్తుంది. ఈ చర్య సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల ప్రగతికి దోహదపడుతుంది.



**స్వదేశీ ఉత్పత్తులు**

మేకిన్ ఇండియా దేశంలో 14 రంగాలకు ఉత్పాదకతతో ముడివడిన ఆర్థిక ప్రోత్సాహకాల ద్వార 60లక్షల శాశ్వత ఉద్యోగాల కల్పన స్వదేశీ ఉత్పత్తులకు ఊతంగా నిలిచింది బడ్జెట్.

**రహదారులు పట్టణాభివృద్ధి**

14 పెద్ద నగరాలకు పట్టణాలకు ప్రతేక రవాణా అభివృద్ధికి అభివృద్ధిని నూతన పట్టణ ప్రణాళిక నిర్మాణ రంగంలో వికసిత్ భారత్‌లో భాగంగా 2024-25 బడ్జెట్లో పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత దక్కింది. గృహ నిర్మాణం పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖకు 82,576.57 కోట్లు కేటాయించారు. అది 2023-24 నాటి సవరించిన అంచనాల కన్న ఎక్కువ.

అల్పాదాయ వెనుకబడిన వర్గాల కోసం రూ. 3000 కోట్లు కేటాయించారు. దీని వల్ల సొంతింటి కల నిజమవుతుంది. మురికివాడల పునరావాసం, అభివృద్ధి కార్యక్రమానికి తగిన ప్రాధాన్యం దక్కలేదు. అక్కడ నివసించే ప్రజలకు తన భూమికి సంబంధించిన హక్కు పత్రాలు ఉండవు. అందువల్ల వారందరూ పీఎంఏవైకు (యూ) దూరమవుతున్నారు. ఫలితంగా పట్టణ పేదలతో పోలిస్తే ఈ పథకంతో మధ్య అధికాదాయ వర్గాలకే ప్రయోజనం కలుగుతుంది. ఈ క్రమంలో జిఐఎస్ మ్యాపింగ్ ద్వారా భూమి రికార్డులను డిజిటలీకరణ ప్రక్రియ సరిగ్గా అమలు చేయాలి.

బడ్జెట్లో పారిశ్రామిక కార్మికుల వసతి కోసం అద్దె ఇల్లుకు సంబంధించి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో చేసిన ప్రతిపాదన స్వాగతించదగ్గ చర్య. స్మార్ట్ సిటీస్ మిషన్‌కు 2023-24 సవరించిన అంచనాల్లో రూ. 8000 కోట్లు కేటాయించగా 2024-25 బడ్జెట్లో అవి రూ. 2400 కోట్లకు పరిమితమైనాయి. అమృత్ పథకం కింద 500 నగరాల కోసం రూ. 8వేల కోట్లు ప్రతిపాదించారు. ఇది గతం కన్నా 54 శాతం ఎక్కువ. స్వచ్ఛభారత్ మిషన్ పథకానికి రూ. 5వేల కోట్లు కేటాయించారు.

**బడ్జెట్లో నదుల అనుసంధానం**

బాల కార్మిక వ్యవస్థ, నిర్మూలన లింగ వివక్ష, కనీస వేతనాలు ప్రస్తావన లేదు బడ్జెట్‌లో లేదు. పట్టణ పేదల జీవనోపాధికి తగిన కేటాయింపులు లేవు. జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ కార్యక్రమానికి కేటాయింపులు తగ్గాయి. ప్రధానమంత్రి వీధి వ్యాపారులు ఆత్మ నిర్భర నిధి పథకం కేటాయింపుల్లో కోత పడింది. ఎంపిక చేసిన నగరాల్లో 100 వార సంతలు ద్వారా పెద్ద సంఖ్యలో ఉన్న వీధి వ్యాపారుల పట్టణ సంఘటిత కార్మికుల జీవనోపాధి సమస్యను తీర్చడం కష్టమే. 30 లక్షల జనాభా దాటిన 14 పెద్ద నగరాల్లో ప్రయాణ ఆధారిత అభివృద్ధి ప్రణాళికలపై బడ్జెట్ పెట్టింది. ఇందుకోసం పిఎంఈ బస్సు సేవా పథకం కోసం తాజా పద్దులో రూ.1300 కోట్లు కేటాయించడంతో సిటీ బస్సు సేవలు విస్తరిస్తాయి. ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగు పడతాయి.

**రాష్ట్రాల ప్రగతికి వడ్డీ లేని రుణం**

రాష్ట్రాలకు చేయూత నిచ్చే విధంగా రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధికి కేంద్రం ఎలాంటి వడ్డీ లేకుండా రూ. 1.5 లక్షల కోట్ల దీర్ఘకాలిక రుణ సదుపాయం కల్పిస్తుంది. రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు అభివృధి పరుస్తామని బడ్జెట్లో పేర్కొనడం గమనార్హం. రహదారి ప్రాజెక్టులకు మరో 26 వేల కోట్లతో అభివృద్ధి చేస్తారు.

**విద్య వైద్య రంగాలకు పెద్దపీట**

బడ్జెట్‌లో విద్యా రంగానికి గత బడ్జెట్‌తో పోలిస్తే రూ. 9 వేల కోట్లు తగ్గించారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు బడ్జెట్లో రూ .1300 కోట్ల నుండి రూ. 1800 కోట్లకు పెంచారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు 28 శాతం పెంచారు. గత సంవత్సరం 12,000.08 కోట్లు ఇవ్వగా ఈసారి 15,472 కోట్లు నిధులు పెరిగాయి. కేంద్రీయ విద్యాలయాలు నవోదయ విద్యాలయాలు ఎన్సీఈఆర్టీ పీఎం శ్రీ పాఠశాలకు బడ్జెట్ పెరిగింది.



స్వదేశీ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యకు రూ. 10 లక్షల రుణం ఏటా లక్షమంది విద్యార్థులకు వడ్డీలో 3 శాతం రాయితీ ఇస్తారు. పేద వర్గాల విద్యాభివృద్ధికి దోహదపడే చర్య. గిరిజనుల సామాజిక ఆర్థిక అభివృద్ధికి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ప్రతేక పథకాన్ని ప్రవేశపెట్టి 63 వేల గిరిజన గ్రామాల్లో 5 కోట్ల మంది గిరిజనులకు లబ్ధి చేకూర్చబోతున్నారు.

ఏకలవ్య గురుకులాల ఏర్పాటు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి మారుమూల ప్రాంతాలలో ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల ఏర్పాటుకు రూ.6339 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యను అభ్యసించే ఎస్టీ విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్ స్కాలర్షిప్ కు రూ. 165 కోట్లు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీ సంక్షేమానికి రూ. 6611. 69 కోట్లు కేటాయించారు.

**ఆరోగ్యరంగం**

ఆరోగ్యరంగానికి 90.958 కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కంటే 12.96% ఎక్కువ. మూడు రకాల క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ ప్రకటించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ. 3712.49 కోట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు రూ. 3.301 కోట్లు, ఆరోగ్య పరిశోధన శాఖకు రూ. 73 కోట్లు కేటాయించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.36 కోట్లు, పీఎంజేఏవైకి రూ. 7300 కోట్లు కటాయించారు.

**ప్రాథమిక పరిశోధనలు ప్రత్యేక నిధి**

యూనివర్సిటీలలో, కాలేజీల్లో లేబరేటరీల్లో ప్రాథమిక పరిశోధనల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు 'అనుసంధాన్ జాతీయ పరిశోధన నిధిని' ఏర్పాటు చేయడం అభినందనీయం.

**అంతరిక్ష రంగానికి నిధుల పెంపు**


అంతరిక్ష రోదసి పరిజ్ఞానాభివృద్ధికి, ఊతం ఇవ్వడానికి రూ.1000 కోట్లతో ఒక వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నిర్మల సీతారామన్ ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ఐదు రెట్లు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించి బడ్జెట్లో 18% నిధులు పెంచారు.

**డిజిటల్ యూనివర్సిటీ సాకారం**

ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్య అందించడం కోసం ఏర్పాటైన డిజిటల్ విశ్వవిద్యాలయం తాజా బడ్జెట్లో కేంద్రం రూ. 100 కోట్లు కేటాయించింది. ఈ విద్యా సంవత్సరంలో ఎస్డియూ అందుబాటులోకి రానుందని స్పష్టం చేసింది

**నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు**

పంచాయతీలు, వార్డ్ స్థాయిలో లైబ్రరీలు ఏర్పాటు చేసేలా రాష్ట్రాలను ప్రోత్సహించడం వలన మానవ వనరుల వికాసానికి విజ్ఞాన వికాసానికి దోహదం పడుతుంది. వ్యవసాయ రంగం ఉత్పాదకత



పెంచే లక్ష్యంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్లో రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల అభివృద్ధికి వ్యవసాయ పరిశోధనలు ప్రోత్సహించడం, కూరగాయల సాగుకు భారీ క్లస్టర్స్ ఏర్పాటు చేయడం, కూరగాయల సేకరణ, 'నిల్వ, మార్కెటింగ్ సరఫరా, వ్యవస్థల ఏర్పాటుకు స్టార్టప్‌లు, సహకార సంఘాలు, రైతు సంఘాలను ప్రోత్సహించడానికి బడ్జెట్ అవకాశం కల్పించింది.

వాతావరణ మార్పులను తట్టుకునేలా 32 వ్యవసాయ ఉద్యాన కేటగిరిలకు 109 రకాల నూతన అధిక దిగుబడి వంగడాలను ప్రోత్సహిం చడం, పప్పుధాన్యాల ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆవాలు, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు లాంటి నూనె ఉత్పత్తికి కూడా బడ్జెట్ చేయూతనిస్తున్నది. దేశవ్యాప్తంగా 400 జిలాల్లో డిజిటల్ పంటల సర్వేలు నిర్వహించడానికి కూడా ప్రతిపాదనలు ఉన్నాయి.

**బిందు సేద్యం ఆపరేషన్ గ్రీన్ పథకం కోసం నిధులు నిరాశ**

బడ్జెట్లోపంటలకు సాగునీటి పొదుపుసూక్ష్మ సేద్యం పథకానికి బిందు తుంపర్ల పరికరాలపై రైతులకు రాయితీలు లేవు. జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్ (ఈనామ్) 1000 కొత్త మార్కెట్లను ఆన్‌లైన్ వేదికలోకి తీసుకు వచ్చే దిశగాచర్యలు లేకపోవడం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ దారుల ఉత్పత్తులకు మద్దతు ధరలు లభించని స్థితి రైతాంగాన్ని నిరాశకు గురిచేసేదే. దీర్ఘకాలిక దృష్టితో రూపొందించిన బడ్జెట్ వికసిత భారతానికి బాట వేస్తూ భారత్‌ను అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించి, ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దడానికి కావలసిన ఏర్పాట్లను బడ్జెట్ చేసింది. అందుకు అవసరమైన ఉపాధి, ఉద్యోగ, మౌలిక వసతులు, నైపుణ్యం, పారిశ్రామికీకరణ లాంటి ప్రధాన అంశాలకు బడ్జెట్లో ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని సాధించి విశ్వగురు స్థాయికి ఈ బడ్జెట్ చేర్చుతుందని ఆశిద్దాం. ★


## వెంటనే కావలెను

జాగృతిలో పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్ కావాలి. ఫొటో షాప్, పేజీ మేకర్‌లో పేజీలు డిజైన్ చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. తెలుగు టైపింగ్ వచ్చి ఉండాలి. డిగ్రీ/ఇంటర్మీడియట్ పాసైనవారు అర్హులు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మా కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. జీతం: రూ.15,000/- నుంచి రూ.20,000/- (ప్రతిభను బట్టి). ఆసక్తి గల అభ్యర్థులు jagritiweekly@gmail.com కు పూర్తి బయోడేటాను పంపించండి. వివరాలకు: 9959991304 / 9848946354.



# ఓడితే అసెం

కల్వకుంట్ల చంద్రశేఖరరావు తెలంగాణ జాతిపితగా స్వయం ప్రకటిత నేత. ఉద్యమ పార్టీగా చెప్పుకున్న బీఆర్ఎస్ పార్టీని నడిపిన నాయకుడు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్ల పాటు.. ప్రభుత్వాన్ని నడిపించిన ముఖ్యమంత్రి. కానీ, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రాభవం కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఘోరంగా ఓటమిపాలు చేశారు ఓటర్లు. ఇక, లోక్‌సభ ఎన్నికల సమయానికి వచ్చేసరికి అసలు లోక్‌సభలో ప్రాతినిథ్యమే లేకుండా చేశారు. అయితే, ఉద్యమ పార్టీగా ఉన్నంతకాలం.. ప్రజలను సెంటిమెంట్‌తో ఆకట్టుకుంటూ పార్టీని నడిపించుకున్న కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార దర్పంతో పార్టీని నిలబెట్టుకున్న కేసీఆర్.. ఇప్పుడు ప్రజలు ఆ పార్టీ అధికారాన్ని కాదనడంతో తట్టుకోలేకపోతున్నారు. కనీసం అసెంబ్లీకి రావడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. చర్చల్లో పాల్గొనేందుకూ సిద్ధం కావడం లేదు. మొత్తానికి అందివచ్చిన అధికారాన్ని అనుభవించడానికి... ఉద్యమ కాలంలో ప్రజలు, ఉద్యమ సంఘాల అండతోనే పార్టీని నడిపించడానికి ముందున్న కేసీఆర్.. పదేళ్ల నియంతృత్వాన్ని ప్రజలు కాదన్నారన్న కారణంగా.. కనీసం చట్టసభకు కూడా హాజరు కావడం లేదు. పార్టీ నాయకులతో క్రమం తప్పకుండా సమీక్షలు చేపట్టడం లేదు. కనీసం మీడియాతో మాట్లాడేందుకూ సమయం ఇవ్వడం లేదు. మీడియాలో వార్తలువస్తే మాత్రం పరువునష్టం అంటూ.. ఇంకేదో అంటూ మీడియా స్వేచ్ఛపై జులుం ప్రదర్శిస్తున్నారన్న విశ్లేషణలు కొంతకాలంగా సాగుతున్నాయి.

తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు కేసీఆర్ ఆసక్తి చూపడం లేదు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ప్రజల సమస్యలను చర్చించేందుకు గానీ, ప్రభుత్వం చేసే పొరపాట్లను ఎత్తిచూపేందుకు కూడా ముందుకు రావడం లేదు. అంటే.. అధికారం వస్తే పాలన సాగిస్తాం.. లేదంటే ఫామ్‌హౌజ్‌కే పరిమితమవుతాం.. అన్నట్లుగా కేసీఆర్ వ్యవహార శైలి ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి.

ఆ బడ్జెట్ సమావేశాల్లోనైనా కేసీఆర్ పాల్గొంటారని, చర్చలో పాల్గొంటారని, సర్కారు లెక్కల్లో పొరపాట్లను ఎత్తిచూపుతారని అందరూ భావించారు. కానీ, అందరి ఆలోచనలను కూడా కేసీఆర్ తలకిందులు చేసేశారు. అసలు ఎన్నికల తర్వాత జరిగిన అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారానికి కూడా కేసీఆర్ హాజరు కాలేదు. ఆ ప్రక్రియ అంతా పూర్తయ్యాక.. స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ప్రమాణ స్వీకారం చేశారు కేసీఆర్. ఇక, అప్పటినుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదు. కానీ, బడ్జెట్ సమావేశాలకు మాత్రం కేసీఆర్ హాజరవుతారని లీకులు ఇచ్చారు. కానీ, మొదట్లో కేసీఆర్ సభకు హాజరు కాలేదు. కానీ, బడ్జెట్ ప్రవేశ పెట్టినరోజు జూలై 25వ తేదీన మాత్రం అసెంబ్లీకి వచ్చారు కేసీఆర్. ఆరోజు ఎలాగూ సభ్యులకు మాట్లాడేందుకు సమయం ఉండదు. చర్చ మొదలు కాదన్న విషయం అందరికీ తెలిసిందే.

**చీల్చి చెండాడుతానంటూ....**

కేసీఆర్ బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు సభకు హాజరై ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన బడ్జెట్ ప్రసంగాన్ని ఓ శ్రోతలా విని వెళ్లిపోయారు. అయితే, వెళ్తూ.. వెళ్తూ.. మీడియా పాయింట్ వద్ద తనదైన శైలిలో వాగ్దాటి ప్రదర్శించారు. ఒక్కరోజు మురిపెంగా దాన్ని మార్చుకున్నారు. రాష్ట్ర బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉందని, మునుముందు బ్రహ్మాండంగా ఈ బడ్జెట్‌పై చీల్చి చెండాడుతామని తేల్చిచెప్పారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇది రైతు శత్రువు ప్రభుత్వం అని తేలి పోయిందన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డా రు. అంకెలు వచ్చినప్పుడల్లా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను నొక్కి నొక్కి చెప్పడం తప్ప కొత్తగా ఏం లేదన్నారు. గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేసే బడ్జెట్ అని మండిపడ్డారు. ఇండస్ట్రీయల్ పాలసీ ఏమిటి..? ఏం లేదు వట్టిదే గ్యాస్.. ట్రాష్ అని మండిపడ్డారు.

కానీ,ఆ తర్వాత అసెంబ్లీకి ముఖం చూపించలేదు కేసీఆర్. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చకు కేసీఆర్ దుమ్మా కొట్టారు. ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతానని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రకటించిన ఆయన.. అసలు సభకే రాలేదు. ఇంటికే పరిమితమయ్యారు. దీంతో, కేసీఆర్ తీరును అధికారపక్ష నేతలు కడిగి పారేశారు. చీల్చి చెండాడుతానని చెప్పిన ఆయన సభకు రాకుండా యాడికి పోయారని సభకు హాజరైన హరీశ్‌రావు, కె.తారకరామారావు అధికార పక్షం నేతలు ప్రశ్నించారు. "కేసీఆర్ మమ్మల్ని ఎట్ల చీల్చి చెండాడుతాడో చూద్దామని సభకు పొద్దుగాల్ల 9 గంటలకే వచ్చి కూర్చున్న" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సెటైర్ వేశారు. సభకు రాకుండా కేసీఆర్ ఎక్కడ దాక్కున్నారని ఆయన నిలదీశారు. చీల్చి చెండాడుతానని హెచ్చరికలు చేసిన ప్రతిపక్షనేత ఏడ పడుకున్నారని విప్ బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. లాబీల్లో మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ తీరుపై సెటైర్లు వేశారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్యంగా బడ్జెట్ చర్చలో పాల్గొన్న హరీశ్‌రావు ఒకింత ఇబ్బందికి గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి కేసీఆర్ సభకు రావడమే మానేశారు. ప్రతిపక్షనేత అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని సీఎం రేవంత్, మంత్రులంతా పలుమార్లు ప్రశ్నించారు. అయినా, పెద్దగా స్పందన లేదు.

**కార్యకర్తల ఆశలు అడియాసలు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికీ ఓటమి ఫ్రస్టేషన్ నుంచి కోలుకోలేకపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటికి వెళ్లిపోతున్న ఎమ్మెల్యేలను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలా?వద్దా?అని తేల్చుకోలేక కేసీఆర్ తీవ్రంగా మధన పడుతున్నారని చెబుతున్నారు. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చి, ప్రభుత్వాన్ని చీల్చిచెండాడుతానని చెప్పిన కేసీఆర్ మాటలు విని బీఆర్ఎస్ నేతలు కూడా. ఇకపై తమ సారు రెగ్యులర్‌గా వస్తారని ఆశలు పెట్టుకున్నారు. కానీ,

సుజాత గోపగోని, 6302164068



# బ్లీకి రారా?

ఆయన కనిపించకపోయేసరికి తెల్లముఖం వేశారు. 'ఇక నుంచి నా ఉగ్రరూపం చూస్తారు.. చీల్చి చెండాడుతాను'అని అసెంబ్లీ వద్ద భీకర ప్రకటనలు చేసిన కేసీఆర్ ఒక్కరోజులోనే మాట తప్పారు. ఆయన అసెంబ్లీకి హాజరు అవుతారని.. రేవంత్ సర్కార్‌కు చుక్కలు చూపిస్తారని ఆశ పడిన పార్టీ కార్యకర్తల, ఆయన అభిమానుల ఆశలన్నీ అడియాసలు చేస్తూ ఊహించని షాక్ ఇచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు అసెంబ్లీకి హాజరై కేసీఆర్ చేసిన ప్రకటనతో సభలో రేవంత్, కేసీఆర్ మధ్య మాటల యుద్ధం ఉంటుందని అంతా భావించారు. కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు అధికార పక్ష నేతలు కొంత శ్రమించాల్సి వస్తుందని అనుకున్నారు. కానీ, కేసీఆర్ మాత్రం ఆ ప్రకటన చేసిన రెండో రోజే సభకు డుమ్మా కొట్టేశారు.

రాష్ట్ర బడ్జెట్ ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని పెదవి విరిచిన ఆయన సభలో అస్త్రశస్త్రాలతో అధికార పక్షాన్ని ఉతికారేస్తారని అనుకుంటే ఆయన సభకు గైర్హాజరు కావడం అందర్నీ విస్తుపోయేలా చేసింది. చీల్చి చెండాడుతానని ప్రకటించిన కేసీఆర్ ఎటు వెళ్ళారని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. అసెంబ్లీ బయట కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని కాంగ్రెస్ నేతలు సవాల్ చేస్తున్నారు. అసెంబ్లీలో రేవంత్ ను ఎదుర్కొనే విషయంలో కేసీఆర్ ఆందోళనతో ఉన్నారని అందుకే సభకు డుమ్మా కొట్టి ఉసూరు మనిపించారని చర్చ జరుగుతోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు మాజీ సీఎం కేసీఆర్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇప్పటి వరకు అసలు అసెంబ్లీలోనే అడుగు పెట్టని కేసీఆర్ తాజా సమావేశాల నేపథ్యంలో 'ఇకపై నా ఉగ్ర రూపం చూపిస్తా.. చీల్చి చెండాడుతాన'ని అసెంబ్లీ వద్ద భీకర ప్రకటనలు చేయడంతో ఆ ఒక్క మాటతో ఇక కేసీఆర్ అసెంబ్లీకి హాజరు అవుతారని..రేవంత్ ప్రభుత్వానికి నిజంగానే చుక్కలు చూపిస్తారని అందరూ భ్రమ పడ్డారు. అయితే కేసీఆర్ అధికారంలో ఉంటేనే పులి.. ప్రతిపక్షంలో ఉంటే పిల్లి అని నిరూపించుకున్నారని సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానాలు జోరందుకున్నాయి. కేసీఆర్ కు నిజంగా సత్తా ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# ఆర్ఎస్ఎస్ శాఖపై ఇస్లామిస్టుల దాడి

గత శుక్రవారం చిన్హట్ ప్రాంతంలోని చోహరియా మాత ఆలయంలో ఆర్ఎస్ఎస్ రోజువారీ శాఖను నిర్వహిస్తున్న సమయంలో రాళ్లు, ఇటుకలతో వచ్చిన ఇస్లామిస్టులు వారిపై హింసాత్మకంగా దాడి చేశారు. ఈ దాడి, తిట్ల పురాణం కారణంగా, భగవాధ్వజం సాక్షిగా జరుగుతున్న శాఖకు ఆటంకం ఏర్పడింది. స్థానికంగా నివసిస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు చెందిన స్వయంసేవకులు తమ శాఖ సెషన్ల కోసం రోజుకు రెండుసార్లు అక్కడ కలుసుకుంటారు. ఈ సందర్భంగా వారు యోగ, యెష్టి, లాఠీతో కవాతు వంటి భౌతిక విన్యాసాలను సాధన చేస్తుంటారు. క్రమశిక్షణతో, వ్యవస్థీకృతంగా జరిగే ఈ సమావేశాలు భగవాధ్వజం ఎదురుగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పాటలు, నూతన భావనలు వ్యక్తీకరణ, సలహాలు ఇచ్చిపుచ్చుకోవడం వంటివి ఉంటాయి. ఈ సమావేశాలు ఎంత శాంతియుతంగా జరుగుతున్నా, అనేక సందర్భాలలో వాటిని దుండగులు తమ లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. ఇటీవలే ఉత్తర్‌ప్రదేశ్‌లో స్వయంసేవకులపై ఇస్లామిస్టులు రాళ్లు విసిరారు.

ఈ ఘటన లక్నోలోని చిన్హట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ దాడికి స్థానిక ముస్లిం యువకులను బాధ్యులను చేశారు. సాకీబ్ సహా 8 నుంచి 10మంది గుర్తు తెలియని వ్యక్తులపై శాఖ కార్యవాహ యువరాజ్ ప్రజాపతి ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దాని ప్రకారం రాళ్లు విసిరిన ఘటన ఉదయం దాదాపు ఆరుగంటల సమయంలో జరిగింది. చిన్హట్ ప్రాంతంలో చాహరియా మాత ఆలయ ప్రాంగణంలో యువరాజ్ ప్రజాపతి ఆర్ఎస్ఎస్ శాఖను నిర్వహిస్తారు. కాగా, గత శుక్రవారం శాఖ జరుగుతుండగా రాళ్లు విసరడమే కాక, ఆ ప్రాంతంలో ఆర్ఎస్ఎస్ శాఖ జరగకుండా అడ్డుకుంటామని నిందితులు బెదిరించారు. ఎఫ్ఐఆర్ దాఖలు కావడంతో చిన్హట్ పోలీసులు ఈ వ్యవహారంలో దర్యాప్తు ప్రారంభించారు. పరిస్థితి గాంభీర్యతను గ్రహించిన పోలీసులు భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లు 191(2), 352, 232 కింద కేసును నమోదు చేశారు. దానితో పాటుగా సంఘటనా స్థలంలో శాంతిని పునరుద్ధరించారు. ఈ దాడిపై స్పందిస్తూ, ఆర్ఎస్ఎస్ శాఖపై దాడి వ్యవహారంలో కూలంకషమైన దర్యాప్తు జరిపి, కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య పేర్కొన్నారు. కాగా ఇటువంటి ఘటనలే రాజస్థానలో కూడా చోటు చేసుకున్నాయి. గత జూన్‌లో ఇటువంటి ఘటనలే జరిగినప్పుడు పోలీసులు తక్షణమే జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింప చేశారు.

(-ఆర్గనైజర్ నుంచి)





అసెంబ్లీ సమావేశాల్లో మద్యం, శాంతిభద్రతలు, ఆర్థిక అంశాలపై చర్చ జరిగింది. ఈ అంశాలతో ముడిపడిన గత ప్రభుత్వ అసమర్థ, అస్తవ్యస్థ పాలన, ప్రకృతి వనరుల దోపిడి, అవినీతి, అరాచకం, అకృత్యాలు, ఆర్థిక అస్థిరత, చేసిన అప్పులు, అధికార దుర్వినియోగంపై ఎన్‌డియే కూటమి విరుచుకు పడింది. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి రాష్ట్రాన్ని సొంతానికి రాసిచ్చేసినట్లు భావించిన వైసీపీ అధినేత జగన్ నియంతలా వ్యవహరించి ఇష్టారీతిన పాలించారన్నారు. ఇసుక, ఖనిజాలను అక్రమ మైనింగ్ చేశారన్నారు. భూకబ్జాలకు అంతేలేదన్నారు. నాణ్యత లేని మద్యాన్ని తయారుచేయించి అధిక ధరలకు విక్రయించి పారదర్శకత లేని వ్యాపారం చేశారన్నారు. అవినీతిని ప్రశ్నించిన ప్రతిపక్షాలపై దాడులు చేసి అక్రమ కేసులు పెట్టించారన్నారు. చంద్రబాబు నుంచి పవన్ కల్యాణ్, ఇతర నేతలపై పదుల కొద్దీ కేసులు పెట్టారన్నారు. అధికారాన్ని దుర్వినియోగంతో శాంతిభద్రతలు అదుపుతప్పి, సమాజంలో అశాంతి నెలకొందన్నారు. కట్టుతప్పిన శాంతి భద్రతలు, హత్యలు, అత్యాచారాలు, బెదిరింపులు, గంజాయి, డ్రగ్స్ దిగుమతితో ఆంధ్రప్రదేశ్ ఎంత నష్టపోయిందో వివరించారు. అదుపుతప్పిన పాలనను గాడిలో పెడతామని, అవినీతిని రూపుమాపుతామని, శాంతిభద్రతలను పరిరక్షిస్తామని, ఆర్థిక పరిస్థితులను చక్కబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

# శాసనసభలో వైసీపీ పాపాల చిట్టా

ఆర్థిక అంశాలపై స్పష్టతరానందున మధ్యంతర బడ్జెట్‌ను రెండు నెలల తర్వాత ప్రవేశ పెడతామని వెల్లడించారు. అయిదురోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ఎక్సైజు శాఖ, శాంతిభద్రతలు, ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాలు ప్రకటించింది. ఇదిలా ఉంటే సమావేశాలు జరిగే రోజున వైసీపీ తమ పార్టీ ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వైకాపా కార్యకర్తలపై దాడులు పెరిగి పోయాయని ఆరోపిస్తూ, గవర్నర్ ప్రసంగానికి ఆటంకాలు కలిగిస్తూ కాసేపు నినాదాలు చేసి అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు.

**కట్టుతప్పిన శాంతిభద్రతలు**

రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న శాంతి భద్రతలను



మళ్లీ గాడిలో పెడతామని, నేర రహిత సమాజమే లక్ష్యంగా అడుగులువేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. శాసనసభలో శాంతిభద్రతలపై ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన శ్వేతపత్రం మీద చర్చ జరిగింది. ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్, బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమారరాజు తదితరులు ఐదేళ్లుగా జరిగిన దారుణాలపై స్పందించారు. ఒకప్పుడు దేశానికే గర్వకారణంగా నిల్చిన ఏపీ పోలీస్ వ్యవస్థను గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అపహాస్యానికి గురయ్యేలా దుర్వినియోగం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నేతలపై కేసులు పెట్టారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద రావుపై 18కేసులు పెట్టి వేధించారు. ప్రభుత్వ ఫర్నిచర్ తిరిగి ఇవ్వలేదని కేసులుపెట్టారు. తన ఇంట్లోనూ ప్రభుత్వ ఫర్నిచర్ ఉంచుకున్న జగన్ ఏం సమాధానం చెబుతారని చంద్రబాబు ప్రశ్నించారు. మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాలపైన, టెక్కలిలో జనసేన కార్యాలయంపైనా దాడి చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మా కార్యకలాపాలను అణచివేయడానికి జీవో–1 తీసుకొచ్చారు. ఇంట్లో నుండి బయటకు రాకుండా గృహనిర్బంధం చేశారు. ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడ్డారు. ఎస్సీలు 192 మంది, ఎస్టీలు 58 మంది హత్యకు గురయ్యారు. ఐదేళ్లలో మొత్తంగా 2,027మంది మహిళలు హత్యకు గురయ్యారు. ఒక్క అమరావతి రైతుల్లో 269 మందిపైన క్రిమినల్ కేసులు పెట్టారు, 2,525 మంది రైతులను అరెస్టు చేశారు. స్థానిక ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, హింస, దాడులకు పాల్పడ్డారన్నారు. అన్ని చోట్ల ఇష్టానుసారంగా ఓట్లు గుద్దుకున్నారు. అందుకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయకుండా బహిష్కరించాం. మరోపక్క దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఏపీలోనే ఉండటంతో పాటు మారుమూల గ్రామానికి వెళ్లినా గంజాయి దొరికే పరిస్థితి ఏర్పడింది. 'నేరగాడు ముఖ్యమంత్రిగా ఉంటే ఏం జరుగుతుందో గత ఐదేళ్లలో చూశాం. పోలీసు శాఖలో మార్పు తీసుకొస్తాం, కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పిస్తాం' అని ప్రభుత్వం ప్రకటించింది. గంజాయి, మాదక ద్రవ్యాలను వినియోగించకుండా ప్రజల్లో అవగాహన తీసుకొస్తామనీ, తన, మన అని చూడకుండా శాంతి భద్రతలు కాపా డటానికి అధిక ప్రాధాన్యత ఇస్తామనీ, చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలనీ ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు.

**మద్యం ముసుగులో దోపిడి**

గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల్లో భయంకరమైన అవినీతి జరిగిందని ప్రభుత్వం పేర్కొంది. కేవలం కమీషన్ల రూపంలోనే రూ.3113 కోట్ల దోపిడీ జరిగిందని స్పష్టం చేసింది. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఖజానాకు రూ.18,860 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించింది. ఫలితంగా పక్క రాష్ట్రాలకు మద్యం ఆదాయం పెరిగిందని, మనకు ఏర్పడిన నష్టంలో ఎవరి వాటా ఎంతనేది తేలాల్సి ఉందని తెలిపింది. మొత్తంగా గత ప్రభుత్వంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు

టిఎన్. భూషణ్



ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ మద్యం దుకాణాలలో నగదు రూపంలో నాడు లావాదేవీలను అనుమతించడాన్ని అవసరమైతే ఈడీ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టంచేసింది. 2019-24 మధ్య కాలంలో అమలైన మద్యం పాలసీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదలచేసింది. వివరాలు .... మద్యపాన నిషేధం, లిక్కర్ ఔట్‌లెట్స్ తగ్గింపు అని చెప్పి అడ్డగోలుగా దోపిడీ చేశారు. ప్రజలకు హామీ ఇచ్చామంటే అమలు చేసేదిగా ఉండాలి. మద్యం ధరలు పెంచుకుంటూ పోతే తాగేవాళ్లు తగ్గు తారని చెప్పారు. పొరుగురాష్ట్రాలతో పోలిస్తే ధరలు విపరీతంగా పెంచారు. అయినా మద్యం వినియోగం అమాంతం పెరిగిపోయింది. అయినా ఏపీలో ఆదాయం తగ్గింది. ఆ ఆదాయం వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లింది. మద్యం షాపుల్లో కేవలం నగదు మాత్రమే తీసుకున్నారు. దాదాపు లక్ష కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వ శాఖలో ఇలా జరగడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. దేశంలో దొరికే లిక్కర్ బ్రాండ్‌లు ఏపీ ఏపీలో లేవు. ఐదు టాప్ బ్రాండ్ల కంపెనీలను తరిమేశారు. చెల్లింపు ఆలస్యం చేయడం, ఆర్డర్లు ఇవ్వకపోవడం వంటి చర్యలతో వారిని వేధించారు. లోకల్ బ్రాండ్లు తీసుకొచ్చి షాపుల్లో అధిక ధరలకు విక్రయించారు. ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో డబ్బు తీసుకొచ్చి ఎక్సైజ్ శాఖలో పెట్టుబడి పెట్టించారు. దీంతో ఆయా శాఖలకు దాదాపు రూ. 250 కోట్ల నష్టం వాటిల్లింది. ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. సరైన పాలసీలు తీసుకొచ్చి పేదలకు అందుబాటు ధరలో మద్యం లభించే విధంగా చూడటంతోపాటు డీఅడిక్షన్ సెంటర్లనూ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఏ విధంగా ప్రక్షాళన చేయాలో శాసనసభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. మంత్రులంతా వారి శాఖల్లోని అవకతవకల్ని వెలికితీయాలి.

**వైసీపీ చేసిన అప్పులు 9.74 లక్షల కోట్లు**


వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై శాసనసభలో విడుదలచేసిన శ్వేతపత్రం ఇలా ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆదాయం తగ్గి అప్పులు పెరిగాయి. రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు చేశారు. తలసరి అప్పు రూ. 1.44లక్షలుగా ఉంది. గత ఐదేళ్లలో వ్యవసాయంలో వృద్ధి రేటు 5.7 శాతం, సేవల రంగంలో 2 శాతంతగ్గింది. వృద్ధిరేటు 13.5 నుంచి 10.5 శాతానికి పడిపోయింది. దీంతో జీఎస్ ఓపీ కంట్రిబ్యూషన్ రూ. 6.94 లక్షల కోట్లు తగ్గింది. రాష్ట్రానికి వచ్చే ఆదాయం కూడా రూ. 76,195 కోట్లు తగ్గిపోయింది. పవర్ సెక్టార్ లోనే లక్షా 29 వేలకోట్లు అప్పులుచెల్లించాల్సిన పరిస్థితి వీరి నిర్వాకం వల్ల వచ్చింది. ఇసుక అక్రమాల ద్వారా రాష్ట్రానికి రూ. 7వేల కోట్లు, గనుల దోపిడీ ద్వారా రూ. 9,750 కోట్ల నష్టం జరిగింది. పోలవరం పూర్తయి ఉంటే రూ. 45వేల కోట్ల ఆదాయం వచ్చేది. గత ప్రభుత్వం కేంద్ర పథకాలను సరిగా వినియోగించలేదు. స్థానిక సంస్థలకు కేంద్రం కేటాయించిన నిధులను మళ్లించారు. స్టేట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు చేశారు. 33 విభాగాల్లో ఉన్న రూ. 4,700 కోట్లు మళ్లించారు. స్పెషల్ మార్జిన్ పేరుతో రూ. 20,676 కోట్లు ఏపీఎస్‌బీసీఎలు మళ్లించారు. ఏఆర్ ఈటీ పెట్టి రూ. 14,275 కోట్లు మళ్లించారు. 15 ఏళ్ల ఆదాయం మళ్లించేందుకు ఏఆర్టీపెట్టారు. విశాఖ పట్నంలో రూ. 1,942 కోట్ల విలువైన ఆస్తులు తాకట్టు పెట్టారు. దాదాపు రూ. 40వేలకోట్ల విలువైన ఆస్తులను కబ్జాచేశారు. స్థానిక సంస్థలనుంచి రూ. 3,142 కోట్లు, డిస్కంల నుంచి రూ. 2,66 కోట్లు, ప్రభుత్వ ఉద్యోగుల సేవింగ్స్ రూ. 5,243 కోట్లు మళ్లించారు.

**జగన్ నిరసన**

ఏపీలో అరాచక పాలన, హింసాత్మక పాలన కొనసాగుతుందంటూ దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైఎస్ జగన్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. శిబిరం వద్దకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, ఆ పార్టీ ఎంపీ రామ్ గోపాల్‌యాదవ్ (రాజ్యసభ), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) ప్రతినిధులు అబ్దుల్ హవాబ్,హ్యారీస్, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీ ముల్ హక్, ఏఐఏడీ ఎంకే రాజ్యసభ సభ్యులు తంబిదురై, వీసీకే పార్టీ అధ్యక్షుడు(తమిళనాడు) తిరుమా వలవన్, ఆప్ నాయకులు రాజేంద్రప్రసాద్,శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభసభ్యుడు సంజయ్‌రౌత్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, తదితర పార్టీల నేతలు, ఎంపీలు వచ్చి జగన్‌కు మద్దతు తెలిపారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 45 రోజులుగా అరాచక, ఆటవికపాలన కొనసాగుతోందని, అంతులేని దారుణాలు జరుగుతున్నాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని జగన్ ఆరోపించారు. వైసీపీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యం అయిందని, అందుకే హత్యలు,దాడులు, అకృత్యాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. 30కి పైగా హత్యలు జరిగాయని, 300మందిపై హత్యాయత్నాలు జరిగాయని వివరించారు. 560 చోట్లకు పైగా ప్రైవేట్ ఆస్తులు, 490 చోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారన్నారు. యథేచ్ఛగా 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడు భారత రాజ్యాంగం కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో దారుణ పరిస్థితి గురించి తెలుసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో అండగా నిలవాలని ఆకాంక్షించారు.

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ప్రారంభానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైకాపా నేత మాజీ ముఖ్యమంత్రి జగన్, సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మెడలో నల్ల కండువాలు, ప్లకార్డులతో నిరసన ప్రదర్శనగా అసెంబ్లీ ప్రాంగణం నుంచి లోపలికి బయల్దేరారు. వారిని అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకుని ప్లకార్డులను చించివేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులతో జగన్ వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుకూడా పోలీసుల వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ ఒక పోలీసు అధికారిని పేరు పెట్టి హెచ్చరించారు. అసెంబ్లీ గేట్ దగ్గర పోలీసుల తీరుపై జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అసెంబ్లీ హాలులోకి వెళ్లిన వైసీపీ నాయకులు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగానికి నిరసన వ్యక్తం చేసి సభను బహిష్కరించారు. అయిదేళ్ల పాటు ప్రతిపక్షాలను తమ గుండాలు, పోలీసులచే వేధించి, అణచివేసిన జగన్ ముందుగా ఈ ప్రశ్న తానే వేసుకుని తర్వాత మాట్లాడాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




34

# రామనామ ఉచ్చారణతో 'గోస్వామి' జననం

**త్యా**గులు, బలిదానం చేసినవారు, శాసకులు, సంఘసంస్కర్తలు, కవులు యిత్యాది అనేక దృక్కోణాల నుంచి పరిశీలించినట్లయితే మన రాష్ట్ర జీవన గమ్యం ఎల్లప్పుడు వెలుగొందేందుకు కారకులైన అసంఖ్యాక మానవ మాణిక్యాలు ఒకదానికంటే ఒకటి మిన్నగా కనబడుతుంటాయి. అటువంటి మాణిక్యాలు ఇతిహాసాల, పురాణాల పుటలలోనే గాక తర్వాత కాలంలో కూడా తమ స్థానాన్ని సువ్యక్తం చేసుకొని, సమకాలిక సమాజగతిని ఆనందమయం చేస్తూ వచ్చాయి.

మొగలాయిల పరిపాలనా కాలంలో ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి , యథాతథంగా సాయంత్రానికి ఇంటికి తిరిగి రావటం సందేహాస్పదం అనే పరిస్థితి అనేక సమయాలలో ఉండేది. మోసం లక్ష్యంగా పెట్టుకొని, లోభ మోహాది దుష్ట గుణాలు వ్యాపించి, ఏమి చేయాలో తెలుసుకోలేని పరిస్థితి నెమ్మది నెమ్మదిగా సమాజాన్ని వశపరచుకుంది. దానితో జాతీయచైతన్యం నశించి సమాజం స్మృతి విహీనం అయిపోయింది. తట్టుకోవడానికి వీలు లేనంత తీవ్రమైన విఘాతము సమాజానికి తగిలింది. ఇటువంటి అనేక ప్రహారాలను ఎదుర్కొని విజయం పొందే సామర్థ్యం గలిగిన ఈశ్వరాంశ సంభూతులై క్షాత్ర తేజంతో నిండిన వ్యక్తులను భారతమాత, సారెసారెకు ప్రసవించింది. "ఢిల్లీశ్వరోవా జగదీశ్వరోవా" అనే భ్రాంతిలో పడి శ్రీరామునికి మారుగా, అక్బరునే మహాపురుషుడుగా భావించే ప్రజానీకం ముందు, మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముని ఆదర్శం ఉంచి, తన మిథ్యాభిమానాన్ని వదలి, ఆదర్శోన్ముఖం, సుస్థిరమైన జీవనాన్ని గడిపిన ఒక వ్యక్తి ఆనాడు జన్మించాడు. సూక్ష్మంగా చెప్పాలంటే, తన ఆదర్శం కోసం తనని ఒక నిజమైన 'వానరంగా' చేసుకొని ఏకనాయకామనువర్తిత్వం గలిగి సుసంఘటితమైన ప్రయత్నం ద్వారానే రామ రాజ్యస్థాపన జరుగుతుందని, స్వీయ జీవితం ద్వారా ఆయన తెలియజేశారు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన వాణి అడుగుజాడలలో, సమాజమంతా నిలబడింది. రామాయణమే ప్రజా జీవనానికి ప్రేరణనిచ్చే ఒక మహాస్రవంతిగా మాన్యత గాంచింది. ఆ మహావ్యక్తియే, 'రామచరిత మానస' గ్రంథకర్త తులసీదాస్.

అది శ్రావణ శుక్ల సప్తమి. జన్మిస్తూనే, రామ నామాన్ని జపించిన బాలుడిని కన్న ఆ రోజు ఎంత మహత్వ పూర్ణమయినదో గదా! ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిగా, పుట్టుకతోనే పురుషోత్తముడైన శ్రీరాముని నామం ఉచ్చరిస్తూ, ఆ కారణంచేత, ఆశుభ్యమైన మూలా నక్షత్రంలో పుట్టి అందరిచేత అన్ని విధాల ఉపేక్షను చవిచూసిన ఆ బాలుని జీవితం అత్యంత ఆశ్చర్యకరం.

సర్వసాధారణంగా, తల్లిదండ్రుల పోషణలో, లేదా విడిగా పెరిగిన బాలుని జీవితం నష్టభ్రష్టం అవటం మనం గమనిస్తూనే ఉంటాం. దీనికి కారణాలు అనేకం కావచ్చు. కాని ముఖ్యంగా, తల్లిదండ్రుల చూపిన ఉపేక్షే బాలుడు చెడు మార్గం పట్టడానికి, పూర్తిగా భ్రష్టుపడటానికి కారణమవుతుంది. కాని ఈ బాలుడు మాత్రం మానవజీవితం అమరతత్వాన్ని తన రక్తంలో రంగ రించుకొని జన్మించాడు.

తల్లిదండ్రు నిరాదరణపాలైన ఈ బాలుని ఆలనా పాలనా పోషణ భారాన్ని కడు బీదదైన ఒక తల్లి నిర్వహించింది. తల్లి నుంచి దూరంగా పెరిగే బాలునిలో శ్రద్ధాగుణం సహజంగా అలవడుతుంది. చిన్నపిల్లలు, ఎవరివద్ద స్నేహవాత్సల్యాలు లభ్యమయితే వారినే తల్లిదండ్రులుగా భావిస్తారు. అదృష్టవశాత్తు ఒక సన్యాసి దృష్టి ఈ బాలుని మీద పడింది.

నగల వర్తకుడు ఎక్కడ విలువైన రాళ్లు దొరుకుతాయో తెలిసి కొనగలిగినట్లు, పరతత్వాన్ని ఊహించగలిగిన, సర్వగుణాలు కలిగిన బాలుడుగా ఇతనిని అతడు సందర్శించాడు. యుగయుగాలుగా అఖండం, అవిభాజ్యం భాసించిన ఆసేతు శీతనగ పర్యంతమైన మన భారతభూమి సందర్శన భాగ్యం అతనికి కలిగింది.

**– ఋషి మునిసింహ,**
**10.8.1962**

ఆధ్యాత్మికం

మన ఋషులు


# జీవకారుణ్యుడు కపిలుడు



**క**పిలముని విష్ణు అంశజుడు. కర్దమ ప్రజాపతి, దవహూతి దంపతుల కుమారుడు. వారికి తొమ్మిది మంది కుమార్తెలు, కపిలుడు సంతానం. తల్లికే సాంఖ్యా, భక్తియోగాలను బోధించిన కారణజన్ముడు. అలా ఉపదేశం పొందిన ఆమె మోక్షజ్ఞురాలైంది. ఆ క్షేత్రమే 'సిద్ధపద' అని ప్రసిద్ధమైంది. కపిలుడు, పాతాళంలోని తన ఆశ్రమంలో తపస్సులో ఉండగా, యజ్ఞాశ్వం కోసం వెదకుతూ వచ్చిన సగరపుత్రులు, అది అక్కడ ఉండడాన్ని గమనించి, ఆయనే దానిని దొంగిలించి ఉండవచ్చన్న అనుమానంతో బంధింప యత్నించారు. విష్ణుప్రీతి కోసం సగర చక్రవర్తి అశ్వమేధ యాగం సంకల్పించి, అశ్వాన్ని విడిచాడు. ఇంద్రుడు అసూయతో దానిని కపిలుడి ఆశ్రమం వద్ద కట్టేశాడు. యదార్థం తెలియని సగరపుత్రులు కపిలమునే దానిని అపహరించాడన్న భ్రమతో దురాగతానికి ఒడి గట్టారు. కపిలుడు కళ్లు తెరిచి తీక్షణంగా చూడడంతో వారు భస్మమయ్యారు. అశ్వాన్ని అనుసరించి వెళ్లిన పుత్రుల జాడలేకపోవడంతో వారి ఆచూకి కోసం సగరుడు మనుమడు అంశుమంతుడిని పంపాడు. సగరపుత్రుల అన్వేషణకు బయలుదేరిన ఆయన, కపిలమహర్షి ఆశ్రమంవద్ద భస్మరాశులు, గుర్రాన్ని

# మహాభారత యుద్ధానికి కారకులు ఎవరు?

34




**కు**రుక్షేత్ర యుద్ధానికి దుర్యోధనుడు, ధృతరాష్ట్రుడు, భీష్ముడు పాండురాజు తో పాటు, అసలు జరిగిన సమస్తానికి కృష్ణుడే కారణం అనీ అంటారు చాలామంది. ఎందుకంటే శ్రీకృష్ణుడు సాక్షాత్తుగా భగవంతుడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అవతరించాడు. ధర్మరక్షణ చేయడానికి వచ్చినవాడు. జగన్నాటక సూత్రధారి. తన అదృశ్య హస్తంతో అంతా నడిపించేడు. తెరవెనుక భాగవతము ఆడి, ఏమీ చేయనట్లుగానే ఉండి అన్నింటినీ చేశాడు కృష్ణుడు. కౌరవ పాండవులు ఇరువురు తనకు సమానమే అని చెప్పినా, పాండవులవైపు చేరి అందరినీ భంగపరిచాడు. అనేక రకాల మాయోపాయాలతో భీష్మ, ద్రోణ. కర్ణాదులను సంహరింప చేసినవాడు కృష్ణుడు. ఇటు పాండవుల పక్షంలోకూడా అభిమన్య,ఘటోత్కజాదులు ఉపపాండవులు మొదలయినవారు మరణిం చటానికి కారణం కృష్ణుడు కాదూ! ఇరుపక్షాలూ పరస్పరం యుద్ధానికి దిగి మసి కావడానికి కృష్ణుడు కాదూ కారణం? రాయబారానికి అని వెళ్లి అక్కడ రెచ్చగొట్టి సవాళ్లు విసిరి వచ్చినవాడు కాదూ కృష్ణుడు? ఇదంతా ఎందుకు చేశాడు. దుష్టశిక్షణకు. కౌరవులు పాపం చేశారు. ఆ పాపం పండింది. బద్ధలయింది. అప్పుడు భగవంతుడు అయిన కృష్ణుడు రంగంలోకి దిగాడు, జోక్యం చేసుకున్నాడు. సంహారానికి పూనుకొన్నాడు. ఆయనే చెప్పాడు కదా!

"కాలోస్మి లోక క్షయకృత్ ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః"

(నేను ఈ ప్రపంచమునెల్ల, నశింపజేయు బలిష్ఠమైన కాలస్వరూపుడను. నేనిపుడీ లోకములను సంహరించుటకై సిద్ధమైయున్నాను.) ఇక సందేహానికి తావెక్కడుంది? కృష్ణుడే కారణం యుద్ధానికి.

ఇలా రకరకాలయిన కారణాలను వెదికి చెప్పే వాళ్లు ఉన్నారు. అయితే కురుక్షేత్ర మహాసంగ్రామానికి అసలు సిసలైన కారకుడు ధర్మరాజు అని చెపితే తొందరగా నచ్చదు. ధర్మరాజు ఏం చేశాడు పాపం? అని అంటారు. కాని ఒక విషయం ఆలోచించాలి. దుర్యోధనుడిని ఎదిరించకుండా ఉంటే యుద్ధము ఎందుకు జరుగుతుంది? ధర్మరాజు అని అన్నప్పుడు పంచపాండవులు అర్థం చేసు కోవాలి. పాండవులకు కేంద్ర బిందువు ధర్మరాజు. అట్టి ధర్మరాజు, కౌరవులు ద్రౌపదిని అవమానించినపుడు సహించి ఊరుకున్నాడుగా! బాగుంది. మాయా ద్యూతానికి పిలిస్తే వచ్చాడుగా! మంచిది. ఓడిపోయి అడవులకు వెళ్లాడుగా! అజ్ఞాతవాసం చేశాడుగా! ఇంతవరకు శాంతిగానే జరిగినాయి పనులు. ఆ తరువాత ఎందుకు యుద్ధానికి కాలుదువ్వటం? హింసను ప్రేరేపించటం? యుధిష్ఠిరుడు యుద్ధము చేయనంటే కృష్ణుడు మెడలువంచి, "రా వచ్చి యుద్ధంచెయ్యి" అని అంటాడా, అనేవాడా? ఆయనదేంపోయింది? అవమానాల పాలయిన వాళ్లు, అధర్మానికి గురైన వాళ్లు, తమకేమీ జరుగలేదని ప్రశాంతంగా సంతోషంగా ఎక్కడో పడి ఉంటామంటే కృష్ణుడికేం ఖర్మ, వాళ్ల వెంటపడి "యుద్ధం చేయండహో" అని చెప్పటానికి? "రాయబారిగా పోవయ్యా" అంటే వెళ్లాడు. "సారథిగా ఉండవయ్యా"అంటే ఉండి రథం తోలాడు. "సలహా చెప్పవయ్యా", అంటే ఉచిత సలహా ఇచ్చాడు. అలా వాళ్ల కోరిక మేరకు వచ్చి ఆదుకొన్నాడే కాని అంతా తానే చేశాడా? ధర్మరాజు ఒక ప్రయత్నము చేశాడు. దానిని మనం పురుష ప్రయత్నం అనవచ్చు. దానికి కృష్ణుడు తోడ్పడ్డాడు. అంతేగాని ధర్మరాజు ప్రమేయం లేకుండా యుద్ధం జరిగిందని చెప్పటం సాహసమే అవుతుంది.

రామాయణం కూడా ఒక ఉదాహరణ. లంక సర్వనాశనం ఎందుకైంది? రావణుడివలన అంటామా? సీతాదేవి విషయంలో కూడా రాముడు సహించి ఊరుకొంటే యుద్ధం ఎందుకు జరుగుతుంది? రావణాసురుడు అలా చేస్తూనే ఉండేవాడు. ప్రజలు సహిస్తూనే ఉండేవారు? ఇక యుద్ధ ప్రసక్తి ఎక్కడ? రావణసంహారానికి రావణుడా కారణం? కాదు. రాముడే కారణం. కాబట్టి మహాభారత యుద్ధానికి కారకుడు దుర్యోధనుడుకాదు, ధృతరాష్ట్రుడు కాదు. పాండురాజు కాదు, భీష్ముడు కూడా కాదు. ధర్మరాజే యుద్ధానికి కారణం. ధర్మరాజు. భీమసేనుడు, అర్జునుడు.. ముందుకు వచ్చి నిల్చుని అధర్మాన్ని ఎదిరించినప్పుడే కృష్ణుడు వచ్చి వారికి అండగా నిలిచాడు. అంతేగాని పాపంపండి బద్ధలవుతుందిలే అని ఊరుకొంటే, అలా ఊరుకొన్న వారిని కూడా భగవంతుడు క్షమించడు. భీష్మాదులనువలెనే సంహరించివేస్తాడు. పట్టం కట్టేది ధర్మరాజులకే. ఇదే మన పరంపర.

**– వైశంపాయన, 4.09.1982**

---

చూసి, జరిగినది ఊహించి ఆ మహర్షిని శరణువేడాడు. ప్రసన్నుడైన కపిలుడు, 'ఈ అశ్వాన్ని తీసుకువెళ్లి తాతగారి యాగాన్ని పూర్తిచేయించు. నీ తండ్రుల భస్మం మీదుగా గంగాజలం ప్రవహిస్తే వారు పునరుజ్జీవులు అవుతారు' అని సూచించాడు.అలా భగీరథుడు రప్పించిన గంగ స్పర్శతో సగరపుత్రులు పుణ్యలోక ప్రాప్తిపొందారని భాగవత, భారత బ్రహ్మాండ పురాణాలు పేర్కొంటు న్నాయి.

కపిలుడు జీవకారుణ్యమూర్తి. ఉత్తమమైన గోవు వేద స్వరూపమని ఆయన భావన. మత్స్యపురాణం ప్రకారం, పుండరీకుడు అనే రాజు వేటలో భాగంగా కపిలముని ఆశ్రమ పరిసరాలో కనిపించిన లేడిపై బాణప్రయోగం చేయగా, అది కపిలా శ్రమాన్ని చేరి ప్రాణాలు విడిచింది.ఆగ్రహించిన ముని 'స్వల్పాయుష్కుడైన మానవుడు పశువు కంటే బుద్ధిజీవి అయినప్పటికీ, నోరులేని, సాధు జంతువులను చంపడం మహాపాపం. నీ శరీరంపై నీకు వ్యామోహం ఉన్నట్లే, జంతువులకు కూడా తమ తమ శరీరంపై మమత ఉండదా?'అని వైర్యాగ్య పూర్వకంగా ప్రశ్నించాడు. దానికి కలత చెందిన పుండరీకుడు, ప్రాయశ్చిత్తంగా, కత్తితో ప్రాణత్యాగానికి పాల్పడుతుండగా, కపిలుడు వారించాడు. మోక్షాన్ని ఆశించేవారు పూర్వదాన ఫలంగా కలిగిన సంపదను రక్షించాలని, పరహింస లాంటి వాటిని పాప హేతువులుగా పరి గణించాలని హితోపదేశం చేశాడు. ఆ రాజు 14 రోజులు నిరశన దీక్షతో కపిలుని ప్రసన్నం చేసుకొని శిష్యరికం స్వీకరించగా, ఆ మహర్షి భక్తి, కర్మ, వైరాగ్య, జ్ఞాన యోగాలను ఉపదేశించాడు. పుండ రీకుడు వాటిని భక్తిశ్రద్ధలతో ఆచరించి విష్ణు సాక్షా త్కారంతో ముక్తిని పొందాడు.

**–రామచంద్ర రామానుజ**

---

## వివేకానంద సూక్తిశతి

**It is the nature of the brute to remain where he is; it is the nature of the man to seek good and avoid evil, it is the nature of God to seek neither, but to be eternally blissful. Let us be God**

మార్చుకోరనట్టి మనుజుడు మూర్ఖుడు
మంచిమార్పు కోరు మంచిమనిషి
ద్వంద్వములను దాటి దైవత్వమును బొందు
వినుడి స్వామి సద్వివేకవాణి॥





బండిరాజుల శంకర్




గీరా నొప్పులు పడుతున్నది. డాక్టరిచ్చిన మందుల వల్ల అవి అంతగా తెలియటం లేదు. కానీ మగతగా ఉంది. అప్పుడప్పుడు కళ్లు తెరిచి ఏవో అడిగి కళ్లు మూసుకుంటున్నది.

గీరా కాన్పు కోసం ఐదుగురు డాక్టర్లు, ఇద్దరు పిడియాట్రిషియన్లు, ఐదుగురు నర్సులు, ఐదుగురు ఆయమ్మలు అక్కడ సేవలో ఉన్నారు. ఏం జరుగుతున్నదో గీరాకు తెలియటంలేదు.

నొప్పులు అంతకంతకు పెరిగి, మొదటి బిడ్డ బైట పడింది. ఆడపిల్ల. ఆ వెనుకనే మరో ఆడపిల్ల. ఆ శిశువు రోదన విని, ఆ తల్లి కళ్లు తెరిచింది. కానీ ఏమీ తెలియలేదు. కేరుకేరుమనే రోదనలతో ఆ పురిటి గది ప్రతిధ్వనించింది.

మరుక్షణంలో ఆ పిల్లల్ని అందుకున్న నర్సులు, ఇద్దరు ఆయాలు వేరే గదిలోకి మాయమయ్యారు. అక్కడే బొడ్డు తాడు కత్తిరించి, బ్యాండేజి వేసి, వెచ్చటి గుడ్డతో రక్తపు మరకల్ని తుడిచేసి, వెయిట్, షుగర్, బీపీ చూసి ఇన్‌క్యూబేటర్‌లో పెట్టారు.

కొంతవరకు దిగంబరంగా ఉన్న ఆ దేహాలకు డైపర్స్ వేసి, తెల్లటి మెత్తని గుడ్డలతో చుట్టేశారు.

మరో పది నిమిషాల్లో, ఐదైదు నిమిషాల తేడాతో ఇద్దరు మగపిల్లలు పుట్టారు. కేరు కేరుమంటున్న ఆ బిడ్డల్ని తీసుకెళ్లి చేయాల్సిన సపర్యలన్నీ చేసి పడుకోబెట్టారు. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క బిడ్డనుంచారు.

గోడలే అద్దాలుగా, దిగంతాల్ని తలపింపజేసే గోప్యం. గీరాను ఉంచిన ఆ లేబర్ రూమ్‌లో గీరా, వరద, గీరాను కంటికి రెప్పలా చూసుకున్న నర్స్ మాత్రమే ఉన్నారు. మిగిలిన వారంతా ఆ పరదా బైటనే, అవసరమైతే రావటానికి.

వచ్చినా, వాళ్లకు ఎలాంటి వివరాలు తెలియవు. అసలా తల్లి సరోగేట్ అని కూడా తెలియదెవరికి!

పిడియాట్రీషియన్లు, పిల్లల ఆరోగ్యం పట్ల సంతృప్తిని వెలిబుచ్చారు. అవసరమైన మందులు వేశారు.

అప్పుడప్పుడు కేరుమంటున్న ఆ శిశువుల కేకలు, ఆ సౌండ్ ప్రూఫ్ గదిని దాటి వెళ్లటం లేదు. ఇంకా ఆ తల్లి దేహం కళ్లు తెరిచే స్థితికి రాలేదు. మగతగా ఉంది. నలుగురు బిడ్డలున్న ఆ గదులు, ఒకదానికొకటి పోలిక లేనట్లుగా ఉన్నాయి. అంత పెద్ద ఆసుపత్రిలో అది ఏ నంబర్ గదో, ఏ వార్డులో ఉందో ఎవరికీ తెలవదు. తెలియకుండా దేనికదే వేరువేరుగా ఉన్నాయి

చూసుకోటానికి ప్రతి శిశువుకూ ఓ నర్స్ ఉంది.

కళ్లు, కాళ్లు, చెవులు, నోరు, చూపు, చేతులు, జననాంగాలు, వీపు, పొట్ట, జుట్టూ లాంటివి పరిశీలించి 'గుడ్' 'వెరీ గుడ్' అనే రిమార్కులు రాశారు.

ముందుగా గాంధారి, సత్యవతి, రాష్ట్రాయ్, శంతన్ వచ్చారు. అందరూ స్టెరిలైజ్డ్ ఆసుపత్రి గుడ్డలు వేసుకుని, చెప్పులు బైట విడిచి, ఆ పాప గది లోపలికొచ్చారు.

ఆ పాపలో అచ్చం రాష్ట్రాయ్ పోలికలు కనిపించాయి. సత్యవతికి అదే విషయం చెప్పింది చిన్నగా. శంతన్, రాష్ట్రాయ్ పాప డీఎన్ఏ రిపోర్ట్లు చూశారు. తమ పాపే. రిపోర్టులో గాంధారి, వ్యాస్ లక్షణాలు జన్యుపరంగా స్పష్టంగా ఉన్నాయి.

నిజమే, తమ ఇంటి వారసత్వం.

వ్యాస్, రాష్ట్రాయ్ లిద్దరూ తల్లి పోలికే! ఎందుకో తమ ఇంటి జన్యుపర లక్షణాలతో ఉన్న ఆ పసికందును చూస్తే చాలా ఆనందమనిపించింది వారికి.

రాష్ట్రాయ్ అతి జాగ్రత్తగా ఎత్తుకుని, గాంధారి చేతిని ఆ పాపపై వేశాడు. చాలా మెత్తగా, పత్తిలా సున్నితంగా ఉంది. అప్పుడు పొంగింది గాంధారిలోని ప్రేమ. మెల్లగా పైకి లేపి, గుండెలకు హత్తుకుంది. ఆమెలోని మాతృత్వం కరిగి పాపను చేరినట్లుగా పాప కదిలింది.

సిస్టర్ జాగ్రత్తగా అందుకుని ఉయ్యాల్లో పడుకోబెట్టింది. తేడా తెలిసిందేమో కెవ్వుమంది. సిస్టర్ పాలు పట్టి డైపర్ మార్చింది. కాలకృత్యాలు కూడా అయిపోగా, ఆ విషయం కేస్ షీట్‌లో రాసింది.

నలుగురూ బైటకొచ్చారు. వచ్చేటప్పుడున్న నిర్వేదం ఇప్పుడు వారిలో లేదు. మనసులు ఆనందంగా ఉన్నాయి.

* * *

ఉష, అనిరుద్ ఆ మెసేజ్ చూసుకుని వచ్చారు.

డాక్టర్ వారిని తీసుకెళ్లి బాబును చూపించింది. అన్ని రకాల టెస్టు రిపోర్ట్లు, డీఎన్ఏ రిపోర్ట్లు చూశాడు అనిరుద్. ఉష మాత్రం అవేమీ పట్టించుకోకుండా వాడిని గుండెలకు హత్తుకుంది. వాడి స్పర్శ ఆమెలో పులకింతలు రేపి, పాలు ఊరినట్లనిపించింది. తనలో మాతృభావన పెరిగిపోతుంటే వాడి గుప్పిళ్లు తెరిచి, బుగ్గమీద ముద్దుపెట్టు కుంది.

అది తనకిష్టమయినట్లుగా, అమ్మ చేతుల కమ్మదనం అందుకుంటున్నట్లుగా నిద్రపోయాడు. అనిరుద్ వెళ్లి మిగిలిన అమౌంట్ చెల్లించి వచ్చాడు. ఇద్దరూ ఆ చంటివాడిని తీసుకు వెళ్తామని చెప్పారు డాక్టర్‌తో.

"ఒకే, అన్ని ఫార్మాలిటీసు ముగిశాయి



సంబరాజు లీల (లట్టుపల్లి)

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

కాబట్టి తీసుకెళ్లొచ్చు" చెప్పింది వరద.

ఉష వెంటనే వాడి బ్యాగేజీ అంతా సర్దింది ఆనందంగా. ఎందుకో వాడి ఉనికి, స్పర్శ ఆమెకు ఆనందాన్నిస్తున్నాయి.

'వీడి వల్ల నా మనసులో తల్లితనపు ఆనందం పొంగుతున్నది. ఆ తృప్తి నాలో మాతృత్వం రేపుతున్నది. డాక్టర్‌గారి ప్రయోగం నిజమయితే, వీడికి మరో అనుబంధం దొరుకుతుంది. లేక... నా అదృష్టం బాగా లేకుంటే వీడే నా కంటి వెలుగు అవుతాడు' అనుకుంది. అతి విలాసవంతమైన కారులో మెత్తటి అమ్మ ఒడిలో వాడి ప్రయాణం ప్రారంభమయింది.

ధనవంతులుండే ఆ కాలనీలో ఉష, అనిరుద్ ఇంట్లోకి వాడిని తెచ్చి ఎర్రనీళ్లు తిప్పిపోశారు. వాడికని కేటాయించిన గదిలో అపురూపంగా పడుకోబెట్టారు. ఎక్కడో పుట్టినా వాడి జీవితం ఉష ఒడి అనే పూలపడవలో సాగిపోవడం మొదలయింది.

* * *

గీరా మగతగా కళ్లు తెరిచింది. పురిటిగదిలో కళ్లు మూసుకున్న గీరాకు దుస్తులు మార్చి చక్కగా ఉన్న తెల్లటి పరుపు మీద పడుకోబెట్టారు. గీరా మేలుకోవడం గమనించి వేడి వేడి హార్లిక్స్ తెచ్చింది నర్స్. కూర్చోబెట్టి తాగించింది.



"హలో! ఎలా ఉంది గీరా?" అడిగింది వరద చిరునవ్వుతో.

గీరా నవ్వుతూ అలవాటుగా పొట్టమీద చెయ్యేసుకుంది. ఎలాంటి కదలికా లేదక్కడ. గంధపు చెక్కలా నున్నగా ఉంది. ఒక్కసారి తుళ్లిపడినట్లుగా చూస్తూ, "డాక్టర్! పిల్లలు... పిల్లలేరి? ఆరోగ్యంగా ఉన్నారా?" ఆతృతగా ప్రశ్నించింది.

"రిలాక్స్ గీరా! హాయిగా, ఆరోగ్యంగా చిల్డ్రన్ వార్డులో ఉన్నారు. ఎలాంటి కంగారు అక్కరలేదు" చెప్పింది.

"ఒక్కసారి... ఒక్కసారి చూడొచ్చా?"

"నో...నో... అది కుదరదు. నీవు కనే అమ్మవే కాని, కన్నతల్లివి కాదు. నీవు ఎవరికోసం నీ కడుపున మోశావో, వాళ్లొచ్చి చూసి వెళ్లారు. ఒప్పుకున్న మేరకు డబ్బు కూడ ఇచ్చేశారు. నీకు కాస్త ఆరోగ్యం చిక్కగానే వెళ్లిపోవచ్చు" చెప్పింది.

"ఊ..." కళ్లనీళ్లు తిరిగాయి గీరాకు.

"చెప్పానుగా! నీ త్యాగం చాలా గొప్పది. ఇంక, వాళ్లు నీకు పుట్టలేదు అనుకో. లేదంటే నీ కడుపులోనే ఉన్నారు, చూడటం వీలు కాదనుకో. అగ్రిమెంట్ అయ్యాక ఇవ్వననటం కూడా న్యాయం కాదు కదా!"

"ఇవ్వననటం లేదు, ఒక్కసారి చూస్తానంటున్నాను!"

"చూశాక అసలే ఇవ్వలేవు. నిజానికి నేను చూడను అని అగ్రిమెంట్‌లోనే అంగీకరించావు" ఓదార్చింది వరద. ఏడుస్తున్న గీరా తలమీద చెయ్యి వేస్తూ "నీ కోసం భగవంతుడొక కానుక ఇచ్చాడు. నీ త్యాగాన్ని ఆయన గుర్తించాడు. అదేంటో చెప్పుకో!" అంది నవ్వుతూ.

"మరో దుఃఖమా?" ఏడుస్తూ నవ్వలేక నవ్వింది.

"కాదు, ఆనందం. దుఃఖం వెనక ఆనందం ఉంటుంది. పడుతున్న ప్రతి కష్టం వెనక ఓ సుఖం ఉంటుందని తెలియదా?" ప్రశ్నించింది.

"తెలియదు. ఇప్పుడీ దుఃఖానికి డబ్బే సుఖమా?"

"కాదు, వ్యాస్‌తో నీ పెళ్లి" చెప్పింది వరద.

"అవును, అందుకే ఈ పిల్లల కోసమే పది నెలలు పెళ్లి వాయిదా వేశాను. ఇంక వారితో మాట్లాడాలి" చెప్పింది గీరా.

వెల్లవెల్లగా గీరాలోని మాతృదుఃఖం నెమ్మదించింది. "ఇదిగో నీ అమౌంట్ ఐదులక్షలు. వ్యాసుతో నీ పెళ్లి జరిగినా, మానినా ఇది నీ జీవితానికి ఆధారమౌతుంది" అంటు డబ్బిచ్చింది వరద.

గీరా వాటిని బ్యాగ్‌లో పెట్టుకుంది.

"గీరా! ఒక్క క్షణం కళ్లు మూసుకో! నీకో సర్‌ప్రయిజింగ్ కానుకిస్తాను" ఊరించింది వరద.

"నాకేం కానుకుంటుంది? కనే అమ్మనే గాని, కన్న అమ్మను కాను. మాతృదానం చేశానేగాని, మాతృత్వం పొందలేదు. అమ్మను, అద్దె అమ్మను"

**'వీడి వల్ల నా మనసులో తల్లితనపు ఆనందం పొంగుతున్నది. ఆ తృప్తి నాలో మాతృత్వం రేపుతున్నది. డాక్టర్‌గారి ప్రయోగం నిజమయితే, వీడికి మరో అనుబంధం దొరుకుతుంది. లేక... నా అదృష్టం బాగా లేకుంటే వీడే నా కంటి వెలుగు అవుతాడు' అనుకుంది. అతి విలాసవంతమైన కారులో మెత్తటి అమ్మ ఒడిలో వాడి ప్రయాణం ప్రారంభమయింది.**



అంది పేలవంగా.

"ఇది పెళ్లికానుక. వ్యాసుతో నీ పెళ్లి కదా! పిలుపు ఉంటుందో లేదో, ముందే ఇస్తాను. కళ్లు మూసుకో!" చెప్పింది అనునయంగా.

మెల్లగా మంచం మీద పడుకుని కళ్లుమూసుకుంది. 'తన నుంచి ఆమెకూ ఓ ఐదు లక్షల వరకూ లాభం. ఏదైనా గిఫ్టు ఇస్తుందేమో'ననుకుంది గీరా. రెండు నిమిషాల తరువాత పువ్వులా మెత్తని స్పర్శ, ఆ కదలికలో చేతులాడించే పసిబిడ్డ. ఆ పాప కాళ్లతో తనను తంతున్నది.

'ఇది.. నా భ్రమా!' అనుకుంటూ వెంటనే కళ్లు తెరిచింది.

నిజమే! పువ్వులాంటి పాపాయి. గులాబీరేకల్లా మృదువుగా తనను తాకుతున్నది. మొదట బొమ్మ అనుకుని తడిమి తడిమి చూసింది.

నిజమే! తనను అమ్మను చేసిన పాపాయి. బొమ్మ కాదు, ప్రాణమున్న పసిపాప! అప్రయత్నంగానే, పాపను గుండెలకు అదుముకుంది. ఆ ఒత్తిడికి పులకించిన దేహం క్షీరధారలు కురిపించింది. పైట, జాకెట్ తడిసిపోయాయి.

గీరాకెందుకో ఆ స్పర్శతో ఆ పాప తనదే, తను కన్నబిడ్డనిపించింది. దగ్గరగా ఒత్తుకుని, వదులుకోలేనట్లుగా పాలు పట్టించింది. కమ్మటి ఆ పాలు తాగిన పాప క్షణం ఆపి, అమ్మను చూసుకుంది.

"అలా... చూడకే తట్టుకోలేను. నాకే సౌఖ్యాలొద్దు, నువ్వుంటే చాలు..." అంటూ హఠాత్తుగా వరద వంక చూస్తూ... డాక్టర్! ఈ పాపనింకా తీసుకెళ్లలేదా?" అదెలా... సంభవం?" ప్రశ్నించింది.

"లేదు, తీసుకువెళ్లరు. చెప్పాగా. పెళ్లి కానుకగా నీకే కానుకనిస్తున్నానని!" ఆదరంగా చెప్పింది.

"మరి వ్యాస్... వ్యాసు ఒప్పుకుంటాడా? చదువుకున్నవాళ్లు విజ్ఞానవంతులు కాబట్టి, నేను 'సరోగేట్ మదర్' అగ్రిమెంట్ చేసుకున్నానంటే, సహృదయంతో పది నెలలు ఆగారు. బిడ్డతల్లిగా వస్తానంటే ఒప్పుకుంటారా?" సందేహంగా అంది.

"ఒప్పుకుంటారు?" కచ్చితంగా చెప్పింది.

"ఒప్పుకోకున్నా ఫరవాలేదు. నా చిన్నతల్లి చాలు నాకు. డాక్టర్! ఒక్క సందేహం. ఈ పాపనెందుకు తీసుకెళ్లలేదు? నేను ముగ్గుర్ని ముగ్గురి కోసం కన్నాను గదా!" సందేహంగా అంది.

"నీకు దేవుడు ముగ్గురితోపాటు మరో పాపని కూడా ఇచ్చాడు. నీవు ముగ్గుర్ని కాదు. నలుగురిని మోసి కన్నావు. ఎవరి పిల్లల్ని, వాళ్లు తీసుకెళ్లారు. నీ పాప నీకు మిగిలింది. ఒక నిజం చెప్పనా గీరా! ఎవరి ఎగ్, ఎవరి సెమన్, ఎవరు సరోగేట్ మదర్, ఆ పిల్లల్ని తీసుకునే దంపతులెవరు? ఇవన్నీ మీకు తెలియవు. అంతా రహస్యంగా ఉంటుంది.

"కానీ, మాకంతా తెలుసు! అందుకే నేనే మీడియేటర్‌గా ఉంటాను. ఇందులో గోప్యత అవసరం. కానీ, ముందు ముందు ఆ తల్లికి పిల్లల అవసరం పడ్డా, ఆ దంపతులు వద్దనుకున్నా, ఈ వివరాలు తెలిస్తే ప్రాబ్లమౌతుంది. అవి నివారించటానికే ఈ రహస్యం.

"గీరా! ఈ పాప ఎవరో తెలుసా?

"వ్యాస్ ద్వారా నీవు గాంధారికి సరోగేట్ మదర్‌గా మారావు. ఆ పిండం అనూహ్యంగా సెల్ విభజన, డబులయి, ట్విన్స్ పుట్టారు. ఆ అమ్మాయే, ఈ పాపాయి. అంటే సాక్షాత్, నీ కాబోయే భర్త ద్వారా, నీవు కన్న అమ్మాయి. అందుకే పెళ్లి కానుక అన్నాను.

"ఆ విషయం వ్యాస్‌కు తెలియజేశాను. అతడు, ఐక్యరాజ్యసమితి మెడికల్ కౌన్సిల్లో, తన మొదటి డోనర్ భారతదేశానికే చెందాలని ఆంక్ష పెట్టాడు. నీ ద్వారా పొందాడు. యూ ఆర్ లక్కీ గీరా! నీ త్యాగానికి ఫలితం దక్కింది. ఇదిగో... ఇది నాకు నీ ద్వారా వచ్చిన ఆదాయం, ఐదులక్షల చెక్. నీ కూతురికి నా కానుకగా ఇస్తున్నాను" చెప్పింది.

గీరాకు కృతజ్ఞతతో కళ్ల నీళ్లు వచ్చాయి.

"గీరా! అందరమ్మాయిలు భార్యలయి తల్లులవుతారు. నీవు, తల్లివై భార్యవవుతున్నావు. ఇదిగో... వ్యాస్ నీకు మెయిలిచ్చాడు" అంటూ చూపించింది.

ఆనందంతో గీరా పాపాయిని మరోసారి ముద్దుపెట్టుకుంది.

**(సమాప్తం)**



# ఫత్వా ప్రేరణతోనే రష్దీ మీద హత్యాయత్నం

ప్రముఖ ఆంగ్లోఇండియన్ రచయిత సల్మాన్ రష్దీ మీద జరిగిన హత్యాయత్నం ఆయన మీద జారీ చేసిన ఫత్వా మేరకే జరిగిందని తేలింది. ఆగస్ట్ 12,2022న న్యూయార్క్‌లో హాదీ మతార్ అనే 24 ఏళ్ల యువకుడు పలుమార్లు కత్తితో పొడిచాడు. దీనితో రష్దీ ఒక కన్ను పోగొట్టుకోవలసి వచ్చింది. ఆ సమయంలో రష్దీని ఇంటర్వ్యూ చేస్తున్న హెన్రీ రీసే కూడా గాయపడ్డాడు. ఇరాన్ సర్వోన్నత నాయకుడు రుహోల్లా కొమేనీ ఆ ఫత్వా జారీ చేసే నాటికి హాదీ పుట్టలేదన్న మాట. హాదీ కూడా అమెరికా పౌరుడే. అక్కడ న్యూజెర్సీలో ఉండేవాడు. అతడి మీద హెజిబుల్లా ఉగ్రవాద సంస్థ సభ్యునిగా నేరారోపణ చేశారు. హెజిబుల్లా అమెరికా నిషేధించిన ఉగ్రవాద సంస్థ. రష్దీ రచన 'సాటానిక్ వర్సెస్' నవల 1988లో వెలువడింది. ఆ నవల ప్రవక్తను విమర్శించిందన్న ఆరోపణతో కొమేనీ రష్దీ మీద దైవదూషణ నేరం మోపి, హత్య చేయాలంటూ 1989లో ముస్లిం వర్గానికి ఫత్వా జారీ చేశాడు. ఆ మేరకే రష్దీని హాదీ కత్తితో దారుణంగా పొడిచాడు. హెజిబుల్లా లెబనాన్ కేంద్రంగా పనిచేసే షియా ముస్లిం రాజకీయ పక్షం. షియాలు అధికంగా ఉండే ఇరాన్ దీనికి నిధులు అందిస్తూ ఉంటుంది. అందుకే హాదీని ఉగ్రవాద సంస్థకు చెందిన నేరగాడిగానే విచారణ జరుపుతున్నారు. ★



# అస్సాం ప్రభుత్వం ఘనత

తమ ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో ఆక్రమణలలో ఉన్న 167 చదరపు కిలోమీటర్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ప్రకటించారు. అంటే చండీగఢ్ నగరమంత భూభాగమిది. ప్రభుత్వ దృఢ సంకల్పం, స్థానికుల సహాయంతో దీనిని సాధించామని కూడా ఆయన అన్నారు. గొర్ఖుటి వ్యవసాయ ప్రాజెక్టు కోసం సిప్జార్‌లో కేటాయించిన భూమిలో తిష్ట వేసిన కుటుంబాలను కూడా మొన్న మే నెలలోనే ఖాళీ చేయించారు. మొదట ఈ స్థలం నుంచి ఖాళీ చేసి వేరే చోట కేటాయించిన స్థలంలోకి వెళ్లాలని ఆదేశించారు. అందుకు ఆ కుటుంబాలు నిరాకరించాయి. దీనితో జూలై 25న అక్కడ ఉన్న 397 కుటుంబాలను ఖాళీ చేయించే ప్రత్యేక కార్యక్రమం జిల్లా యంత్రాంగం చేపట్టి దిగ్విజయంగా పూర్తి చేసింది. గొర్ఖుటిలో 8700 బిగాల భూమి కేటాయిస్తే ఆ మొత్తం స్థలాన్ని ఈ కుటుంబాలు ఆక్రమించాయి. మొదటి దశగా 6800 బిగాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ★

# రంజిత్‌సింగ్ స్వర్ణ సింహాసనం భారత్‌కు రావాలి



రొటీన్‌కు భిన్నంగా అంటారు కదా! అలాంటిదే ఇప్పుడు ఆప్ ఎంపీ నోటి నుంచి ఒక డిమాండ్ వచ్చింది. నిరంతరం బీజేపీనీ, నరేంద్ర మోదీనీ ఆడిపోసుకోవడానికే మొగ్గు చూపే ఆప్ ఒక మంచి సూచనే చేసింది. సిక్కు యోధుడు, ఆధునిక భారతదేశ చరిత్రలో సమున్నత స్థానం కలిగిన మహారాజా రంజిత్ సింగ్. ఆయన ఉపయోగించిన స్వర్ణ సింహాసనం ఇంగ్లండ్‌లో ఉంది. దానిని తిరిగి దేశానికి రప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని ఆప్ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా కోరారు. జూలై 24న ఆయన ఎగువ సభలో ప్రత్యేక ప్రస్తావనగా ఈ అంశాన్ని తీసుకు వచ్చారు. 19వ శతాబ్దానికి చెందిన మహారాజా రంజిత్ సింగ్ కోసం హఫీజ్ మహ్మద్ ముల్తానీ అనే స్వర్ణకారుడు 1805–1810 మధ్య ఈ సింహాసనం తయారు చేశాడు. నిజానికి ఇది రంజిత్ సింగ్ దర్బార్ వైభవాన్ని చాటి చెబుతుంది. యూరోప్ వస్తువుల మాదిరిగా కాకుండా, రెండు కమల ఆకృతులతో ఈ సింహాసనం చెక్కారు. దానికి పైన దళసరి బంగారు రేకును తాపడం చేశారు. 1849లో ఈస్టిండియా కంపెనీ పంజాబ్‌ను ఆక్రమించినప్పుడు ఈ సింహాసనాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ స్వర్ణ సింహాసనమే కాదు, ఇంకా రంజిత్‌సింగ్ ఆస్థానంలోని విలువైన ఆభరణాలు, ఖజానా కూడా దోచేశారు. ఇందులో సింహాసనం మాత్రం లండన్‌లోని లీడెన్‌హాలు స్ట్రీట్‌లోని ఈస్టిండియా కంపెనీ వస్తు ప్రదర్శనశాలకు తరలించి, ప్రదర్శనకు పెట్టారు. మిగిలిన వస్తువులు లాహోర్‌లో వేలం వేశారు. 1879లో కంపెనీ మ్యూజియంను ఎత్తివేసిన తరువాత ఆ సింహాసనం సౌత్ కెన్సింగ్‌టన్ మ్యూజియంకు తరలించారు. దానినే ఇప్పుడు విక్టోరియా అండ్ అల్బర్ట్ మ్యూజియం అంటున్నారు. ఉమ్మడి పంజాబ్ రాష్ట్రంలో నాడు రంజిత్‌సింగ్ అందించిన పాలనకు చరిత్రలో ఎంతో స్థానం ఉందని చద్దా ఈ సందర్భంగా సభ దృష్టికి తెచ్చారు. సమన్యాయం, సెక్యులర్ భావాలతో ఆయన పాలించాడని అన్నారు. ప్రస్తుతం విక్టోరియా అండ్ అల్బర్ట్ మ్యూజియంలో ఉన్న రంజిత్‌సింగ్ సింహాసనం భారత్‌కు తిరిగి తేవడానికి ఇంగ్లండ్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని చద్దా కేంద్రానికి సూచించారు. ఆ చారిత్రక వైభవాన్ని సూచించే ఆ సింహాసనాన్ని అన్ని దౌత్య మార్గాలను ఉపయోగించుకుని తీసుకురావాలని చద్దా కోరారు. ★



# నిరసనలు, శాపాల మధ్య నెతన్యాహూ యుఎస్ పర్యటన


అమెరికాలో పరిస్థితులు ఎంత శ్రుతి మించాయో గతవారం ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఆ దేశంలో పర్యటించినప్పుడే అవగతమైంది. వాషింగ్టన్ డీసీలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా హమాస్ మద్దతుదారులు నెతన్యాహూ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం, అమెరికా జెండాను తొలగించి, వాటి స్థానంలో పాలస్తీనా జెండాలను ఉంచడం, యూనియన్ స్టేషన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడిచేసి, ముగ్గురిని ఈడ్చుకుపోవడం, అతడు బస చేసిన హోటల్లోకి పురుగులను వదలడం సహా నానా బీభత్సాలకు పాల్పడ్డారు.

'భవిష్యత్ తరం పాలస్తీనా యువతకు యూదులను ద్వేషించడం కాక వారితో శాంతి యుతంగా జీవించడం నేర్పాలంటూ,' నెతన్యాహూ అమెరికా కాంగ్రెస్‌లో ఎంత ఉద్వేగ పూరితంగా ప్రసంగించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. పెరుగుతున్న యూదు వ్యతిరేకతను, ఇజ్రాయెల్‌కు వ్యతిరేక నిరసనలను ప్రస్తావిస్తూ, హమాస్‌కు మద్దతునిస్తున్నవారిని నెతన్యాహూ ఖండించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేక ప్రదర్శనలకు నిధులను ఇరాన్ అందిస్తోందని తమకు తెలుసని, కాంగ్రెస్ బయట, తన హోటల్ ఎదుట ప్రదర్శనలు నిర్వహిస్తున్న వారంతా కూడా ఇరాన్ చేతిలో ఉపయుక్తమైన కీలు బొమ్మలుగా మారారిని విమర్శించారు. అంతేకాదు, ఆయన యూదు వ్యతిరేకతను పెంచిపోషిస్తున్న విద్యా సంస్థలను, విద్యావేత్తలను ఖండించారు. యూదుల పట్ల ద్వేషమన్నది ప్రపంచంలో అతి ప్రాచీన ద్వేషమంటూ, అది సరి కొత్త, ప్రమాదకరమైన మార్గాల్లో వ్యక్తమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

"గేస్ ఫర్ గాజా" (గాజా కోసం సమలైంగికులు) వంటి నిరసన నినాదాలను ప్రస్తావిస్తూ, హమాస్, ఇస్లామిక్ గ్రూపులు నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో ఎల్‌జిబిటిక్యూ సమాజం ఎంత క్రూరమైన వేధింపులకు గురవుతుందో ఎత్తి చూపారు. ఈ నినాదాన్ని వెక్కిరిస్తూ, వారు 'చికెన్స్ ఫర్ కెఎఫ్‌సి' (కెఎఫ్‌సి ఫ్రైడ్ చికెన్‌కు ప్రసిద్ధి) వంటి నినాదాన్ని అందిపుచ్చుకున్నారని, హమాస్‌కు మద్దతు నివ్వడమన్నది స్వీయ విధ్వంసానికి దారి తీస్తుందని పరోక్షంగా చెప్పారు.

కాంగ్రెస్‌లో నెతన్యాహూ ఉపన్యాసం సందర్భంగా దాదాపు ఇరవై ఎనిమిదిసార్లు సెనెటర్లు స్టాండింగ్ ఒవేషన్ (నిలబడి చప్పట్లు కొట్టడం) ఇచ్చారు. ఇది అమెరికన్ సెనేట్ చరిత్రలోనే ఒక చారిత్రక విషయం. కాగా, ఈ ఘటనలను స్పందిం చిన వైట్‌హౌజ్, యూదుల పట్ల ద్వేషం, హింస ఏ మాత్రం అమోదయోగ్యం కావని.. శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేసేందుకు ప్రతి అమెరికన్‌కు హక్కు ఉంది కానీ, వారు హింసకు, విధ్వంసానికి పాల్పడడం సిగ్గుచేటని పేర్కొంది. ★

# రాష్ట్రపతి భవన్‌లో గణతంత్ర, అశోక మంటపాలు



భారతీయ సంప్రదాయాలను, ప్రజాస్వామ్య సూత్రాలను నిలిపేందుకు సాగుతున్న చొరవలో భాగంగా రాష్ట్రపతి భవనంలో రెండు ప్రముఖ హాళ్లకు పేర్లను మారుస్తున్నట్టు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రకటించారు. ప్రస్తుతం 'దర్బార్ హాల్' – 'అశోక్ హాల్'గా ప్రాచుర్యం పొందిన ఆ హాళ్ల పేర్లను 'గణతంత్ర మంటపం', 'అశోక్ మంటపం'గా మార్చారు.

భారత రాష్ట్రపతి అధికార నివాసం, కార్యాలయమైన రాష్ట్రపతి భవన్, భారత జాతికి, వారసత్వానికి సంకేతంగా నిలుస్తుంది. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిఫలింప చేస్తూ, ఈ చారిత్రిక ప్రదేశాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు యత్నాలు జరుగుతున్నాయి. సాధారణంగా జాతీయ అవార్డుల ప్రదానం వంటి కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించే దర్బార్ హాలుకు 'గణతంత్ర మంటపం'గా పేరు మార్చి, వలసవాద వాసనల నుంచి బయటపడేందుకు మార్గంచూపారు. గణతంత్రమనేది ప్రాచీన కాలం నుంచీ భారత్‌లో పాతుకు పోయి ఉన్న భావన. నేడు గణతంత్ర స్ఫూర్తికి, ప్రజాస్వామిక విలువలకు సంకేతంగా ఈ పేరు పెట్టడం ఎంతో సముచితం. రెండవది 'అశోక మండపం'... అశోక అన్న పేరుకు భారతీయ సంస్కృతిలో పలు అర్థాలు ఉన్నాయి. అన్ని బాధల నుంచి విముక్తమైనవారు లేదా దు:ఖం లేని వారు అనే అర్థాలు ఉన్నాయి. అలాగే, అశోక అన్న పదం అశోక చక్రవరిని కూడా సూచిస్తుంది. సారనాథ్‌లోని సింహ స్థూపం, భారత గణతంత్రపు జాతీయ ఎంబ్లమ్‌గా నిలిచింది. ★

# భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న కొత్త విషం?



భారతీయ చీరె 'వోక్' (WOKE) దాడికి గురవుతోంది. ఇటీవలే 'ది వర్డ్' అనే పత్రిక చీరెలు ధరించిన ఆడంగి మగ మోడళ్లను తన కవర్‌పేజీపై ప్రచురించింది. ఆ చిత్రం కింద 'ది శారీ బిలాంగ్స్ టు ఎవ్రివన్' (చీరె అందరికీ చెందింది) అంటూ ట్యాగ్‌లైన్‌ను కూడా ఇచ్చింది. ఇది కలుపుకుపోవడం అనే ముసుగులో లింగ తటస్థతను భారతీయ సంప్రదాయంతో విలీనం చేయడానికి ప్రయత్నమన్న విషయం వేరే చెప్పనవసరం లేదు. ఇది కేవలం ఫ్యాషన్ కాదు, ఇది ఎల్‌జిబిటిక్యూఐఎ+ సమాజంలో జెండర్ గుర్తింపులలో గల అయోమయం కారణంగా వేస్తున్న సాంస్కృతిక తప్పటడుగు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. లోతుగా పాతుకుపోయిన సంప్రదాయాలను అణగదొక్కుతూ భారతీయ సమాజంలో ఈ 'వోక్' వైరస్ విస్తరిస్తోంది.

భారత్‌లో చీరె, ధోవతి, అంగవస్త్రం అన్నవి స్త్రీ, పురుషులకు సంబంధించిన దుస్తులుగా ప్రాచీన కాలం నుంచి సాగుతున్నాయి. అయితే, శతాబ్దాల సాంస్కృతిక వారసత్వాన్ని అవమానపరుస్తూ, జెండర్ తేడాలను వోక్ ఎజెండా మసకబారుస్తోంది. చీరె అనేది స్త్రీత్వానికే కాదు సాధికారతకు కూడా సంకేతంగా ఉంటూ వస్తోంది. అటువంటి వస్త్రధారణను ఒక ఆయుధంగా ఉపయోగించుకోవడం ఎంత మాత్రం క్షమార్హం కాదు. ఎందుకంటే, రేపు పొద్దున చీరె కట్టుకున్న పురుషులు పురోగమనవాదులు, కలుపుకుపోయేవారు అంటూ ప్రచారం చేస్తారు. ఇప్పటికే వీరి అజెండా ప్రపంచంలోని పలు ప్రాంతాలను చుట్టు ముట్టింది. వారి కార్యనిర్వహణ పద్ధతి– ముందుగా మహిళల వస్త్రధారణను ఉపయోగించుకోవడం తర్వాత మహిళలకు ఉద్దేశించిన ప్రదేశాలను ఆక్రమించడం.

భారతదేశంలో అటు చీరె, ఇటు ధోవతికి సాంస్కృతికంగా చాలా ప్రాముఖ్యత ఉంది. పురుషులు చీరెలు కట్టుకొనేలా రెచ్చగొట్టే ఈ వోక్ అజెండా మన వారస త్వాన్ని అవమానిస్తోంది. ఈ విషయాన్ని అందరూ గుర్తించి, ప్రతిఘటించాలి.

# డీఎంకే క్రైమ్ ఫైల్స్‌ను విడుదల చేసిన అన్నామలై







తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై డీఎంకే నేర చరిత్రను వివరించే ఫైళ్లను 'డీఎంకే క్రైమ్ ఫైల్స్' పేరుతో విడుదల చేయడం ఆ రాష్ట్రంలో సంచలనాన్ని రేకెత్తిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్నామలై మూడు విడతలుగా ఈ ఫైళ్లను విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా విడుదల చేసిన పద్దెనిమిది పేజీల ఈ పత్రంలో 2021 నుంచి జరిగిన 113 ఘటనలకు సంబంధించి నిందితుల పేర్లు, తేదీలు, పార్టీలో ఆ వ్యక్తుల హోదాతో పాటుగా ఫోటోలు వంటి సమాచారంతో వీటిని విడుదల చేశారు.

ఈ ఫైళ్లలో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన పేరు ఎన్ఆర్ఐ విభాగం మాజీ కార్యవర్గ సభ్యుడు 'జాఫర్ సాదిక్'ది. ఇతడికి సినిమా రంగంతో కూడా సంబంధాలున్నాయని ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి చిత్రాలకు ఫైనాన్సింగ్ చేశాడని, అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్‌లో అతడికి జోక్యం ఉందనే అభియోగాలు ఉన్నాయి. వీటితో పాటుగా, డీఎంకే వివాదాస్పద నాయకులు శివాజీ కృష్ణమూర్తి, ఎంపీ ఎ.రాజా, కళానిధి వీరస్వామి, ప్రస్తుతం వివిధ కేంద్ర ఏజెన్సీల నిఘాలో ఉన్న మంత్రి ఎస్ఎస్ శివశంకర్ వంటి వారి పేర్లు, చేతలు ఉన్నాయి. అంతేకాదు, ఇటీవలే హత్యకు గురైన బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌ను చంపిన బీఎస్పీ నాయకుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో తిరువల్లూర్ తూర్పు యూనియన్ డిఎంకె నాయకుడు అరుల్, డిఎంకె శాఖ కార్యదర్శి ఎం. శ్రీనివాసన్, తిరువల్లూర్ సెంట్రల్ జిల్లా సాహితీ విభాగం ఆర్గనైజర్ కుమరేశన్ కుమారుడు సతీష్‌లకు ప్రమేయం ఉందని ఈ పత్రాలు పేర్కొన్నాయి. అయితే, ఇదే ఆఖరి చిట్టా అని, ఈ కాలంలో డీఎంకే పార్టీ వారు మరిన్ని నేరాలు చేయలేదని చెప్పలేం. ★

ఆగస్టు అనగానే భారత స్వాతంత్య్ర ఉద్యమం గుర్తుకొస్తుంది. పదిహేనో తేదీ అనడంతోనే స్వతంత్ర సాధన తలపుతో మన మది పులకిస్తుంది. అదే స్వతంత్రత కోసం ఎందరు ఎన్ని విధాల పరిశ్రమించారో... అనుకున్నపుడు కొందరు మహిళామణులు తళుక్కున మెరుస్తారు. తెలుగునాట నందిగామ ప్రాంతంలో పుట్టిన ఒక అమ్మాయి ఉద్యమ నాయికగా పురోగమించిన వైనం మాత్రం చిరస్మరణీయమే. పల్లెలు, పట్టణాలు, నగరాలు, రాష్ట్రాలు, దేశాన్ని దాటి మరీ ఆ ఉద్యమ కిరణాలు ప్రసరించాయి. మహానేతలతో పరిచయాలు ఆమె పోరు పటిమను మరెంతో విస్తృతపరచాయి. అన్నిటికన్నా మించి, తను సుదూరాన ఉన్న అండమాన్‌కు వెళ్లి నేతాజీ విగ్రహ స్థాపన ఉత్సవానికి సారథ్యం వహించేలా చేశాయి. 'స్వరాజ్యం నా జన్మహక్కు' నినాదంతో గొంతు కలిపి బరిలోకి దూకిన ఆ వనిత పేరులోనూ 'రాజ్య' ఉంది. రాజ్యలక్ష్మీదేవి. ఆ యోధురాలు స్వతంత్రత అనంతర స్థితిగతులనీ చూశారు. ప్రధానంగా అతివల సర్వతోముఖ వికాసానికి నడుం కట్టారు. వారందరి ముందూ నిలిచి, సమైక్యంగా నినదించి, చివరివరకూ తనది ఉద్యమ తత్వమేనని ఘంటాపథంగా చాటి చెప్పారు. ఆ ధీరురాలి అస్తమయమూ ఆగస్టునెలలోనే. సూర్యకిరణాల వెలుగులను ఇంటా బయటా ప్రసరింపచేసిన సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ జీవన యానాన్ని విభిన్న కోణాన పరిశీలించి చూస్తే, స్ఫూర్తితత్వం అంటే ఏమిటో తెలిసి వస్తుంది మనకు!



తొలి నుంచీ నేతాజీ ఆరాధకురాలు రాజ్యలక్ష్మీదేవి. ఆమె పుట్టింది కుగ్రామంలో. ఆ ఊరి పేరు వీరులపాడు. అందులోనూ వీరత్వం అన్నమాట.

బడి పుస్తకాల కంటే, సాహిత్య రచనలంటేనే మక్కువ ఎక్కువ. అమ్మా నాన్నతోపాటు గురువూ ఉత్సాహ ప్రోత్సాహాలందించారు. అందుకే బాల లక్ష్మి స్కూల్లో కంటే ఆ గ్రామ లైబ్రరీలోనే గంటలకొద్దీ కాలం గడపటం!

ఎన్నో పుస్తకాలు. వాటిల్లోని భారతీయత అంశాలనే ఆసాంతం చదివారామె. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, విముక్తి, విమోచనం గురించి ఎంత శోధించాలో అంతా పరిశోధించారు. కొన్నాళ్లకు పెళ్లి. మెట్టినింటికి వెళ్లినా పఠన ఆసక్తి తగ్గకపోగా ఇంకెంతో ఎంతెంతో పెరిగింది.

మరో గ్రంథాలయాన్ని తానే తన ఊళ్లోనే ఏర్పాటు చేయడం అత్యంత విశేషం. సంఘ సంస్కర్తల చరిత్రలెన్నింటినో ఆమూలాగ్రం చదివారు. మరీ ముఖ్యంగా గురజాడవారి దేశభక్తి గేయాన్ని!

***ఆకులందున అణగిమణగి***
***కవిత కోకిల పలకవలెనోయ్***
***పలుకులను విని దేశమందభి***
***మానములు మొలకెత్తవలెనోయ్!***

అనే పంక్తులంటే ఎంత ఇష్టమో చెప్పనలవి కాదు.

అది 1930. అప్పటికి రాజ్యలక్ష్మికి యువదశ. దేశమంతటా విముక్తి మహోద్యమం విస్తరించిన రోజులు అవన్నీ. ఎంతగానో ప్రభావితమయ్యారు ఆమె. పోరాట దశలన్నింటినీ నిశితంగా గమనిస్తూ వచ్చారు. ఒకవైపు అధ్యయనం, మరొకవైపున ఆచరణం. కాలం గడిచేకొద్దీ ఉద్ధృతి పెచ్చు పెరిగింది. ఆంగ్లేయ శాసనాలను ఉల్లంఘించి ప్రజలంతా కదం తొక్కుతున్నారు. పాలకులు దమననీతితో అణచివేతకు పాల్పడుతున్నారు.

***భారతభారతీ ప్రగతి భాగ్యము పండెను! ఝాన్సి శత్రుసం***
***హార మొనర్పసాగె మహిషాసుర మర్దనియే- రణాంగణ***
***స్వైర విహారమున్ సలుపు సాహసమూర్తి యపార శౌర్య సం***
***చార కథలా పవళ్లున్ నిశల్ దిశలెల్ల ప్రతిధ్వనించె!***

అన్నట్లు నవోద్వేగ వాతావరణమే. ఎక్కడ చూసినా, సుధీరనారీమణి ఝాన్సీ లక్ష్మీబాయి చరిత్ర రాజ్య ధీశక్తి పెల్లుబికేలా చేసింది. నాటి జాతి నేతల ప్రసంగాల తరంగాల ధాటి సరేసరి. వీటన్నింటి నేపథ్యంలో, నిరసన ప్రదర్శనల ముందు వరసన నిలిచారు ఆమె. బ్రిటిష్ పోలీసుల లాఠీలు విరుచుకుపడినా, ఒక్క అడుగూ వెనక్కి వేయలేదు. నిర్బంధకాండ ఎదురైనా, తొణకని బెణకని వ్యక్తిత్వం తనది.

చెరసాల పాలయ్యారు రాజ్యలక్ష్మీదేవి. అక్కడ సాటి ఖైదీలకు ఉద్బోధ చేసేవారు. సూర్యకాంతిని ఆపడం

# సురాజ్యలక్ష్మి



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

ఎవరి తరం అని తాను ప్రశ్నించి, మిగతా అందరినీ ఉత్తేజపరచారు.

ఎక్కడో రాయవేలూరు కారాగారానికి తరలించారు ఆంగ్లేయ అధికారులు. ఆమెను భయపెట్టి, అదిలించి, బెదిరించి, వెనక్కి మళ్లేలా చేయాలని శతవిధాలా యత్నించారు. ఉక్కు సంకల్పానికి మారు పేరైన ఆమె పిడికిలి బిగిసిందే కానీ గడగడలాడలేదు. కటకటాల వెనక ఉండి కూడా తనదైన అధ్యయనం, తనకు మాత్రమే సాధ్యమైన సమాచరణను నిరూపించుకున్నారు. నివ్వెరపోవడం పాలకుల వంతయింది!

నాడు 1940. వ్యక్తి సత్యాగ్రహం ముమ్మరంగా కొనసాగుతోంది. అగ్రశ్రేణిలో నిలిచింది రాజ్యలక్ష్మమ్మే. జైలు నుంచి విడుదలైన కొద్దిసేపటికే, ఉద్యమరంగాన ప్రత్యక్షమయ్యారు.

మళ్లీ నిర్బంధం. మరోసారి కారాగార ప్రవేశం. అదనంగా జరిమానాల వడ్డింపు సైతం! ఎంత చేసినా, విడుదలను ఎవరూ ఆపలేరు కదా! ఆ వెంటనే తమిళనాడుకు పయనమయ్యారామె.

***భారతదేశ గౌరవము పాడొనరించు పిశాచి మూక తద్వీర విజృంభణమ్మను రవిప్రభకల్లడ తల్లడయ్యె – తద్దారుణ విప్లవోజ్వల కథల్ వినిపించు నిరంకుశత్వ దుర్వార దురంత దుర్మద దురాక్రమణంబుల గుండె జీల్చుచున్!***

అన్నట్లుంది పరిస్థితి. దేశవ్యాప్త పర్యటనకు ముందు దీటుగా ఉన్నత విద్యాభ్యాసం సాగించారు. మళ్లీ తెలుగునేలకు చేరుకుని, శ్రద్ధాసక్తులతో చదివి, పరీక్షల్లో కృతార్థులయ్యారు.

ఇంకొన్ని నెలలకు 'క్విట్ ఇండియా' సందర్భం. అప్పట్లో ఆగస్టు రెండోవారంలో మొదలై చూస్తూండగానే విస్తారత సంతరించుకుంది.

***లేచిపోయినవి పోలీసుల టోపీలు***
***వందలు వేలు రాబందులట్లు***
***కాలిపోయినవి సర్కారు కచ్చేరీలు***
***ఖరదూషణాదుల కాష్ఠమట్లు***
***తెగిపోయినవి తంతి తీగెలు భారతీ***
***యుల పారతంత్ర్య శృంఖములట్లు***
***తరలిపోయినవి కిందకు రైలుపట్టాలు***
***పాశ్చాత్య రాజ్య సౌభాగ్యమట్లు***
***ఒకటి యనుటేమి నాటి మహోద్యమమున***
***రేగిపోయిన ప్రజల యుద్రేకమునకు***
***అల్లకల్లోలమై దద్దరిల్లిపోయె***
***తెల్లదొరల ప్రభుత్వమందిరమ్ములెల్ల॥***

***అని కదా 'ఆగస్టు విప్లవం' కర్త ప్రస్ఫుటీకరణ!***

అదే సందర్భాన వీరముదితగా విజృంభించారా నాయకురాలు. అన్ని ప్రాంతాలనీ సందర్శించారు. నాటి ముష్కర పాలక శాసనాల్ని ఊరూవాడా అందరూ ధిక్కరించేలా కార్యాచరణ చేపట్టారు.

పోలీసు అధికారులు వెంటాడారు. వేధించారు, బాధించారు. నానారకాల హింసలూ పెట్టారు. ప్రాణం తీస్తామని అంటూ భయోత్పాత వాతావరణాన్ని సృష్టించారు. ఎందరు ఎన్ని విధాలుగా అడ్డుపడినా, మడమ తిప్పలేదు ఆ కథానాయిక.

స్త్రీలు విద్యావంతులైతేనే, జాతీయోద్యమం విస్తృతమవుతుందని ఆమెకు బాగా తెలుసు. అందుకని పూర్తిగా వారికోసమే జాతీయస్థాయి విద్యా కేంద్రాన్ని స్థాపించారు. అధ్యయన – ఆచరణల గురించే జీవితమంటినీ అంకితం చేసిన స్ఫూర్తిమూర్తి.

దేశ విదేశాల్లో పోరు సాగుతుంటేనే లక్ష్యం సిద్ధిస్తుందని నమ్మిన వ్యక్తి. తన ఉద్యమ స్థాయిని ఏకంగా అండమాన్‌కి బదలాయించారు. అక్కడికి పలు మార్గాల ద్వారా వెళ్లి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి మరీ తిరిగి వచ్చారు.

***పూజ్య భారతమాత ప్రబోధమదిగొ***
***హస్తినాపురి యొసగు ఆహ్వానమదిగొ***
***రక్తబంధుల స్వాగతారవములవిగొ***
***లెండు, ఆయుధ పాణులు కండు, రండు***
***శత్రు నివహాల ఛేదించి శక్తి గాంచి***
***మించి వేగమ్ముగ పురోగమించవలయు***
***అను భవద్దివ్య సందేశమాలకించి***
***పొంగిపోయె భారతభూమి యెల్ల***
***మూర్తిదాల్చిన పౌరుషమో***
***అఖండమైన ఆత్మవిశ్వాస***
***మహానదమ్మో!***
***సాహసోత్సాహ సత్యతేజస్సొ***
***విశ్వసౌభ్రాత్ర! భారత వీరపుత్ర***

అదీ నేతాజీ సుధీరత! ఆయన వీరాభిమానిగా, అనుయాయిగా, ఆచరణవాదిగా అండమాన్‌కి చేరి ప్రతిమను ఆవిష్కరించి వచ్చారు సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ. ఆయన అంటే అంతటి శక్తి తత్పరత.

తన ధ్యేయసాధనకు ప్రత్యేకించి ఒక పత్రికనూ నెలకొల్పారు ఆ కలం యోధురాలు. భావాల పరంపరను అక్షరబద్ధం చేసి శభాష్ అనిపించుకున్నారు.

జాతి నేతల కలలు ఫలించాయి. స్వాతంత్ర్య గీతిక మనోహరంగా మారు మోగింది. అటు తర్వాత దేశంలోని కొన్ని పరిణామాలకు ప్రత్యక్ష సాక్ష్యమయ్యారు రాజ్యలక్ష్మి. అప్పుడూ నాయకత్వ పటిమనే కనబరచి తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు.

హైదరాబాద్ సంస్థానం. అది స్వతంత్ర భారతంలో విలీనం అయ్యేవరకు పోరు కొనసాగించిన చరిత్ర ఆమెకి ఉంది. జమీందారీలు, సామంత రాజ్యాలను సునాయాసంగా విలీనపరచిన ఘనచరితుడు సర్దార్ వల్లభ్‌భాయి పటేల్. దేశమంత టినీ ఐక్యంగా నిలిపి ఉంచిన సమర్థ కార్యదీక్షా పరుడు. ఆయన ఆదర్శంగా వ్యవహరించిన ఆ నాయకురాలు సంఘీభావానికి పర్యాయపదంగా నిలిచారు. నవోద్యమ ప్రచార క్రియలో అన్నీ తానై ముందడుగు వేశారు. ధన సహాయానికి అనువుగా కార్యక్రమాలను చేపట్టి కృతకృత్యులయ్యారు. వ్యక్తిగతంగా, సంస్థాపరంగా చేదోడు వాదోడుగా ఉండి విలక్షణతను తేటతెల్లం చేశారు.

పటేల్ గురించి ఒక సందర్భంలో ఎంతో భావోద్వేగంగా మాట్లాడారామె. కవి రచననీ ఉదాహరించి గౌరవ ప్రపత్తిని వ్యక్తపరచారు.

***ధీరగంభీర పౌరుషోత్తేజ పటిమ***
***మహిత నిజజాతి రక్షాప్రమాణదీక్ష***
***దేశ సౌభాగ్యముల దిద్ది తీర్చగలుగు***
***మేలి మొనగాడు నేత! పటేలు తాత***

నేతాజీ, పటేల్‌జీ... ఇద్దరికీ చరిత్ర నీరాజనాలు పలుకుతుంది. అదే కోవను తన జీవితంలోనూ ఆచరణకి తెచ్చినందువల్లనే రాజ్యలక్ష్మీదేవి పేరు శాశ్వతత్వాన్ని పొందగలిగింది. ఇటువంటివారి నేతృత్వ ఫలితమే ఆగస్టు పదిహేనును పర్వదినోత్సవంగా మలచింది – నాటికి, నేటికి. మలుస్తూనే ఉంటుంది. ఇకముందూ ఏనాటికీ! ★

కథ

# స్నేహానో మంత్ర

అవని సంబరాజు

గోడ గడియారం వైపు చూస్తూ 'అప్పుడే పదకొండు అయిందా? పోనీలే పని అంతా అయి పోయింది. ఇక పన్నెండు గంటలకు అన్నం వండుకుంటే సరిపోతుంది' అని మనసులో అనుకుంటూ, ఏదో గుర్తుకు వచ్చినట్టుగా తన దూరవాణి (ఫోన్) ఎక్కడ ఉందా అని చూసింది. వంటగదిలోనే ఉంచిన తన ఫోన్‌ను తెచ్చుకుని..మాధవికి ఫోన్ చేయాలి అనుకుంటూ సోఫాలో కూర్చుంది. ప్రతిరోజూ తన ప్రాణ స్నేహితురాలు మాధవితో మాట్లాడకుంటే మనసొప్పదు రాధికకు. ఈ ఆలోచన రాగానే తన మనసుని చదివినట్టుగా మాధవి నుండి ఫోన్ వచ్చింది. ఆశ్చర్యంతో పాటు ఏదో తెలియని భయం కూడా ఒక్క క్షణం ఆవహించింది.

"జరగరానిది ఏమైనా జరిగిందా ఏమి?" అనుకుంటూ తన దూరవాణి పైన ఉన్న ఆకుపచ్చ గుర్తును నొక్కింది. రాధిక సందేహిస్తున్నట్టుగానే అటువైపు నుండి మాధవి ఏడుపు వినపడింది.

"ఏమైందే? మధూ! ముందు నాకు చెప్పు. అమ్మ ఎలా ఉంది?" ఆందోళనగా అడిగింది.

"అంతా అయిపోయింది. ఇక అమ్మ లేదు. నిన్న రాత్రివరకు కూడా బాగానే ఉంది. నిద్ర కూడా మంచిగా పోయింది రాత్రి. ఇంతకు ముందు జావ తాగించాము. అకస్మాత్తుగా వెక్కిళ్లు మొదలయ్యాయి. డాక్టరుగారికి ఫోన్ చేసి రమ్మన్నాము. పల్సాక్సిమీటర్ (Pulsoximeter) తో చూస్తే, నాడి అస్తవ్యస్తంగా కొట్టుకొంటోంది. అంతలోనే ఆమెలో చలనం ఆగిపోయింది.

డాక్టరుగారు ఇంటికి వచ్చి పరీక్షచేసి, రవిని పిలిపించమన్నాడు.

"అమ్మ చనిపోయిందని నిర్ధారణ చెయ్యటానికే వచ్చాను. చాలా రోజుల నుండి అమ్మ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది" అన్నాడు అంటూ బోరు బోరున ఏడవసాగింది.

ఎప్పటికైనా ఇలాంటి రోజును ఎదుర్కొవలసిందే కదా! పుట్టినవాడు గిట్టక తప్పదు కదా! అని తనకి తాను ధైర్యం చెప్పుకుంటూ.

"మధూ! నువ్వు ధైర్యంగా ఉండు. అమ్మ పరిస్థితి మనకు తెలుసు కదా! ఇన్ని రోజులు మంచం మీద అవస్థ పడింది. ఒక రకంగా నరకం లోంచి బయటపడింది కదా! అలా ఆలోచించు. నీతోపాటు చిన్నపిల్లలున్నారు. నువ్వు ఏడుస్తూ ఉంటే వాళ్లు భయపడతారు. నేను వెంటనే బయలుదేరి వస్తాను. నువ్వు అధైర్యపడకు."

"తమ్ముడికి ఫోన్ చేసావా? నేను చెయ్యనా?" అంది రాధిక.

"రవి అమెరికాలో ఉన్నా వాడి మనసంతా అమ్మమీదే ఉంది. ఎప్పుడూ కెమెరాతో చూస్తూనే ఉంటాడు. అమ్మ ఏదోలా ప్రవర్తిస్తుంది. అనగానే వాడికి చెప్పాను. కెమెరాలో చూడమని. వాడికి విషయం అంతా తెలిసింది. భారత దేశానికి రావటానికి టికెట్ల కొరకు చూస్తున్నాడు. నాకు కాళ్లూ చేతులూ ఆడటం లేదు. నువ్వు వెంటనే రా" అంటూ ఏడుస్తూనే చెప్పి ఫోన్ పెట్టేసింది.

రాధిక చకచకా చెయ్యవలసిన పనుల ప్రణాళిక వేసేసింది. రాత్రి భోజనానికి భర్త వరుణ్, పిల్లలకు కావాల్సిన ఏర్పాట్లు చేసింది. ఎదురింటి వాళ్లతో పిల్లల్ని పాఠశాల నుండి తీసుకురమ్మని, వరుణ్ వచ్చేవరకు చూసుకొమ్మని జరిగిన విషయం చెప్పి తాను వెళ్తున్నానని చెప్పింది. వరుణ్‌కి ఫోన్చేసి విషయం చెప్పింది. అతను వెంటనే "నువ్వు ముందు వెళ్లి నీ స్నేహితురాలికి ధైర్యం చెప్పు తనతో ఉండు. నా గురించి పిల్లల గురించి ఆలోచించకు. పిల్లలను నేను చూసుకుంటాను. నువ్వు పక్కనుంటే మాధవికి కొండంత ధైర్యం, ఆలస్యం చేయకు" అన్నాడు.

"సరే" అని ఫోన్ పెట్టేసింది.

వరుణ్ చాలా మంచివాడు. అర్థం చేసుకుంటాడు. ఎంతో సున్నితమైన మనసు, అతనితో పోల్చుకుంటే నాకే కాస్త గడుసుతనం ఎక్కువ అనుకుంటూ కారు తాళాలను చేతిలోకి తీసుకుంది. కారు నడుపుతున్నంతసేపూ రాధిక వాళ్ల అమ్మగారు అన్నపూర్ణమ్మగారి జ్ఞాపకాలే. తను మాధవి ఒకే కాలేజీలో చదివారు. ఇద్దరూ పాటలు పాడుకుంటూ మాధవి వాళ్లింట్లో గంటల కొద్దీ సమయం గడిపేవారు. వీళ్ల పరీక్షలప్పుడు అన్నపూర్ణమ్మ ఎంతో సహాయం చేసేది. ప్రశ్నలు అడగటం, ఏ ప్రశ్నకి ఎలా సమాధానం రాయాలి అని చెప్పటం లాంటివి చేసేది. కొన్నిసార్లు వీళ్లిద్దరితో మంచిమంచి వంటలు కూడా చేయించేది. రాధిక, మాధవి సరదాగా మాట్లాడుకుంటూ కొత్త వంటలపై ప్రయోగాలు చేసేవారు.

వరుణ్‌తో తన పెళ్లి కూడా అన్నపూర్ణమ్మగారే కుదిర్చారు కదా! ఇలా ముసురుతున్న ఆలోచనలతోనే మాధవి ఇంటికి వచ్చేసింది.

బాధలో ఉన్న మాధవిని ఓదారుస్తూ తనతో తెచ్చిన చపాతీ తినిపించి, పండ్ల రసం తాగించింది. పిల్లలను పైన గదిలోకి వెళ్లి ఆడుకొమ్మని, అక్కడే ఉండమని చెప్పింది. మధు బంధువులకు విషయం తెలిసింది. ఒక్కొక్కరే వచ్చి వెళ్తున్నారు. రాధిక తరువాత జరగవలసిన కార్యక్రమాలేంటి అని తెలుసుకొని, పురోహితుడిని మాట్లాడటం, దహన సంస్కారాలకు కావల్సిన ఏర్పాట్లు చేయటం లాంటి పనులన్నీ దగ్గరుండి చూసు కొంది. రవి రాగానే జరగవలసిన కార్యక్రమం అంతా వెంట వెంటనే జరిగిపోయింది. రవి ఎంతో శ్రద్ధగా దహన సంస్కారాలు పూర్తి చేసాడు. ఇంట్లో పదిరోజులూ గరుడ పురాణం పారాయణం చేయించాడు. నిత్యకర్మలను ఆచరించాడు. కర్మకాండ జరిపించటానికి వచ్చిన బ్రాహ్మణుడు కూడా ప్రతి విషయం అందరికీ అర్థమయ్యేలా విశదీకరిస్తున్నాడు. ధర్మోదకాలు, దశాహం లాంటివి జరిగిపోయాయి. 12వ రోజు రానే

వాకాటి
పాండురంగరావు
స్మారక దీపావళి
కథల పోటీకి
ఎంపికైనది



వచ్చింది. చూస్తుండగానే ఒక మనిషి వెళ్లిపోయి పన్నెండు రోజులయింది అని తలుచు కుంటే ఆశ్చర్యంగా ఉంది. పన్నెండవరోజు సపిండీకరణము. బ్రాహ్మణుడు పిండపురాణం, గరుడపురాణంలలోని విషయాలను చెప్తూ కర్మకాండను జరిపిస్తున్నాడు.

పాంచభౌతికమైన ఈ శరీరం నుండి మర ణించిన తరువాత మళ్లీ ఈ పంచభూతాలు శరీరం నుండి విడిపోతాయి. ఆ పంచభూతాలు భూమి, నిప్పు, నీరు, గాలి, ఆకాశం, దేహి, దేహం నుండి వెళ్లిపోగానే పంచభూతాలు ఎలా వచ్చాయో అలా వెళ్లిపోతాయి. ముందుగా గాలి (ఊపిరి రూపంలో), అగ్ని (శరీరం చల్లబడటం), నీరు (శరీరంలోని తోలుతిత్తిలోని రంధ్రాల ద్వారా) వెళ్లిపోగా భూతత్వములయిన ధాతువులు, గోళ్లు, ఎముకలు మిగులుతాయి. అవి కూడా కొన్ని రోజులకు భూమిలో కలిసిపోయి, ఈ శరీరాకాశం, మహాకాశంలో కలిసిపోతుంది. చనిపోయిన వ్యక్తి ప్రేతరూపంలోకి మారి పోతాడు....

ఇలా బ్రాహ్మణుడు, మంత్రాలను చదువుతూ 16 పిండాల ప్రాధాన్యత గురించి చెప్తూ వెళ్తున్నాడు.

వింటూన్న రాధిక అలవోకగా ఎవరెవరు వచ్చారు అని చూసింది. కొంచెం దూరంగా కూర్చున్న ఒక మధ్య వయస్కురాలిని చూడగానే గతుక్కుమంది. ఆవిడే శారదగారు. అసలు ఇలా ఎదురుపడాల్సి వస్తుందని కూడా రాధిక ఎప్పుడూ అనుకోలేదు. ఒక రకంగా ఆ మనిషిని మరిచిపోయింది. అదే సమయానికి ఆవిడ కూడా రాధికను చూడటంతో వారిరువురి చూపులు కలుసుకున్నాయి. ఇద్దరు అపరిచితులు కూడా చూపులు కలవగానే అసంకల్పితంగా చిరునవ్వుతో పలకరించుకుంటారు. కాని వీరిద్దరూ అసలు ఏమీ జరగనట్లే ముఖం తిప్పేసుకున్నారు. ఎవ్వరూ బయటపడలేదు.

శారదగారు అన్నపూర్ణమ్మ పనిచేసే బడిలోనే పది సంవత్సరాలు ఉపాధ్యాయు రాలిగా పని చేసింది. అన్నపూర్ణమ్మగారు పదవీ విరమణ చేసినా మధ్య మధ్యలో కలుస్తూనే ఉండేవారు. ఈ పరిచయంలోనే శారదాగారి అబ్బాయి వరుణ్‌ను చూసి, రాధికకు సరిఅయిన జోడు అని, వారిద్దరి వివాహం కుదిర్చారు అన్న పూర్ణమ్మ. శారదగారు మరెవరో కాదు, రాధికకు అత్తగారు. ఇప్పుడు ఇద్దరి మనస్సులలో ఒకటే ఆలోచన మెదులు తుంది. అది వారిద్దరి మధ్య ఒకప్పుడు (చివరి సారిగా) జరిగిన 'మహాసంగ్రామం' అని వారనుకునే వాగ్యుద్ధం.

రాధిక, వరుణ్ ల వివాహం అయిన కొన్ని

అత్తా కోడళ్లు వరుణ్ ఉన్నంతసేపూ బాగానే ఉండేవారు. ఒక్కోసారి మాటామాటా కూడా అనుకునేవారు వరుణ్ లేని సమయంలో. ఈ నాటకం మాత్రం ఎన్ని రోజులు సాగుతుంది? 'ఎంతో కష్టపడి కొడుకుని కనిపెంచి, పెద్దచేసి ప్రయోజకుడిని చేసాను. నా మాట కూడా వినాలి' అని తల్లి; ఎక్కడో పుట్టి ఈ ఇంటికి వచ్చాను. నా త్యాగానికి కూడా విలువివ్వాలని కోడలు. ఈ సమస్య తెగేది కాదు కదా! ఒకరోజు గ్రహాలు అనుకూలించలేదు.



సంవత్సరాలు బాగానే ఉన్నాయి. అత్తమామలు రాధిక వరుణ్ ఇద్దరు చిన్న పిల్లలతో రోజులు సంతోషంగానే గడిచాయి. పనుల ఒత్తిడి వల్లనో, మరేదో కారణం చేతనో మెల్లగా శారదమ్మలో, రాధికలో కూడా మార్పులు వచ్చాయి. చిన్న చిన్న విషయాలు సమస్యలుగా కనపడేవి. చిన్న చిన్న తగాదాలు కూడా అప్పుడప్పుడు వచ్చేవి. కాని, భర్త మనసు నొప్పించకూడదని రాధిక, కొడుకు బాధపడతాడని శారదమ్మ, ఎప్పుడూ వరుణ్ ముందు బయటపడేవారు కాదు. కాని ఏదో జరుగుతోంది ఇంట్లో అని వరుణ్‌కు తెలిసి పోయేది. చాలాసార్లు శారదమ్మ కొడుకుతో చెప్పాలని వెళ్లేది. కాని ఆఫీస్ మీటింగ్‌లతో సతమతమవుతున్న కొడుకుని చూసి వెనకకు వచ్చేసేది. సమయం చూసి ఒకసారి రాధిక, భర్తతో చెప్పాలని ప్రయత్నించింది. కాని వరుణ్, "మీరు ఇద్దరు ఆడవాళ్లూ తేల్చుకోండి, ఏదైనా సమస్య ఉంటే. నాకు ఆఫీస్ పనితోనే సరిపోతుంది. ఇప్పుడు నా ఉద్యోగం ఎన్ని రోజులుంటుందో తెలియదు. కొత్త ఉద్యోగం వెతుక్కోవాలి. దయచేసి ఏవైనా తగాదాలు ఉంటే నా దగ్గరికి తీసుకురావద్దు" అని చెప్పాడు.

అత్తా కోడళ్లు వరుణ్ ఉన్నంతసేపూ బాగానే ఉండేవారు. ఒక్కోసారి మాటామాటా కూడా అనుకునేవారు వరుణ్ లేని సమయంలో. ఈ నాటకం మాత్రం ఎన్ని రోజులు సాగుతుంది? 'ఎంతో కష్టపడి కొడుకుని కనిపెంచి, పెద్దచేసి ప్రయోజకుడిని చేసాను. నా మాట కూడా వినాలి' అని తల్లి; ఎక్కడో పుట్టి ఈ ఇంటికి వచ్చాను. నా త్యాగానికి కూడా విలువివ్వాలని కోడలు. ఈ సమస్య తెగేది కాదు కదా! ఒకరోజు గ్రహాలు అనుకూలించలేదు. మాటకు మాట సమాధానం చెప్పటం, ఒకరి లోపాల్ని ఒకరు ఎత్తి చూపించటం, ఒకరి బలహీనతలను ఒకరు వ్యంగ్యంగా విమర్శించుకున్నారు. ఇద్దరిలో అహం, ఆత్మాభిమానం దెబ్బతిన్నాయి. ఆవేశం, కోపంలో "ఈ ఇల్లు నాది. నేను వరుణ్‌ను పెళ్లి చేసుకొన్నాక కొన్నది" అని రాధిక ఇంటి నుండి వచ్చేసింది. పొరపాటు జరిగింది అని ఒక క్షణం అన్పించినా, ఏదో ఒకటి ఈ రోజు తేల్చుకోవాల్సిందే అన్న పంతంతో కొనసాగించింది.

"నిన్న మొన్న వచ్చావు ఈ ఇంట్లోకి, ఇంత పొగరా! సరే నేను ఈ ఇంటి నుండి వెళ్లిపోతాను. నేను చచ్చినా ఈ ఇంటి గడప తొక్కను. నీ మొహం కూడా చూడడం నా కిష్టం లేదు. మా ఆస్తిలో చిల్లి గవ్వ కూడా నీకు దక్కనివ్వను, అంతా అనాథాశ్రమానికి రాసేస్తాను" అంటూ ఏడుస్తూ తన గదిలోకి వెళ్లిపోయింది శారదమ్మ. ఇక ఈ ఇంట్లో ఉండటం ఇష్టంలేదు. వరుణ్ వచ్చేవరకు ఎలాగోలా ఉండి రాగానే చెప్పింది. "ఊళ్లో వ్యవసాయం పనులున్నాయి. ఈసారి నెలపైగానే ఉండి పనులన్ని చక్కబెట్టుకొని వస్తాము" అని. వరుణ్ బాధపడితే శారదమ్మ మనసు తల్లడిల్లుతుంది.

సరేనన్నాడు వరుణ్. ఈ అబద్ధం అంత అతికినట్టుగా లేదు అని గ్రహించాడు. నెల కాస్తా, నెలలుగా, సంవత్సరాలుగా మారింది. ఎవరింట్లో వాళ్లు ఆనందంగా (నే) ఉన్నారు. తరువాత వరుణ్ జరిగిన విషయం తెలుసుకొని, కొంచెం బాధ పడ్డాడు. తను మధ్యలో కలుగచేసుకొని ఇద్దరికీ నచ్చచెప్తే బాగుండేదేమో అనుకున్నాడు. కాని ఈ నచ్చ చెప్పటం శాశ్వత పరిష్కారం కాదు కదా! సమస్య ఏమిటో రాధిక చెప్పలేదు. శారదమ్మ మాట్లాడలేదు. వరుణ్ అడగలేదు. ఇద్దరు మనుషులు కలిసి ఉండాలంటే మూడో మనిషి నచ్చచెప్పే ప్రయత్నం చేయటం కాదు, మార్పు, అర్థం చేసుకోవటం అనే ఆలోచన ఆ ఇద్దరిలోనే రావాలి. అదీ స్వయంగా వాళ్ల హృదయాంతరాల లోంచి రావాలి. బయటివాళ్ల జోక్యం ద్వారా ఎన్ని రోజులు కలిసి ఉంటారు? కాలమే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తుందనుకుని ఊరుకున్నాడు.

పండుగలకు, పబ్బాలకు తను, పిల్లలూ ఊరికి వెళ్లేవారు, రాధిక తన తల్లి గారింటికి వెళ్లేది. 'వస్తావా' అని వరుణ్ అడగలేదు. ఊరికి

'వస్తానని 'రాధిక కూడా చెప్పలేదు. ఇలా దూరంగా ఉండటంలోనే ఆనందం, ప్రశాంతత ఉన్నాయనిపించింది అందరికీ.

అమ్మా, నాన్న కూడా మరీ అంత వయసు మళ్లినవాళ్లు కాదు. చక్కగా తీర్థయాత్రలకు వెళ్తున్నారు వాళ్లంతటవాళ్లు, ఎవరిమీదా ఆధారపడలేదు. చూద్దాం ఇలా ఎన్ని రోజులు గడుస్తుందో అని ఊరుకున్నాడు వరుణ్.

* * *

ఇదంతా సినిమా రీల్ లాగా రాధిక, శారదమ్మ మనోఫలకంపై మెదిలింది. ఆ అదో పెద్ద విషయం ఏమీ కాదులే అని కార్యక్రమంలో నిమగ్నమైపోయారు. బ్రాహ్మణుడు సపిండీకరణం మంత్రాలు చదువుతూ దాని ప్రాధాన్యత ఏమిటి. మన హిందూ ధర్మంలో అని చెప్తున్నాడు. రవిచేత అన్నంతో ఒక పెద్ద పిండం, మూడు చిన్న, చిన్న పిండాలు చేయించాడు. ఎడమవైపు పెద్ద పిండం, కుడివైపు మూడు చిన్న పిండాలను వరుసలో పెట్టాడు. పెద్దది రవి వాళ్ల అమ్మ అన్నపూర్ణమ్మ గారిదని, కుడివైపున ఉన్న వాటిలో మొదటిది రవి వాళ్ల నాయనమ్మ రమణమ్మది, రెండవది రమణమ్మ వాళ్ల అత్తగారు ఇందిరమ్మదని, మూడవది ఇందిరమ్మగారి అత్తగారు రుక్మిణమ్మదని, వారు వసు, రుద్ర, ఆదిత్య రూపాలతోను పొందారని చెప్పాడు. మరణించిన అన్నపూర్ణమ్మ ప్రేతరూపం నుండి వరుసగా వసు, రుద్ర, ఆదిత్య రూపాలలోకి మారి తరువాత ఈ అనంత విశ్వం నుండి స్వేచ్ఛను పొందుతుందని, ఇప్పటివరకూ తనకు చేసే శ్రద్ధ కర్మలద్వారానే ఆహారాన్ని పొందుతుందని చెప్పాడు.

చనిపోయిన వారి కర్మలను అనుసరించి యమదూతల యాతనలు ఉంటాయని, పురాణం లోంచి విషయాలను సమయోచితంగా, సందర్భోచితంగా చెప్తున్నాడు.

పెద్ద పిండాన్ని మూడు భాగాలుగా చేయమన్నాడు. ఒక పిండ భాగాన్ని కుడిచేతివైపున్న మొదటి పిండమైన వసురూపంలో ఉన్న రమణమ్మగారి పిండంతో కలిపి ఒకటిగా చేయమన్నాడు. ఇలా రవి చేస్తున్నప్పుడు

"సంఘచ్ఛధ్వం సంవదధ్వం,
సంవో మనాంసి జానతామ్॥
దేవా భాగం యథాపూర్వే
సంజానానా ఉపాసతే?"

అనే మంత్రం చదివి ఆ మంత్రం అర్థాన్ని వివరించాడు.

"మీరు కలిసి ఉందుదురుగాక! కలిసి ఒకే పలుకును పలుకుదురుగాక,

మీ మనసులు ఒకటిగా అగుగాక, ప్రాచీన కాలంలో దేవతలు ఎలాగైతే వారి భాగంను హవిస్సు నుండి పొందారో అలా."

"సమానో మంత్రః సమితిః సమానీ
సమానం మనః సహచిత్తమేషామ్
సమానం మంత్రమభిమంత్రయేవః
సమానేన వో హివిషాజుహోమి॥
సమానీవ ఆకూతిః సమానా హృదయాని వ
సమానమస్తో వో మనో యథావః
సుసహాసతి॥"

అనే వేదమంత్రాన్ని పఠించాడు.

"మన మంత్రము, మనస్సు, ఈ చిత్తం ఒకటి అగుగాక. సమానమైన

అభిమతంను మనం కలిగి ఉండెదముగాక. ఒకే అభిలాషను, సమానమైన

ఆలోచనలను కలిగి ఉండెదముగాక – ఇక మీదట ఇద్దరి లక్ష్యం ఒకటే అగుగాక."

ఇలా అర్థం వివరిస్తూ ఉన్నాడు.

తరువాత అన్నపూర్ణమ్మగారి రెండవ పిండ భాగాన్ని రుద్ర రూపంలో ఉన్న, రమణమ్మ అత్తగారైన ఇందిరమ్మగారి పిండంతో కలిపి ఒకటిగా చేయించాడు రవితో, మళ్లీ

"సంఘచ్ఛద్వం సంవధధ్వం..."

"సమానోమంత్రః సమితీ సమానా..."

మంత్రాలను పఠించాడు.


ఇదే సంపిండీ కరణమని, "ఇతః పరం ప్రేతశబ్దం నాస్తి" అని గట్టిగా చప్పుడు చేయించాడు.

ఇపుడు, ఈ సంపిండీకరణం ద్వారా, ప్రేత రూపంలో ఉన్న అన్నపూర్ణమ్మ వసు రూపంలో ఉన్న తన అత్తగారితో కలిసి వసురూపాన్ని పొందింది. వసు రూపంలో ఉన్న రమణమ్మ, రుద్రరూపంలో ఉన్న తన అత్తగారి స్థానాన్ని పొందింది. రుద్రరూపంలో ఉన్న ఇందిరమ్మ అదిత్యరూపంలో ఉన్న తన అత్తగారైన రుక్మిణమ్మ స్థానాన్ని పొందింది. రుక్మిణమ్మ ఈ సోపానాలను అధిగమిస్తూ వృద్ధ ప్రపితామహిగా మారి శాశ్వతంగా స్వేచ్ఛా జీవిగా ఈ విశ్వంలో కలిసిపోయింది అంటూ ఈ సంపిండీకరణం అంతర్యాన్ని వివరించాడు. అందుకే ఈ కర్మకాండలో శ్రద్ధ చాలా అవసరమన్నాడు.

* * *

మళ్లీ మళ్లీ ఈ మంత్రమే రాధిక, శారదమ్మ చెవుల్లో మార్మోగసాగింది. ఏ సంబంధం లేదు మన మధ్య, ఇక ఉండకూడదు. తెంపేసుకుని ఎవరి ఇంట్లో వాళ్లు సంతోషంగా ఉన్నామని అనుకున్నాము. ఈ శరీరమున్నంతవరకే ఈ దూరాలు. తరువాత జరిగే కర్మకాండలో ఇలాగే మనం ఇద్దరం కలిసి ప్రయాణం చేయవలసిందే కదా! మన రుషులు మనకు ఇచ్చిన ధర్మాచారం ఇది. దీనికి కాదనటానికి లేదు. చనిపోయినా కలిసి చేసే ప్రయాణం నిశ్చితమైనప్పుడు బతికుండగా కలసి నివసించటానికి సమస్య ఏమిటి? అహో ఎంత గొప్పది కదా మన ధర్మం? ఎప్పుడూ శ్రేయస్సునే కోరేది. చావు కూడా బతకటానికి బాటను వేస్తుంది. ఆపైన వాళ్లిద్దరి ధ్యాస కర్మకాండపైన లేదు. మరొక్కసారి వాళ్లిద్దరి చూపులు కలుసుకున్నాయి. రాధికకు కన్నీళ్లు జలజలా రాలాయి. తప్పు చేశాను క్షమించమని అర్థించినట్టుగా! శారదమ్మ కళ్లలో కూడా క్షమించేశాను...నన్ను కూడా క్షమించు. ఇక మీదట మన ఇద్దరి ఇల్లూ ఒకటే, ధ్యేయం ఒకటే, ఆశయం ఒకటే అన్న సందేశం కనపడింది.

ఇద్దరూ చిరునవ్వులను ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ మార్పు వారి హృదయాంత రాలలోంచి వచ్చింది. కాలం సమస్యను తీరుస్తూ, పరిష్కారం చూపెట్టి, తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోయింది. ★






**బాధ్యతలు పట్టని వారికి హక్కులు ఉండవు అని ఇటీవల ఒక మేధావి సరైన పంథాలో తన అభిప్రాయం వెల్లడించారు. భారతదేశంలో ఒక వింత వాతావరణం ఉంది. హక్కుల కోసమే తప్ప, బాధ్యతల గురించి మాట్లాడేవారు కనిపించరు. కోర్టు తీర్పులు సహా తాము కోరుకున్నట్టే రావాలని, లేకుంటే అరాచకాన్ని సృష్టించాలని భావించే వారూ ఎక్కువే. ఇటీవల జమ్ముకశ్మీర్‌లో ఒక పోలీసు ఉన్నతాధికారి ప్రకటన చాలామందిని ఆలోచింప చేసింది. కశ్మీర్ లోయ నుంచి జమ్ముకు ముస్లిం ఉగ్రవాదం విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయన చెప్పిన మాటలు అవి. జమ్ములో గాని, గతంలో కశ్మీర్ లోయలోగాని ఉగ్రవాదం పెరగడానికి కారణం స్థానికుల సహకారమేనని నిస్సంకోచంగా ఆయన చెప్పారు. పాక్ ప్రేరేపిత ముస్లిం మతోన్మాద ఉగ్రవాదం భారత సార్వభౌమాధికారాన్ని సవాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అలాంటి వారికి ఆశ్రయం ఇవ్వడం అతి పెద్ద బాధ్యతా రాహిత్యం. అయితే కశ్మీర్‌లో ప్రజలకు హక్కులు లేవని చాలామంది చెబుతూ ఉంటారు. అలాంటి వాదనలు వినిపిస్తేనే బాధ్యతలు పట్టని వారికి హక్కులు ఎలా ఇస్తామని ఎదురుదాడి చేసేవారు ఎక్కువ అవుతున్నారు.**

# హక్కులు సరే.. మరి

ఒక దేశాన్ని ప్రపంచ మానవాళి ముందు సగర్వంగా నిలిపేవి నాలుగు అంశాలు. బాధ్యత కలిగిన విలువలు పాటించే పౌర జనాభా, నిర్దిష్ట దేశ భూభాగం, నిష్పాక్షిక ప్రభుత్వ పాలన, దేశ సార్వభౌమాధికార సమగ్రతలు అందులో ప్రధానమైనవి. దేశ పౌరులుగా మనందరికీ కొన్ని బాధ్యతలు, హక్కులు ఉన్నాయి. బాధ్యతలు నిర్వహించిన పౌరులకే హక్కులు అనుభవించే అర్హత కూడా ఉంటుందనడం పరిపాటి. నేటి పౌరుల్లో హక్కుల పోరాటాల పట్ల ఆరాటమే తప్ప బాధ్యతల గూర్చిన కనీస కనీస కనిపించదు. భారత్‌లో మనదైన నాగరికత, విలువల సమాజం, అందులో సమత అనాదిగా కొనసాగుతున్నాయి. నేడు దేశంలోని అన్ని విభాగాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. మౌలిక వసతులు, ప్రజా రవాణా వ్యవస్థలు, పౌర సేవలు, పౌర సౌకర్యాలు, ఆధునిక హంగులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు రచించి అమలు చేసినా 'పౌర భావనలు లేదా సివిక్ సెన్స్' లోపిస్తే అవి నిష్ప్రయోజనమై బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని గమనించాలి. ప్రతి పౌరుడికి కొన్ని నిర్దిష్ట బాధ్యతలు ఉన్నాయని మరువరాదు. వేర్పాటు వాదం, ఉగ్రవాదం, విధ్వంసం, అసహనం లాంటివి పెరుగుతున్న నేటి పౌరసమాజంలో సివిక్ సెన్స్ పెంచడం మాత్రమే మన ముందున్న ఏకైక మార్గమని తెలుసుకోవాలి. ప్రజలు సన్మార్గంలో పయనించేలా చూసుకోవాలి.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

**పౌర సమాజ కనీస బాధ్యతలు**

తన వృత్తి విధులను తు.చ తప్పకుండా నిర్వహిస్తూ, సమాజ హిత ఆలోచనలు చేయడం, స్వచ్ఛందంగా సేవలు విస్తరించడం, నీతి-న్యాయం-నైతికతలకు పట్టం కట్టడం, నిర్దేశిత పౌర నియమ నిబంధనలు పాటించడం, పౌరుల హక్కులను గౌరవించడం, పౌర సమాజ అవగాహనకు దోహద పడడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, కరుణ-దయాగుణాలను పెంపొందించుకోవడం, దేశాభివృద్ధికి కృషి చేయడం, సకాలంలో పన్నులు కట్టడం, ప్రభుత్వ పాలనకు సహకరించడం, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రదర్శించడం, దేశభక్తితో జాతీయ పతాకం/గీతాలను గౌరవించడం, సంఘ విద్రోహశక్తుల కట్టడికి పాలనకు చేయూత ఇవ్వడం లాంటి విలువలతో కూడిన విధులు దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తాయి. ఎంత సంపద ఉన్నా ఆ దేశ ఖ్యాతి అంతర్జాతీయ యవనికపై అక్కడి పౌర సమాజ సున్నిత స్వచ్ఛంద ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుందని గమనించాలి.

**'సివిక్ సెన్స్' కొరవడితే అనర్థాలే**

సివిక్ సెన్స్ లేదా పౌర భావనలు సన్నగిల్లితే సమాజంలో అశాంతి, అనారోగ్యకర పరిస్థితులు రాజ్యమేలుతాయి. ఇతరుల హక్కులకు భంగం కలిగించడం, సామాజిక-నైతిక ప్రవర్తనలు సన్నగిల్లడం, దేశభక్తి పలుచబడడం, పౌర నియమ నిబంధనలను బేఖాతరు చేయడం, పన్నులు ఎగవేయడం, స్వార్థ బుద్ధి ప్రబలడం, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం, ట్రాఫిక్ రూల్స్‌కు తూట్లు పొడవడం, పరమత-కుల-ప్రాంత అసహన జ్వాలలు ఎగిసి పడడం, పక్షపాతం పెట్రేగిపోవడం, సాంస్కృతిక వారసత్వాలకు విలువ ఇవ్వక పోవడం, సామాజిక కట్టుబాట్లను ఛేదించడం లాంటి కారణాలతో దేశంలో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రోజు రోజుకు అక్షరాస్యత, విద్య పెరిగినప్పటికీ పౌరుల్లో 'సివిక్ సెన్స్' మాత్రం పెరగడం లేదని స్పష్టం అవుతున్నది.

**పౌర బాధ్యతలు నిర్వహిస్తున్నామా!**

ఇంటి వ్యర్థాలు/చెత్త చెదారాలను వీధుల్లో వేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, కాలుష్యానికి కారణం కావడం, ట్రాఫిక్ రూల్స్‌ను తుంగలో తొక్కి ప్రమాదాలకు కారణం కావడం, నిరసనల సందర్భంగా ప్రజారవాణా బస్సులు/ప్రభుత్వ కార్యాలయాలు/ఆస్తులను నాశనం చేయడం లాంటి ప్రమాదకర సంఘటనలు తరుచుగా చూస్తూ సున్నిత పౌరులు బాధ పడడం జరుగుతోంది. దేశవ్యాప్తంగా 2022లో 4,61,312 రోడ్డు ప్రమాదాలు నమోదు కావడంతో పాటు 1,68,491 మంది ప్రాణాలు కోల్పోవడం కూడా పౌర భావనలు సన్నిగిల్లడమే కారణంగా పేర్కొనాలి. ప్రతి ఒక్కరు బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించి ఉన్నట్లయితే ఈ ప్రాణాలు నిలిచి పోయేవని గమనించాలి. అలాగే పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి వాటిని తీసుకోవటంలో అలసత్వం చూపితే మన ఆరోగ్యమే దెబ్బతింటుంది. కల్తీ, లంచగొండితనం, దోపిడీ, అవినీతి అక్రమాలు లాంటివి నిత్యం మనల్ని, మన ఆరోగ్యాలను హరిస్తున్నాయని తెలుస్తున్నది.



# బాధ్యతలు..!?

**పౌర భావనలే సమాజాభివృద్ధికి రక్ష**

మన జీవన ప్రమాణాలు, సుఖసంతోషాలు పెరగడానికి సివిక్ సెన్స్ ఉండడం మాత్రమే ఏకైక మార్గమని తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైనది. పౌరుల్లో సివిక్‌సెన్స్ పెంచడం మన కనీస కర్తవ్యం. ఉన్నత విద్యతో పౌరభావనలు నెలకొని విలువలతో కూడిన సమాజం చిగురించే అవకాశం చాలా ఉంది. అనాగరిక ప్రవర్తనలను అందరు వ్యతిరేకించాలి. చట్టాలను ఉల్లంఘించే సంఘ విద్రోహుల చేతులకు బేడీలు తొడగాలి. అందుకు సాయపడాలి. సమాజంలోని విద్యావేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, పెద్దలు తమ విధిగా సివిక్ సెన్స్‌ను ప్రచారం చేయాలి, పాటించే విధంగా కార్యాచరణను తీసుకోవాలి. చట్టం గీత దాటిన వారికి సత్వర శిక్షలు వేయడం, అవగాహనలను విస్తృతపరచడం, సత్పురులను సన్మానించడం, ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పడం, జాతీయ సమగ్రతను కాపాడడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడం లాంటి పౌర బాధ్యతలు దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తాయి.

రాజ్యాంగం విషయంలో కూడా కొన్ని అవాంఛనీయ పరిస్థితులు ఎదురవుతున్నాయి. రాజ్యాంగం చెబుతున్న దానిని పాటించకుండా, లేదా ప్రతిఘటిస్తూ తమకు హక్కులు కావాలని వాదించే అసంబద్ధ వైఖరి దేశంలో ముదిరిపోతోంది. పదుల సంఖ్యలో లేదా వందల సంఖ్యలో అమాయకులను పొట్టన పెట్టుకున్న వారికి పెద్ద శిక్ష పడితే ఆ నేరగాళ్ల మానవ హక్కుల గురించి రోడ్డెక్కి ఉద్యమాలు నడిపించే కుహనా 'పౌర సంఘాలు' ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. ఇలాంటి వాదనలు, ప్రతిపాదనలు రాజ్యాంగం పట్ల సందిగ్ధ స్థితిని సృష్టిస్తాయి. కోర్టులను ప్రశ్నార్థకంగా చూసే వాతావరణాన్ని సృష్టిస్తాయి. కొందరికే పౌర హక్కులా అన్న ప్రశ్న ఇప్పటికే దేశంలో, సాధారణ ప్రజలలో బలంగానే వినిపిస్తున్నది. ఇది సరైన ధోరణి అనిపించుకోదు. ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసే భస్మాసుర వైఖరిని నిలువరించాలి.

పౌర భావనలను పాఠశాల దశ నుంచే బోధించడం మన కనీస బాధ్యతగా తీసుకోవాలి. వైవిధ్యభరిత భారతంలో ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సివిక్ సెన్స్‌ను పెంపొందించుకుంటూ మన భారతీయ సనాతన వసుధైక కుటుంబకం పౌర భావనలకు విలువనివ్వాలి, శాంతియుత సమాజ స్థాపన స్వప్నాన్ని సాకారం చేసుకోవాలి.

★

**కనువిప్పు**

# మార్క్సిస్టుల 'భక్తి' మంత్రం

**మతం మత్తుమందు అంటుంది మార్క్సిజం. అసలు పార్లమెంటరీ రాజకీయాలే ఓ రొచ్చుగుంట అని మొదట్లో బాగా నమ్మినా, తరువాత రొచ్చుగుంట ప్రవేశం చేసింది వామపక్షం. ఇప్పుడు ఈ రెండింటినీ ఇంకాస్త గట్టిగా కౌగలించుకోబోతోంది కేరళ సీపీఎం. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో బొప్పి కట్టి ఉన్న సీపీఎం కొత్త మంత్రం వల్లించేందుకు సర్వం సిద్ధం చేసుకుంది. 'కార్యకర్తల్లారా! గుళ్లకు వెళ్లండి! మతాచారాలను పాటించండి.' అని చెబుతోంది. దేవాలయాల మీద మీ ఆధిపత్యం స్థాపించండి అని కూడా కార్యకర్తలకు పిలుపునిచ్చింది. ఇదంతా ఇటీవల రెండు రోజుల పాటు తిరువనంతపురంలో జరిగిన సీపీఎం ప్లీనమ్‌లో జరిగిన పరిణామమే. మతం మందు అంటూ కూర్చుంటే ఎర్ర కేరళ కాస్తా కాషాయ కేరళం అవుతుందని అక్షరాలా వణికిపోతున్నది సీపీఎం.**

'సోవియెట్ యూనియన్ పతనం తరువాత కేరళలో మార్క్సిస్టులు ఇలాంటి సవాలును ఎదుర్కొనడం ఇదే మొదటిసారి. ఏ విధంగా చూసినా ఇదొక ప్రత్యేక పరిస్థితి. వ్యవస్థాపరంగా పార్టీ రాజకీయంగా బలహీనపడింది. కార్యకర్తలు సిద్ధాంతపరంగా దివాలాకోరుతనంతో ఉన్నారు. మేం ప్రజల దగ్గరకు మళ్లీ వెళ్లాలంటే ముందు కార్యకర్తలను సిద్ధాంతపరంగా బలోపేతం చేయాలి. ఆ దిశగా మేం త్వరలోనే దిద్దుబాటు చర్యలు తీసుకుంటాం' అని ఒక ప్రముఖ నాయకుడు మీడియా వద్ద పేరు చెప్పకుండా వాపోయాడు. లోక్‌సభ ఎన్నికలలో ఘోర పరాజయం తరువాత ఆ పార్టీ వరసగా సమావేశాలు జరుపుతూ దుర్భిణి వేసి మరీ ఆత్మశోధన చేసుకుంటున్నదని వార్తలు వెలువడ్డాయి. ఫలితాలు వచ్చిన వెంటనే ఆ వేడిలో కేరళలో పార్టీ జిల్లా స్థాయి సమావేశాలు చాలా జరిగాయి. మనం ప్రజలకు దూరమయ్యాం, ప్రజలు మనకు దూరమయ్యారు అంతే అంటూ, లాంఛనప్రాయమైన పాత



పాటనే ప్రకటనగా మలిచి రాష్ట్రం మీదకి వదిలి పెట్టారు. తాజాగా తిరువనంతపురంలో జరిగిన పార్టీ రాష్ట్ర స్థాయి మూడురోజుల సమావేశం అసలు పార్టీ తన పూర్వపు పైత్యాన్నంతా వదిలేసుకుంటున్నట్టు నమ్మించే ప్రయత్నం చేయడమే పెద్ద మార్పు. జూలై 21వ తేదీన ఆ సమావేశాలు ముగిశాయి. నిజంగానే తాజా ప్లీనమ్‌కి ప్రాధాన్యమే ఉంది. ఒక్క సంవత్సరం క్రితమే పాలక్కాడ్‌లో పార్టీ ప్లీనమ్ జరిగింది. దాని ప్రకారం అసలు మతం, దేవుడు వంటి వాటి దరి దాపులకు కూడా సీపీఎం సభ్యులు ఎవరూ పోకూడ దని నిర్ణయం పాలక్కాడ్‌లో నిర్ణయించారు. దానికి పూర్తి విరుద్ధమైన నిర్ణయం తిరువనంత పురంలో తీసుకున్నారు.


2013 ప్లీనమ్‌లో తీసుకున్న నిర్ణయాల గురించి కొంచెం తెలుసుకుందాం. గుడికి వెళ్లి పూజలు, హోమాలు, జపాలు చేయకూడదని అప్పుడు పార్టీ హుకుం జారీ చేసింది. అసలు దేవస్థానాల సంఘా లలో కూడా ఎవరూ సభ్యులు కారాదని కూడా ఆదేశించింది. ఆఖరికి ఇల్లు కట్టుకుంటే, గణపతి హోమం వంటివి కూడా చేయరాదని చెప్పింది. మరీ ఇంత దారుణమా అంటూ అప్పుడు అన్ని వైపుల నుంచి నిరసన వచ్చింది.

గిరీశం చెప్పినట్టు ఆత్మానుభవం అయితే గాని తత్త్వం బోధపడదు. ఇప్పుడు సీపీఎంకి అలాంటి తత్త్వమే బోధపడిందని అనుకోవాలి. మత విశ్వాసాల పట్ల పార్టీ మరీ రెచ్చిపోతున్నదేమోనన్న సందేహం కలిగింది. అది సందేహం కాదు, పచ్చి నిజమని కూడా ఆలస్యం లేకుండా తేలిపోయింది. ఎందుకంటే మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ఎర్ర పార్టీ కార్యకర్తలు కాషాయ పార్టీకి ఓట్లు వేసేశారు. మలబార్ వంటి ప్రాంతంలో ఇది మరీ కొట్టొచ్చినట్టు కనపడడంతో కామ్రేడ్లలో కంగారు ఇంకాస్త ఎక్కువయింది. ఇంకొక సత్యం కూడా సీపీఎం నాయకత్వానికి తెలిసి వచ్చింది. పాలక్కాడ్ నిర్ణయాల తరువాత సీపీఎం వాళ్లు దేవస్థానం కమిటీలను వదిలేశారు. ఆ పదవులన్నీ ఆర్ఎస్ఎస్ వారు తమ పరం చేసుకున్నా రని కూడా తెలిసింది. దేవాలయాలు, పవిత్రత, ఆచారాలు, సంస్కృతి వంటి అంశాలలో నిక్కచ్చిగా ఉండే ఆర్ఎస్ఎస్ ఈ విషయంలో బాగా విజయం సాధించిన సంగతి కూడా వెల్లడైంది. ఇక్కడ రాష్ట్ర సెక్రటేరియెట్ సభ్యుడు లోపాయికారీగా చేసిన వ్యాఖ్యను గుర్తు చేసుకోవచ్చు. ‘రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ ఉనికి ఎప్పుడో 1950 నుంచీ ఉన్నమాట నిజం. అయితే దాని గళం ఇప్పుడు వినిపిస్తున్నంత స్పుటంగా గతంలో ఎప్పుడూ వినపడలేదు’ అన్నాడు. అన్నట్టు ఈయన కూడా పేరు వెల్లడించడానికి నిరాకరించిన నాయకుడే. ఇవన్నీ చూశాకే లక్షలలో ఉన్న సీపీఎం కార్యకర్తలకు కాస్త వెసులుబాటు కల్పించి పూజాపునస్కారాలు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఆలోచనకు పార్టీ వచ్చినట్టు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఇలాంటి వెసులుబాటే కనుక ఇప్పుడు ఇవ్వకపోతే హిందూ మార్క్సిస్టులు పూర్తిగా కాషాయం వైపునకు వెళ్లిపోతారేమోనని పార్టీ భయపడుతున్నది. మత విశ్వాసాల మీద పార్టీకి ఉన్న గత వైఖరిని కాస్త సమీక్షించుకుంటాం అని ప్లీనమ్ ఆరంభానికి ముందే కొందరు సూచనప్రాయంగా చెప్పారు. మన పార్టీ మతోన్మాదులకు వ్యతిరేకం కానీ, మత విశ్వాసాలకు కాదని సర్దుబాటు ధోరణిలో సీపీఎం నాయకులు మాట్లాడడం కూడా మొదలైంది.

నిజానికి మత విశ్వాసాల పట్ల పార్టీ వైఖరి అంత సజావుగా,మృదువుగా, మర్యాదగా ఏమీ లేదన్న భావన 2019లోనే వెల్లడైంది. శబరిమలై వ్యవహా రంలో సీపీఎం ప్రభుత్వం తన హిందూ వ్యతిరేకతను నగ్నంగానే బయటపెట్టింది. అది అంతకంతకు పెరుగుతూనే ఉంది. అట్టుకల్ ఉత్సవం కోసం తిరువ నంతపురంలోని అట్టుకల్ భగవతి ఆలయంలో కట్టిన కాషాయ జెండాలను సీపీఎం కార్యకర్తలు పీకేశారు. అంతేకాదు, ముఖ్యమంత్రి ఘనతను చాటుతూ ఒక హోర్డింగ్‌ను అలంకారాలు కనిపించకుండా పెట్టారు.

కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలన్నీ ఎన్నికల ఫలితాలను బట్టి మాత్రమే మార్పులు తెచ్చు కుంటాయి. 2019 లోక్‌సభ ఎన్నికలలో కూడా కేరళలో సీపీఎం అధికారంలో ఉన్నప్పటికీ ఘన విజయాలేమీ సాధించలేదు. ఒక్కటంటే ఒక్క లోక్‌సభ సీటు దక్కింది. ఈసారి అదీ లేదు. వయనాడ్‌కు రాహుల్ రావడం మరొక బెడద. అప్పుడే అప్పటి రాష్ట్ర పార్టీ కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ కొన్ని ఇళ్లకు తిరిగి అభిప్రాయాలు తీసుకున్నారు. శబరిమలై ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో పార్టీ వేసిన వీరంగం గురించి హిందువుల నుంచి గట్టి విమర్శలే వచ్చాయి. అందుకే బాలకృష్ణన్ ప్రధానంగా హిందువుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పేది విని, మీ సూచనలు పాటిస్తాం అని చెప్పారు కూడా. మళ్లీ 2021 శాసనసభ ఎన్నికలలో పార్టీ రెండోసారి వరసగా గెలిచేసరికి హిందుత్వ మీద పాత విధానమే మొదలుపెట్టింది.

ఈ మార్పుకి పునాది ఏమిటి? భారతీయ సమాజం ఇప్పటికీ భూస్వామిక వ్యవస్థగానే ఉందని సీపీఎం నమ్మకం. కాబట్టి ప్రజా విప్లవం రాకుండా గతి తార్కిక భౌతికవాదానికి చోటు ఉండదు. అందుకే విశ్వాసం అనేది సొసైటీ మీద తీవ్ర ప్రభావం చూపే అంశం అన్న సత్యం శాసనసభలో విజయం తరువాత వెంటనే బోధపడింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉంది. పాలక్కాడ్ సమావేశాలతో సీపీఎంలోని దైవభక్తులు తీవ్ర నిరాశలో పడిపోయారు. నిజం చెప్పాలంటే మార్క్సిస్టు పార్టీలో మెజారిటీ ప్రజలు దైవభక్తి ఉన్నవారే. అలాంటిది, మీరు గుడులకు వెళ్లొద్దు, పూజలు చేయవద్దంటే అది పార్టీ మీద ప్రతికూల ప్రభావం చూపించకుండా ఎలా ఉంటుంది అని ప్రశ్నించినవారు కూడా లేకపోలేదు. ఈ క్రమంలోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ వామ పక్ష కార్యకర్తలను తమ వైపునకు తిప్పుకోగలిగాయని కూడా సీపీఎం భావిస్తున్నది. ఏమైనా ఈ విషయం నేరుగా చెబితే పార్టీ పురోగమన, సెక్యులర్ వ్రతాలకు భంగం కాబట్టి కొత్త నినాదం అందుకుంది పార్టీ. కేరళలో ఆలయాలు సంఘపరివార్ చేతులలోకి పోకూడదు అన్నదే ఆ నినాదం. అంటే సీపీఎం కబళించాలనే. ఇది ఎందుకట! వ్యవస్థలో మతోన్మా దులు ఎవరు? నిజమైన భక్తి తత్పరులు ఎవరు? అన్న విషయంలో ప్రజలను చైతన్యం చేయడానికట. పార్టీ నాయకులు పూజలూ పునస్కారాలకి దూరంగా ఉంటే మంచిదని చెప్పామే తప్ప, భక్తి ప్రపత్తులు ఉన్న పార్టీ కార్యకర్తల మనోభావాలను అణచి వేయడం మా ఉద్దేశమే కాదు అన్నాడొక పెద్దనాయ కుడు. అంటే ఇప్పుడు కొత్త దేవుళ్లు కాదు, కొత్త భక్తులు వస్తున్నారు. వీళ్లతో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. ★





# ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని నిరూపించిన సుప్రీంకోర్టు తీర్పు

**వివాహం, విడాకులు, వారసత్వం వంటి అంశాలలో దేశ ప్రజలందరికీ సమంగా వర్తించే ఒక చట్టం రావలసిన అవసరం నానాటికీ పెరుగుతున్నది. అలాంటి చట్టం లేకపోవడం వల్ల ఎందరు అమాయకులు బలిపీఠం ఎక్కవవలసి వస్తున్నదో కూడా ఆధునిక సమాజానికి అర్థమవుతూనే ఉంది. సుప్రీంకోర్టు ఈ మధ్య ఇచ్చిన ఒక తీర్పు అందుకు సంబంధించినదే.**

విడాకులు పొందిన ముస్లిం స్త్రీ సీఆర్‌పీసీ సెక్షన్ 125 క్రింద భరణం కోరవచ్చునని ఆ తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పు ఇస్లామిక్ చట్టాలకు వ్యతిరేకమని (షరియా) ముస్లిం పర్సనల్ లా బోర్డు (A.I.M.P.L.B) వెంటనే ధ్వజమె త్తింది. ముస్లిం పర్సనల్ లా బోర్డు అని చెప్పుకుం టున్న ఈ సంస్థ ఆ వర్గానికి చెందిన స్త్రీల విషయంలో ఎలాంటి సంస్కరణలను వ్యతిరేకిస్తున్నది? ఈ అంశం గురించి అంతా ఆలోచించాలి. తాజా తీర్పు అందుకు దోహదం చేస్తుంది.

ముస్లిం స్త్రీలకు మూడు పర్యాయాలు తలాక్ చెప్పి విడాకులు ఇవ్వడం నేరంగా పరిగణిస్తూ 2019 బీజేపీ ప్రభుత్వం చట్టం తెచ్చింది. అప్పుడు కూడా పర్సనల్ లా బోర్డ్ వ్యతిరేకించింది. ఆ సంస్థది ఆది నుంచి ఇదే వైఖరి. షాబానో కేసులో 1985లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఈ బోర్డ్ వ్యతిరేకించింది.

అయితే అప్పటి రాజీవ్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు ధోరణితో ఛాందస ముస్లింలకు తలవొగ్గి, 1986లో ముస్లిం స్త్రీల విడాకుల చట్టం తీసుకువచ్చింది. సుమారు 35 సంవత్సరాల తరువాత ఇపుడు సుప్రీం కోర్టు మళ్లీ అదే అంశం మీద మరొక చారిత్రక తీర్పును ఇచ్చింది. అదే మహమ్మద్ అబ్దుల్ సమద్ వర్సెస్ తెలంగాణ ప్రభుత్వ వ్యాజ్యం. ఈ వ్యాజ్యం మీదే జూలై 10న సుప్రీం కోర్టు తీర్పు వెలువడి మరొకసారి సంచలనమైంది. ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని గుర్తు చేసింది.

తనను, పిల్లలను భర్త వదిలేశాడనీ, సెక్షన్ 125 సీఆర్‌పీసీ క్రింద తనకు భరణం ఇప్పించాలనీ కోరుతూ ఒక ముస్లిం మహిళ హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. అతడు 2017లో తలాక్ చెప్పాడు. ఈ విడాకులు ముస్లిం ఖయాత్‌లో ఇవ్వడం వల్ల వారు విడాకుల ధృవీకరణ పత్రం ఇచ్చారు.

ఆ సంగతి అలా ఉండగా, హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. నెలసరి రూ.20వేల చొప్పున భరణం ఇవ్వవలసి నదిగా ఆమె భర్తను ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూనే ఆమె భర్త హైకోర్టును ఆశ్రయించి, సెక్షన్-125 క్రింద భరణం ఇవ్వాలని చెప్పడం సరికాదని వాదించాడు. తనకు 1986 చట్టం క్రిందనే ఈ వ్యాజ్యాన్ని విచారించాలని కోరాడు. మొత్తానికి తెలంగాణ హైకోర్టులో కూడా అతడికి చుక్కెదురైంది. సెక్షన్ 125 క్రింద ముస్లిం స్త్రీలు భరణం కోరవచ్చునని హైకోర్టు వెల్లడించింది. అయితే ఫ్యామిలీ కోర్టు నిర్దేశించిన రూ. 20 వేల భరణాన్ని సగానికి అంటే రూ. 10వేలకు తగ్గించింది. హైకోర్టు నిర్ణయం మీద ఆమె భర్త మహమ్మద్ అబ్దుల్ సుప్రీంకోర్టులో (S.L.P (C.R.L) No.1614/2024) అపీల్ చేశారు. తీవ్ర వాదోపవాదాలు జరిగాయి.


సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ గౌరవ్ అగర్వాల్‌ను అమికస్ క్యూరిగా నియమించారు. విడాకులు పొందిన ఆమె భర్త తరపున సీనియర్ అడ్వకేట్స్ ఎస్.వాసిమ్ ఏ ఖాద్రి, ఉదితా సింగ్, తమిమ్ ఖాద్రి, సయీద్ ఖాద్రి, శ్రావణ్ కుమార్ వర్మ, కరీనా ఫరీద్, సాహిత్ గుప్తా, దీపక్ భాటి తదితరులు వాదించారు. ఐదుగురుతో కూడిన ధర్మాసనం గతంలో ఇచ్చిన డేనియల్ లతీఫి వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో ఇచ్చిన తీర్పును సమద్ కేసు తీర్పులో న్యాయమూర్తులు ప్రముఖంగా ప్రస్తావించారు. 2005 వచ్చిన ఆ తీర్పు 1986లో చేసిన చట్టం షాబానో తీర్పు విషయమై కాదని తీర్మానించింది.

తాజా కేసులో న్యాయమూర్తులు వి.వి.నాగరత్న, అగస్టీన్ జార్జి మాషి తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు ప్రకారం సీఆర్‌పీసీ సెక్షన్ 125 పెండ్లి అయిన ప్రతి స్త్రీకి వర్తిస్తుందని తీర్పు చెప్పారు.

ముస్లిం స్త్రీలు, విడాకులు ఇచ్చిన స్త్రీలందరికీ సీఆర్‌పీసీ సెక్షన్ 125 వర్తిస్తుందని, ఆ సెక్షన్ ప్రకారం భరణం కోరవచ్చునని తీర్మానించారు. ముస్లిం స్త్రీలు 1956 చట్టంగాని, సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం గానీ భరణం కోరవచ్చు. 1956 చట్టం, సెక్షన్ 125 CRPC రెండూ పరస్పర విరుద్ధం కావు.

అంతేకాక తలాక్ పద్ధతిలో ముస్లిం స్త్రీలకు విడాకులు ఇచ్చే పద్ధతిని 2019లో బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన సంగతిని కూడా తాజా తీర్పులో ప్రస్తావించారు. ఈ విధంగా మహమ్మద్ సమద్ వ్యాజ్యం ముస్లింల విడాకుల కేసులలో చారిత్రక మైనదిగా నిలిచింది.

ఈ వ్యాజ్యం కూడా ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని మరొకసారి గుర్తు చేసింది. యూసీసీ గోవాలో చాలాకాలంగా అమలులో ఉన్నది. అంతేకాక నేరాలకు సంబంధించిన ఇండియన్ పీనల్ కోడ్ 1860 నుండి పౌరులందరికీ వర్తింపు చేస్తున్నారు. న్యాయస్థానాలు పదే పదే అదే విధమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, తీర్పులు ఇస్తున్నప్పటికీ ఉమ్మడి పౌరస్మృతి రాకను, అవసరాన్ని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డుతో పాటు కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఈ ప్రశ్నకు భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఏనాడో సమాధానం చెప్పారని అనుకోవాలి. ఆయన సుస్పష్టంగా భారతదేశ వనరుల మీద మొదటి హక్కు ముస్లింలదేనని తేల్చేశారు. ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించడానికి కారణం బుజ్జగింపు ధోరణి. బుజ్జగింపుతోనే ఈ దేశాన్ని బ్రిటిష్‌వారు విభజించి, పాలించారు. ఆ విధానాన్నే కాంగ్రెస్ అందిపుచ్చుకున్నది. దీని ఫలితమే సామాన్య ముస్లిం స్త్రీల నరకయాతన. ముస్లింలను ఆ దీనావస్థ నుంచి విముక్తం చేయగలిగే ఏ చట్టాన్ని రూపొందించ డానికైనా, హిందూ ముస్లిం వర్గాల నడుమ ఐక్యత పెంచే ఏ చర్యనైనా కాంగ్రెస్ వ్యతిరేకిస్తూనే ఉంటుంది. కాంగ్రెస్ బుజ్జగింపునకు బలైపోతున్న ముస్లిం స్త్రీలకు కోర్టులు రక్షణగా నిలబడడం హర్షణీయం. అమాయక, పేద ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తున్న వారందరికీ కూడా ఈ తీర్పు ఒక గుణపాఠం. ★



**ఎం. సుదరరామిరెడ్డి**
అడ్వకేట్

# రాష్ట్రాలు

**కేంద్రంతోనో, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోనో విభేదాలు ఉండవచ్చు. కానీ ఆ విభేదాలు వ్యవస్థలకు తూట్లు పొడిచే పరిస్థితిని సృష్టించకూడదు. కేంద్ర ప్రభుత్వానికీ, రాష్ట్రాలకు నడుమ రాజ్యాంగ సంక్షోభాలకు తావివ్వకూడదు. రాష్ట్రాల ముఖ్యమంత్రుల వైఖరి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాల మీద ప్రభావం చూపేదిగా పరిణమించకూడదు. దేశంలో కొన్ని రాష్ట్రాలకు ముఖ్యమంత్రులయిన కొందరు రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశంతో ఆ పదవిని స్వీకరించినవారిలా కాకుండా, సర్వంసహ పాలకులుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. దీనికి సెక్యులరిజం మీద పోరాటంగానో, మత పార్టీలను నిరోధించే క్రమంగానో పేరు పెట్టడం కూడా చిరకాలంగా కనిపిస్తున్నది. ఇప్పుడు ఆ ధోరణి పరాకాష్టకు చేరిందనే అనాలి. విదేశ వ్యవహారాలు, రక్షణ కేంద్రం చేతిలోనే ఉంటాయి. అవి ఉమ్మడి జాబితాలోని అంశాలు కావు. కానీ ఆ సంగతి పూర్తిగా విస్మరించిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఇప్పుడు కనిపిస్తున్నారు. ఒకరు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, రెండవ వారు కేరళ ముఖ్యమంత్రి, సీపీఎం నాయకుడు పినరయ్ విజయన్. ఫెడరల్ వ్యవస్థను కాపాడే బాధ్యత కేంద్రానిది మాత్రమేనన్నట్టు ఉన్నది వీరి ధోరణి. మమత చర్య గురించి పొరుగు దేశం నిరసన ప్రకటించవలసి వచ్చింది.**


మమత

రిజర్వేషన్‌ల వ్యవహారంతో అట్టుడుకుతున్నట్టు ఉడుకుతున్నది బంగ్లాదేశ్. కాల్పులు జరిగాయి. అంతా అల్లకల్లోలం. ఇదంతా చూసిన, పక్కనే ఉన్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హృదయం దారుణంగా ద్రవించి ఒక పిలుపు నిచ్చారు. 'నిస్సహాయులైన ప్రజలు' ఇక్కడికి వస్తే ఆశ్రయం ఇస్తానని ప్రకటించారు. బంగ్లావాసుల కోసం మమతా బెనర్జీ ఇచ్చిన పిలుపు పట్ల ఆ దేశ అధ్యక్షురాలు షేక్ హసీనా ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. ఆ ప్రభుత్వం మమత మొహం వాచేటట్టు చీవాట్లు పెట్టింది. సహాయం కోరుతూ ఎవరు వచ్చి తలుపు తట్టినా వారికి ఆశ్రయం ఇవ్వడానికి తాము సదా సిద్ధంగా ఉంటామని జూలై 21న మమత ఉదారంగా పిలుపు నిచ్చారు. 'బంగ్లాదేశ్‌లో జరిగే వ్యవహారం గురించి నేను ఏమీ మాట్లాడను. ఎందుకంటే అది వేరే దేశం. దాని గురించి భారత ప్రభుత్వం మాట్లాడుతుంది. కానీ బంగ్లా నుంచి ఎవరైనా నిస్సహాయులై మా తలుపు తడితే వారికి ఆశ్రయం ఇచ్చేస్తాం' అన్నారామె. పైగా ఇంకొక దేవ రహస్యం కూడా లోకానికి చెప్పారు. శరణార్థులను ఆదుకోమంటూ ఐక్యరాజ్య సమితి తీర్మానం కూడా ఉందని అపార జ్ఞానాన్ని ప్రదర్శించారు. మృతవీరుల సంస్మరణ దినానికి ఇచ్చిన ఉపన్యాసంలో ఈ చెత్తంతా ఆమె వాగారు. అక్కడితో ఆగలేదు. ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వచ్చినా అభ్యంతరం లేదంటూ తన ఎక్స్‌లో పోస్ట్ కూడా పెట్టారు. బంగ్లా నుంచి విద్యార్థులుఎవరు వచ్చినా వారికి కావలసిన ఏర్పాట్లు చూడవలసిం దంటూ తన రాష్ట్ర అధికారులకు మమత ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇచ్చినట్టు ఎక్స్‌లో కూడా ప్రకటించారు.

ఇటు ఫెడరల్ వ్యవస్థ మర్యాదలూ, అటు అంతర్జాతీయ సంప్రదాయాలూ కూడా ఏ మాత్రం తెలియని మమతా బెనర్జీ వాగుడు పెద్ద వివాదానికే దారి తీసింది. బంగ్లాలోని భారత్ హైకమిషన్ అధికారులను పిలిచి బంగ్లా ప్రభుత్వం నిరసన తెలియచేసింది. బంగ్లాదేశ్ పంపించిన నిరసన లేఖను భారత విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌వీర్ జైస్వాల్ విడుదల చేశారు. మమతా బెనర్జీ ఎక్స్ పోస్ట్ బంగ్లా అంతర్గత వ్యవహారాలలో కలగచేసుకోవడమేనని ఆ దేశ ప్రభుత్వం ఆరోపించింది. అలజడిని నివారించి శాంతిభద్రతలను నెలకొల్పేందుకు బంగ్లా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్న తరుణంలో మమత ఇలాంటి పోస్టు పెట్టడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అవుతుందని కూడా గట్టిగానే చీవాట్లు పెట్టింది. ఇలాంటి ప్రకటనలు ఉగ్రవాదులకీ, సమస్యలు సృష్టించేవాళ్లకి మాత్రమే అక్కరకు వస్తాయని కూడా ఆ ప్రభుత్వం ఘాటుగానే స్పందించింది (వాళ్లయితే టీఎంసీ పార్టీకి బాగా పనికొస్తారు). మమత ఇచ్చిన పిలుపు పెద్ద ఎత్తున గందరగోళం సృష్టిస్తుందని బంగ్లా విదేశ వ్యవహారాల మంత్రి హసన్ మహమ్మద్ వ్యాఖ్యానించారు. మమతాబెనర్జీ పట్ల తమకు గౌరవమున్నదనీ, భారత్‌తో సత్సంబంధాలు కొనసాగుతున్న ఈ తరుణంలో అలాంటి ఆశ్రయం వ్యాఖ్యలు ఇబ్బందులు తెస్తాయన్నదే బంగ్లాదేశ్ అభిప్రాయం.

మమత ఇచ్చిన 'ఆశ్రయం' పిలుపు గురించి, దాని పూర్వాపరాల గురించి నివేదిక సమర్పించ వలసిందిగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆదేశాలు జారీ చేశారు. విదేశీ వ్యవహారాలకు సంబంధించిన ఏ విషయమైనా లావాదేవీలు జరపవలసింది కేంద్రం మాత్రమేనని రాజ్‌భవన్ మీడియా సెల్ తన ట్వీట్‌లో పేర్కొన్నది. పార్లమెంట్ సమావేశాలలో వీరంగం వేస్తున్న టీఎంసీ సభ్యులు



మమత ఇచ్చిన 'ఆశ్రయం' పిలుపు గురించి, దాని పూర్వాపరాల గురించి నివేదిక సమర్పించ వలసిందిగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆదేశాలు జారీ చేశారు. విదేశీ వ్యవహారాలకు సంబంధించిన ఏ విషయమైనా లావాదేవీలు జరపవలసింది కేంద్రం మాత్రమేనని రాజ్‌భవన్ మీడియా సెల్ తన ట్వీట్‌లో పేర్కొన్నది. పార్లమెంట్ సమావేశాలలో వీరంగం వేస్తున్న టీఎంసీ సభ్యులు నేత ఓవరాక్షన్‌కు ఏమంటారో?



పినరయ్



కె.వాసుకి

# వాళ్ల జాగీరులా?

నేత ఓవరాక్షన్‌కు ఏమంటారో?

**కేరళ నిర్వాకం**

విదేశీ సహకారానికి సంబంధించి వ్యవహారాలు చూడడానికి జూలై 15న కేరళ ప్రభుత్వం కె. వాసుకి అనే ఐఏఎస్ అధికారిని నియమించుకుంది. ఆయన కార్మిక, నైపుణ్యం విభాగంలో సీనియర్ అధికారి. వాసుకికి ఈ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అప్పగించింది. ఢిల్లీలోని కేరళ హౌస్ రెసిడెంట్ కమిషనర్ వాసుకుకి సహకారం అందిస్తారు.

ఏ రాష్ట్ర ప్రభుత్వ శాఖ అయినా విదేశాల నుంచి సాయం పొందవలసిన అవసరం వస్తే ఎప్పుడూ విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖను లేదా ఆ దేశంలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రతించవలసి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దేశ విదేశ వ్యవహారాల శాఖతో సంప్రదింపులు కేరళ నియమించిన ఈ అధికారి బాధ్యతగా చెబుతున్నారు. నిజానికి ఆ బాధ్యతను నిర్వర్తించడానికి అధికారులు ఎలాగూ ఉంటారు. కాబట్టి కొత్తగా మరొక అధికారిని ప్రత్యేకంగా నియమించవలసిన అవసరం ఏమిటి అన్నదే ఇప్పుడు అందరూ వేస్తున్న ప్రశ్న. ఆఖరికి కాంగ్రెస్ కూడా ఇది అసాధారణ చర్యగానే అభివర్ణించింది. ఈ వ్యాఖ్య చేసిన వారు ఎవరో కాదు. తిరువనంతపురం ఎంపీ, భారత విదేశ వ్యవహారాల శాఖలో పనిచేసిన ఒకనాటి ఐఎస్ఎఫ్ అధికారి శశిథరూర్. అసలు ఈ నియామకంలోని చట్టబద్ధతను కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు.

రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లోని ఒకటో జాబితాలో యూనియన్ లిస్ట్ 10లోని ఒకటో అంశమే విదేశీ వ్యవహారాలు పూర్తిగా కేంద్రం పరిధిలోనివని ఘోషిస్తున్నదని భారత విదేశ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌వీర్ జైస్వాల్ గుర్తు చేయవలసి వచ్చింది. మమతా బెనర్జీ, పినరయ్ విజయన్ ఇద్దరూ కేంద్ర జాబితాలో చొరబడే ప్రయత్నమే చేశారంటే వాస్తవదూరం కాబోదు. అయితే ఫెడరల్ సంప్రదాయాలను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తుందంటూ పదే పదే ఆరోపణలు గుప్పించే విపక్ష శిబిరంలోని నాయకులలో ఈ ఇద్దరిదీ అగ్రతాంబూలమే మళ్లీ. సందేశ్‌ఖాలి, అంతకు ముందు ఉపాధ్యాయ నియామకాలు, ఎన్నికల హింస మీద దర్యాప్తు వేటి గురించి చర్యలు ప్రారంభించినా మమతా బెనర్జీకి వెంటనే ఫెడరల్ వ్యవస్థ నాశనమైపోతున్న దృశ్యం కనిపించేది. కేరళ ముఖ్యమంత్రి కార్యాలయానికీ, బంగారం అక్రమ రవాణాకీ సంబంధం ఉందని నిఘా సంస్థలు అనుమానించగానే సీపీఎంకీ, ముఖ్యమంత్రి పినరయ్‌కి ఫెడరల్ వ్యవస్థ మీద దాడి దృశ్యాలు కనిపిస్తూ ఉంటాయి. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నదీ అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగబద్ధంగా కేంద్రం, రాష్ట్రాలు పనిచేస్తున్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న. మమత, పినరయ్ ఇద్దరు రాజ్యాంగ విరుద్ధమైన చర్యకే పాల్పడ్డారు. పినరయ్ కేరళను వేరే దేశంగా చూడాలని అనుకుంటున్నారు కాబోలునన్న విమర్శ కూడా వినిపించింది. వేర్పాటువాద ధోరణి ప్రబలంగా ఉన్న ఆ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇలాంటి పోకడలకు పోవడమే దురదృష్టం.

విదేశీ వ్యవహారాల కార్యదర్శి నియామకం రాష్ట్ర అభివృద్ధి కోసమేనని కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి. వేణు సమర్థించుకోవడం మరొక అంశం. అక్కడి ఉద్యోగులు కూడా సీపీఎం భాషనే మాట్లాడుతూ ఉండడం విశేషం. అంత ప్రాధాన్యం లేని ఈ విషయం కంటే చర్చించవలసిన విషయాలు చాలా ఉన్నాయని కొందరు అధికారులు ఈ నియామకం నేపథ్యంలో అభిప్రాయపడడం మరొక అంశం. విదేశీ వ్యవహారాలు కేంద్ర జాబితాలోనివే రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారికి, ప్రభుత్వోద్యోగులకి కూడా తెలియకపోలేదని కూడా ముక్తాయించడం మరొక విషయం. దౌత్య విషయాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయనీ, వాటిలో జోక్యం చేసుకోవడానికీ, కేరళ నుంచి విదేశీ వ్యవహారాల కార్యదర్శిని నియమించడానికీ ఎలాంటి సంబంధం లేదని వాటిని కేంద్రమే నిర్వహిస్తుందని కూడా ప్రధాన కార్యదర్శి కాస్త గడసరితనంతోనే చెప్పారు.


ఇలా నేరుగా విదేశాలతో సంప్రతింపులు జరుపుదామనుకునే రాష్ట్రాలకు గతంలోనే శృంగభంగమైన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ నుంచి పెగాసస్ నుంచి సాంకేతిక పరిజ్ఞానం తీసుకునే విషయంలోనే ఇది జరిగింది. ఒక రాష్ట్రం నేరుగా ఇజ్రాయెల్ సంస్థతో సంప్రతిస్తే, ఆ ప్రతిపాదన భారత కేంద్ర ప్రభుత్వం నుంచి రావాలని స్పందన వచ్చింది. విదేశాలతో అధికారికంగా సంప్రతించడం అంటే, హార్వార్డ్‌కో, మరొక పాశ్చాత్య దేశాలలోని విశ్వ విద్యాలయానికో వెళ్లి ఉపన్యాసం ఇవ్వడమంత సులభం కాదు.లేదా పాకిస్తాన్‌కు వెళ్లినప్పుడు అక్కడ భారత్ పెద్దన్నలా వ్యవహరిస్తున్నదని నిందలు వేసి రావడమంత తేలిక కాదు. అసలు ఏ దేశంలో అయినా ఫెడరల్ ప్రభుత్వం అనుమతి లేకుండా విదేశీ వ్యవహారాలు నడపడం సాధ్యమవుతుందా? దౌత్యం విషయం కాకుండా వాణిజ్యం వంటి ఇతర అంశాలకే తమ కార్యదర్శి పరిమితమవుతారని కేరళ అధికారులు వివరణ ఇస్తున్నా అందులో వాస్తవికత లేదు. ఇప్పుడు అన్నీ దౌత్యం పరిధిలోనే ఉంటున్నాయి. మరింతగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసమే అన్న సాకు చూపుతూ కేంద్రం అధికారాలలోకి రాష్ట్రాలు ప్రవేశించాలనుకోవడం సరికాదు.

– జాగృతి డెస్క్

# మతస్వేచ్ఛ
# నిర్బంధ మ



**మతమార్పిడులు మెజారిటీ జనాభాపై ప్రభావాన్ని చూపుతాయంటూ ఇటీవల అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కైలాష్ అనే వ్యక్తి ఉత్తర ప్రదేశ్‌లోని హామిర్‌పూర్ నుంచి కొంతమందిని క్రైస్తవంలోకి మతమార్పిడి చేయడానికి తరలించాడన్న అభియోగంపై హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ ఈ కేసును విచారించారు. ఉత్తరప్రదేశ్ చట్టవ్యతిరేక మతమార్పిడుల నిరోధక చట్టం-2021 కింద అరెస్టయిన కైలాష్, బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. అతనికి బెయిల్ నిరాకరించడమేకాదు.. మత ప్రచారంపై రాజ్యాంగ పరిధిని వివరిస్తూ, మతమార్పిడులను తక్షణం అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.**



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

రాజ్యాంగంలోని 25వ అధికరణం మత ప్రచారానికి అనుమతిస్తున్నదే కానీ, మత మార్పిడులకు కాదని స్పష్టం చేశారు. ప్రచారం చేయడమంటే వ్యక్తులను ఒక మతం నుంచి మరో మతంలోకి మార్చడం కాదని, మతమార్పిడులను అరికట్టకపోతే మెజారిటీ జనాభా ఒకనాటికి మైనారిటీలుగా మారిపోతారని, కనుక దీన్ని నిరోధించాల్సిన అవసరం ఉన్నదనే అంశాన్ని మరోమారు వెలుగులోకి తెచ్చారు. చట్టవిరుద్ధ మతమార్పిడులు ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ/ఎసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో అధికంగా ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్నాయంటూ మతపరమైన సమావేశాలను తక్షణమే నిలిపి వేయాలని కోరారు.

**ప్రాథమిక హక్కులకు భంగం?**

బలవంతపు మతమార్పిడులు ప్రాథమిక హక్కులకు భంగకరమని దేశంలో వివిధ కోర్టులు గతంలో తీర్పులు చెప్పాయి. ఒక వ్యక్తి తన ఇష్టానికి అనుగుణంగా మతం మారవచ్చునని సుప్రీంకోర్టు చాలా కేసుల్లో పేర్కొంటూనే బలవంతపు లేదా ప్రలోభాలతో మతమార్పిడులు చేపట్టడం రాజ్యాంగం పేర్కొంటున్న మతస్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని స్పష్టం చేసింది. రెవరెండ్ స్టైనిస్‌లాస్ వర్సెస్ మధ్య ప్రదేశ్ కేసులో స్వేచ్ఛగా మతప్రచారం చేసుకోవడమంటే బలవంతంగా మత మార్పిడులకు పాల్పడటం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇదిలావుండగా వయోజనులు కుల మతాలకతీతంగా వివాహం చేసుకోవచ్చునని సుప్రీకోర్టు తీర్పు చెబుతూనే వివాహ సమయంలో మతం మార్చుకున్నా, కేవలం చట్టపరమైన నిబంధనలను తప్పించుకునేందుకు మతమార్పిడి ద్వారా వివాహం చేసుకోకూడదని హెచ్చరించింది కూడా.

**మతమార్పిడులకు కారణాలు**

ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక ప్రయాణంలో తన వ్యక్తిగత సానుకూలతకు, అభివృద్ధికోసం అప్పటి వరకు విశ్వసించిన వాటిల్లో మార్పులు చేసుకోవడం కోసం మతం మారడం సహజంగా జరుగుతుంది. అలాగే జీవిత భాగస్వామి మతం వేరయినప్పుడు, కుటుంబంలో సామరస్యతకోసం లేదా తన భాగస్వామి పట్ల నిబద్ధత కోసం కూడా మతం మారిన సంఘటనలున్నాయి. కొన్ని సామాజిక వర్గాలు కొన్ని సామాజిక ఒత్తిడుల నేపథ్యంలో ఒక ప్రత్యేక మతాన్ని తప్పనిసరిగా అవలంబించాల్సి రావడం కూడా ఒక కారణం. తాను అనుసరిస్తున్న మతంలో వివక్ష, వేధింపుల నుంచి బయటపడేందుకు, మతం మారడం సహజంగా జరుగుతుంటుంది. ఒక మతంలో కేవలం ఆ మతం వారికే వర్తించే ఆర్థికపరమైన అవకాశాల పట్ల ఆకర్షితులైన ఇతర మతంలోని కొందరు మతం మారుతుం టారు. కొన్ని సందర్భాల్లో ప్రలోభపెట్టడం లేదా బలవంతపు మతమార్పిడులు జరుగుతుంటాయి.

**స్వాతంత్ర్యానికి పూర్వం**

స్వాతంత్ర్యానికి పూర్వం రాయ్‌గఢ్, బికనీర్, కోటా, జోధ్‌పూర్, పాట్నా, ఉదయ్‌పూర్, కలహండి, సుర్గుజా సంస్థానాల్లో మతమార్పిడుల నిరోధక చట్టాలు అమల్లో ఉండేవి. ముఖ్యంగా మిషనరీ కార్యకలాపాలను అడ్డుకునేందుకు అప్పట్లో హిందూ పాలకుల సంస్థానాల్లో ఈ చట్టాలను అమలుచేశారు.

**కేంద్రంలో ప్రత్యేక చట్టంలేదు**

1954, 1960 సంవత్సరాల్లో పార్లమెంట్‌లో 'ఇండియన్ కన్వర్షన్ (రెగ్యులేషన్ అండ్ రిజిస్ట్రేషన్) బిల్లు, 'వెనుకబడిన వర్గాల (మత రక్షణ) బిల్లులను అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈరెండు బిల్లులకు సభ్యుల మద్దతు లభించకపోవడంతో ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం మతాంతరీకరణకు సంబంధించి ఏ విధమైన ప్రత్యేక చట్టాన్ని రూపొందించలేదు. అయితే కేంద్రం ఈ చట్టాలను అమల్లోకి తేవడంలో విఫలం కావడంతో క్రమంగా రాష్ట్రాలు ఈ చట్టాలను అమల్లోకి తేవడం మొదలైంది. ఆ విధంగా మొదటిసారి 1967 బిహార్ రాష్ట్రం అమల్లోకి తెచ్చింది. 1968లో మధ్యప్రదేశ్ దీన్ని అమల్లోకి తెచ్చిన రెండవ రాష్ట్రం. తర్వాత అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, కర్ణాటక రాష్ట్రాలు ఇదే బాట పట్టాయి. అలా ప్రస్తుతం దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో మతమార్పిడుల నిరోధక చట్టాలు అమల్లో ఉన్నాయి. ఇటీవల గుజరాత్ ప్రభుత్వం రాష్ట్రంలో మతమార్పిడులకు సంబంధించి బౌద్ధం, హైందవాలను వేర్వేరు మతాలుగా పరిగణించాలని స్పష్టం చేయడం గమనించాల్సిన పరిణామం. అయితే అనుబంధ నిబంధనల రూపకల్పన జరగకపోవడంతో అరుణాచల్ ప్రదేశ్‌లో ఇంకా అమలు పరచలేదు. రాజస్థాన్ అసెంబ్లీ మతమార్పిడుల బిల్లును అమోదించినప్పటికీ రాష్ట్రపతి ఆమోదం పొందాల్సివుంది. మణిపూర్ వంటి రాష్ట్రాలు ఈ చట్టాలను అమల్లోకి తీసుకురావాలని యోచిస్తున్నాయి. బలవంతపు మతమార్పిడుల నిరోధక చట్టాన్ని తమిళనాడు ప్రభుత్వం 2002లో అమల్లోకి తెచ్చినా, 2004లో మైనారిటీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, ఎన్నికల నేపథ్యంలో నాటి జయలలిత ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దుచేసింది.

**ఎందుకు మతమార్పిడుల వ్యతిరేక చట్టాలు?**

కొన్ని మతాల సంప్రదాయ విశ్వాసాలను పరిరక్షించేందుకు, ముఖ్యంగా మతమార్పిడుల కారణంగా జరిగే సంఘర్షణలను నివారించేందుకు, సామాజిక సంఘర్షణలను నివారించేందుకు, అంటే మతమార్పిడుల కారణంగా ఒకే మతంలో చోటు చేసుకునే సంఘర్షణల నివారణకు ఈ మతమార్పిడుల చట్టాల అవసరం ఏర్పడింది. అంతేకాదు మోసపూరిత వివాహాలను నివారించేందుకు. కొన్ని సందర్భాల్లో కొందరు వ్యక్తులు వివాహానికి ముందు తమ మతాన్ని వెల్లడి చేయకుండా గోప్యంగా ఉంచి,



## అంటే ...తమార్పిడి కాదు

తీరా వివాహమయ్యాక తమ భాగస్వామిని బల వంతంగా మత మార్పిడులకు గురిచేసిన సంఘటనల నేపథ్యం కూడా ఈ చట్టాల రూపకల్పనకు ప్రధాన కారణం. కొన్ని సందర్భాల్లో సుప్రీంకోర్టు బలవంతపు మతమార్పిడుల సంఘటనలను గుర్తించింది కూడా. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడమే కాకుండా, తన స్వీయ మతాన్ని అనుసరించే స్వేచ్ఛను హరిస్తున్న ఫలితంగా సమాజంలో సెక్యులర్ స్థాయి దెబ్బ తింటోందని కోర్టు ఒకదశలో స్పష్టం చేసింది.

**రాజ్యాంగానికి వ్యతిరేకం**

ఇదిలావుండగా మతమార్పిడి వ్యతిరేక చట్టాలు రాజ్యాంగంలోని 25, 26,27,28 అధికరణాలను ఉల్లంఘించేవిగా ఉన్నాయన్న వాదనలున్నాయి. ముఖ్యంగా అధికరణం-25 (మతాన్ని అనుసరించే, ప్రచారం చేసుకునే స్వేచ్ఛ), అధికరణం-26 (మతవ్యవహారాలను నిర్వహించుకునే హక్కు), అధికరణం- 27(ఒక ప్రత్యేక మతాన్ని ప్రోత్స హించేందుకు వీలుగా పన్నులు చెల్లింపు), అధికరణం-28 (కొన్ని ప్రత్యేక విద్యాసంస్థల్లో మతపరమైన ప్రార్థనలు జరుపుకోవచ్చు. అయితే ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇది వర్తించదు). అంతేకాదు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు (అధికరణం-21), సమానత్వపు హక్కు (అధికరణం -14) ను కూడా ఈ చట్టాలు ఉల్లంఘించేవిగా ఉన్నాయని వాదించేవారున్నారు. యు.ఎస్. కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ ఫోరం (యుఎస్‌సీఆర్ఐఎఫ్) ఈ చట్టాలు అందరికీ సమానంగా వర్తించేవిగా లేవని పేర్కొన్నది. ముఖ్యంగా కొన్ని మైనారిటీ మతాల వారి విషయంలో ఇవి దుర్వినియోగమయ్యే అవకాశ ముందన్న ఆరోపణలున్నాయి. ఈ చట్టాల్లోని పద జాలం అస్పష్టంగా ఉన్నదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి. నూటికి 99 పాళ్లు హిందూ మతం నుంచే మార్పిడులు జరుగుతుండడం గమనార్హం ఎప్పుడో, ఎక్కడో ఆడపా దడపా జరిగిన సంఘట నలను భూతద్దంలో చూపడం ద్వారా మైనారిటీలకు అన్యాయం జరుగుతున్నదని గగ్గోలు పెట్టడం తప్ప మరోటి కాదు.

**విదేశాల్లో అమల్లో ఉన్న చట్టాలు**

అల్జీరియా, మయన్మార్, భూటాన్, నేపాల్ దేశాల్లో మతమార్పిడుల నిరోధక చట్టాలు అమల్లో ఉన్నాయి. శ్రీలంకలో బౌద్ధుల జాతీయవాద పార్టీ 'జాతికా హెలా ఉరుమయ' 2004లో బలవంతపు మతమార్పిడులకు వ్యతిరేకంగా ఒక బిల్లును ప్రవేశ పెట్టింది. అయితే ఈ బిల్లును వ్యతిరేకిస్తూ క్రైస్తవ మిషనరీలు, పౌరహక్కుల సంఘాలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో, ఈ బిల్లు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేదిగా ఉన్నదంటూ తీర్పుచెప్పింది. దీంతో బిల్లులో మార్పులు చేసి 2009లో మళ్లీ ప్రవేశపెట్టగా మెజారిటీ సభ్యులు తిరస్కరించారు. 2020లో అధ్యక్షుడు మహింద రాజపక్ష మరిన్ని మార్పులతో మళ్లీ ఈ బిల్లును ప్రవేశపెడతామని ప్రకటించినా, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. 2021లో పాకిస్తాన్‌లో బలవంతపు మత మార్పిడుల నిరోధక బిల్లును ప్రవేశపెట్టాలని యత్నించినా, మత వ్యవహారాల మంత్రిత్వశాఖ దీన్ని తిరస్కరించడంలో అది మూలనపడింది.

**ఐక్యరాజ్య సమితి చట్టం**

'ఐక్యరాజ్య సమితి సార్వజనీక మానవహక్కుల ప్రకటన' మతం మారడం మానవుల హక్కుగా స్పష్టం చేసింది. అయితే స్వచ్ఛందంగా తన మతాన్ని వదులుకొని, మరో మతాన్ని స్వీకరించడంలో తప్పులేదు కానీ ప్రలోభాలతో, బలవంతపు మత మార్పిడులు జరపడాన్ని ఈ చట్టం సమర్థించబోదన్న సత్యాన్ని గుర్తించాలి. అయితే ఐక్యరాజ్య సమితి ప్రకటనను ఖాతరు చేయని కొన్ని విదేశీ గ్రూపులు మతం మార్పిడులను అడ్డుకుంటున్నాయి. ముఖ్యంగా కొన్ని దేశాలు స్వచ్ఛందంగా మతం మారడానికి, ఇతర మతాన్ని అలవాటు చేయడానికి మధ్య తేడాను స్పష్టంగా పేర్కొనడమే కాకుండా ఈ 'అలవాటు' ప్రక్రియను నిరోధిం చేందుకు యత్నిస్తున్నాయి. యుఎస్ఎస్ఆర్ పతనం తర్వాత రష్యా ఆర్థోడాక్స్ చర్చి తిరిగి పుంజుకుంది.

రోమన్ క్యాథలిక్ చర్చ్, సాల్వేషన్ ఆర్మీ, జెహోవాల్ విట్‌నెసెస్ వంటి సంస్థల మతమార్పిడి కార్యకలాపాలను వ్యతిరేకిస్తు న్నది. మనదేశం విషయానికి వస్తే మతమార్పిడులు వివాదాస్పదంగానే పరిగణి స్తున్నాయి. ముఖ్యంగా వివిధ రాజకీయ పార్టీలు మైనారిటీల ఓట్లకోసం చేసే బుజ్జగింపు రాజకీయాల నేపథ్యంలో మెజారిటీ మతస్థుల్లో అభద్రతాభావం పెరిగి జాతీయవాదం పెరగడానికి దోహదం చేసింది. ఇది మనదేశానికే పరిమితం కాదు. ఇప్పుడు యూరప్ దేశాల్లో కూడా జాతీయవాదం పెరుగుతున్నట్లు ఇటీవలి ఎన్నికల ఫలితాలు నిరూపిస్తున్నాయి. ప్రజాస్వామ్య దేశాల్లో ముఖ్యంగా మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు పెరిగిపోవడం, ఓట్ల కోసం రాయితీలు విచ్చలవిడిగా ఇవ్వడం ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడం, మిగిలిన మెజారిటీ మతవర్గాల్లో తమ సామాజిక, సాంస్కృతిక భద్రతపై అనుమానాలు పెరిగేలా చేయడమే ఇందుకు కారణం.

1873లో మాక్స్ ముల్లర్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, 'ఈ ప్రపంచం రెండు గ్రూపులుగా విడిపోయింది. ఒకటి కొత్త అనుయాయులను చేర్చుకోవడానికి చురుగ్గా పనిచేసేది కాగా రెండవది అందుకు ఉత్సాహం చూపనిది. మొదటి గ్రూపు కిందికి బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం వస్తే; రెండో గ్రూపు కిందికి హిందూయిజం, జుడాయిజం, జొరాష్ట్రియ నిజం వస్తాయి. స్తబ్దుగా ఉన్న గ్రూపునుంచి అనుయాయులను ఆకర్షించాలని చురుగ్గా ఉండే గ్రూపులు యత్నించడం సహజం'అన్నారు. ప్రస్తుతం జరుగుతున్నదిదే! ★

కథ

నిశ్చేష్టురాలైపోయింది భవాని.

"కాదులే, అది కాకపోవచ్చు. ఇవన్నీ వయసుతో మామూలే" ఎందరో ఓదార్పుగా చెప్తూనే ఉన్నారు.

తను కూడా అలాగే అనుకుంది.

తన గదిలోకి వెళ్లి తలుపులు దగ్గరకు వేసి వాలు కుర్చీలో వాలింది.

వెనకే' అమ్మా అంటూ వచ్చింది లావణ్య.

"నేనేం దిగాలుపడి బెంగపడిపోవడం లేదు లవీ! నన్ను కాస్సేపు ఇలా ఒంటరిగా ఉండనీ" నిర్మొహ మాటంగా చెప్పింది కూతురికి.

"కాఫీ పంపుతాను" అని తలుపు చేరవేసి వెళ్లింది లావణ్య.

కొన్ని కొన్ని సమయాల్లో ఇలా కొంత ఏకాంతం ఎవరికి వారికి చాలా అవసరం.

అలాగని భవానికి దుఃఖం పొంగుకు రాలేదు.

"నాకే ఈ రోజు రావాలా?" అని వాపోలేదు.

కొత్త కొత్తగా యవ్వనం తొంగి చూసిన రోజులు గుర్తుకు వచ్చాయి.

ఎవరైనా కొంత పరిశీలనగా చూస్తున్నారంటే ఎంత సిగ్గనిపించేదని అది గమనించే కాబోలు అమ్మ అర్జెంట్‌గా రెండు ఓణీలు కొనితెచ్చింది. అప్పటి దాకా వేసుకున్న పొడుగు జాకెట్లనే సగానికి కత్తిరించి అనువుగా మార్చింది. మల్లు గుడ్డ కొనుక్కు వచ్చి లోపలి బాడీలు కుట్టి పెట్టింది.

ఇప్పటిలా లక్షలు ఖర్చుపెట్టి చేసుకునే ఆడంబరపు ఓణీల ఫంక్షన్లు లేవు. ఓ శుక్రవారం పొద్దున్నే కొత్త ఓణీ కొంగు చివర పసుపు అద్ది వేసుకోమని ఇచ్చింది అమ్మ. ఎంత సంబరంగా అనిపించిందనీ ...

చిన్నప్పటి నుండీ అమ్మ చీరలు కట్టుకుని, అక్క ఓణీలు వేసుకునీ ఎన్ని నాటకాలు వెయ్యలేదు.

'నిజానికి ఓణీలు వేసుకున్నాకే ఆడపిల్లల్లా అనిపిస్తారు' అని కూడా అనుకునేది.

కొత్త ఓణీ వేసుకుని బయటకు వెళితే అపురూప సంపదలను భద్రంగా దాచుకున్న అనుభూతి కలిగింది.

వయసు పెరిగే కొద్దీ కొంత పరిపూర్ణత శరీరానికే కాదు మనసుకూ అబ్బింది. కొంగు జారిపోకుండా జాగ్రత్త పడటం ఒద్దికగా మసులు కోవడం మరో స్వభావంగా మారిపోయింది.

చదువు మధ్యలో ఆపేసి అతనికి ఇల్లాలిగా వెళ్లినప్పుడు, మనసా వాచా మనశ్శరీరాలు అర్పించు కున్నప్పుడు ఆ యవ్వన సంపద పులకింత మైమరపు తక్కువేమీ కాదు.

సమయం చిక్కితేచాలు లాలింపుగానో తమకంగానో సుకుమారంగా పలకరించే అతని చేతులు జీవితాంతం రక్షణ అనుకుంది.

ముగ్గురు బిడ్డలకు తల్లిగా మారినా ఆ సౌకుమార్యం ఎక్కడా తప్పిపోలేదు.

తొలిసారి బిడ్డకు పాలిచ్చిన క్షణం ఎంత తాదాత్మ్యత. సార్థకత సమకూరినట్టు అనిపించింది. ఎన్నేళ్లు పిల్లలను గుండెలకు హత్తుకుని లాలించేది. ఎన్ని సార్లో నిద్రపోతూ కూడా పసిబిడ్డలను గుండెల మీదే పడుకోబెట్టుకునేది.

ఎంతో పరిపక్వతను కష్టపడి తెచ్చుకుంటే నడి వయసులో భర్త సెలవంటూ వెళ్లిపోయినా, చేతి కర్రలా ఊతమవుతాడనుకున్న కొడుకు తాగి బండి నడిపి తనువు చాలించినా, పెద్ద కూతురు అజావజా లేకుండా ఎవరితోనో లేచిపోయినా భవాని కుంగి పోలేదు. తనదైన ప్రపంచాన్ని రంగుల ప్రపంచాన్ని సృజించుకుని రాత్రీపగలూ తనలోకంలో తను వసంతమై విహరించేది.



ఎన్నో జాతీయ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనల్లో బహుమతులు, గొప్ప గుర్తింపు ఎంతో వినయంగా తలవంచి స్వీకరించేది.

చివరికి ఎనభైలోకి రాగానే తనకు తాను నచ్చ జెప్పుకుని చిన్న కూతురితో రాజీ పడి లావణ్య ఇంటికి

మకాం మార్చుకుంది. పెరిగిన మనవరాళ్లు, బిజినెస్‌తో బిజీగా ఉండే కూతురు అల్లుడు, విశాల మైన ఆ భవనంలో ఆమెకో రెండు గదులు. వంట మనిషి, పనివాళ్లు, డ్రైవర్... సుఖమయ జీవనమే. కొంత పనిభారం, బయటకు వెళ్లడం తగ్గించుకుని ఇంటికి పరిమితమైంది.

ప్రశాంతంగా రోజులు గడిపేస్తున్న ఈ సమయంలో రొటీన్ చెకప్‌లో బయటపడిన ఈ కఠోర సత్యం ఆవిడను ఒక్కసారి అంతర్లీనంగా కుదిపేసింది.

"మెడికల్ ప్రపంచం ఇంత అడ్వాన్స్ అయిన ఈ రోజుల్లో ఇదేం ఆందోళన పడవలసిన విషయం కాదు తల్లీ. చూద్దాం..ట్రీట్‌మెంట్ కోర్స్ ఎలా చెయ్యాలో ప్లాన్ చేద్దాం. ముందు మీరు ఈ రోజు ఇంటికి వెళ్లి రెస్ట్ తీసుకుని ఉదయం కల్లా వచ్చెయ్యండి" డాక్టర్ గారి హామీ.

"అమ్మా ఆలస్యమైపోతోంది వచ్చి లంచ్ చెయ్యి" లావణ్య పిలుపు.

ఎవరి పనుల్లో వాళ్లు తీరిక దొరికినప్పుడు లంచ్ చెయ్యడం అలవాటే.

ఇంట్లోనే ఉండే భవాని ఒకటిన్నర రెండు కల్లా భోజనం చెయ్యడం పరిపాటే.

"వస్తున్నా?" '

లేచి మొహం కడుక్కుని లంచ్‌కి వెళ్లింది భవాని. రొటీన్‌కి భిన్నంగా లావణ్య ఆమె కోసం ఎదురు చూస్తోంది.

"ఎందుకమ్మా నువ్వు తినెయ్యకపోయావా?" మామూలుగా మాట్లాడిన తల్లిని చూసి ఊపిరిపీల్చుకుంది లావణ్య.

"సాయంత్రం ఒకసారి నిర్మల దగ్గరకు వెళ్తాను లవీ, చాలా రోజుల నుంచి పలకరించాలని అనుకుంటున్నాను"

భోజనం ముగించి చెయ్యి కడుక్కుంటూ అంది భవాని.

"అలాగే అమ్మా, డ్రైవర్ని పిలుస్తాను"

* * *

లంచ్ తరువాత నిద్రపోయినా, పోకపోయినా ఓ గంట మంచం మీద వాలడం అలవాటు భవానీకి. పొద్దుటి నుంచి శారీరికంగా, మానసికంగా అలసిపోయిందేమో వెంటనే నిద్రపట్టేసింది. అయిదింటికి లావణ్య వచ్చి లేపితే కాని మెలుకువ రాలేదు.

"డ్రైవర్ వచ్చాడు అమ్మా" అంటే క్షణం ఏమీ అర్థం కాలేదు. నెమ్మదిగా గుర్తు వచ్చింది. నిర్మల దగ్గరకు వెళ్తానని చెప్పడం. "అబ్బా ఇప్పుడేం వెళ్దాం?" అనిపించినా బలవంతాన లేచి రెడీ అయింది.

నిర్మల తనూ ముప్పై ఏళ్ల పాటు ఒకే ఆఫీస్ లో కలిసి పనిచేశారు. ఇద్దరూ ఇంచుమించు ఒకేసారి రిటైర్ అయ్యారు.

అడపాదడపా కలుసుకుని కబుర్లు కలబోసుకోడం అలవాటే.

కొంచం మనసు తేలిక పడుతుందని బయలు దేరింది.

''చాలారోజులకు'' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది నిర్మల. కాఫీ తాగుతూ పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు.

నవ్వుతూ నవ్వుతూనే అసలు విషయం చెప్పింది భవాని.

"అన్ని టెస్ట్‌లూ అన్ని ఇన్వెస్టిగేషన్‌లూ అయ్యాయి. బ్రెస్ట్ కాన్సర్ అని నిర్ధారించారు. "

"అయ్యో"

"అయ్యో అని ఏం లాభం అది మనచేతిలో ఉన్నది కాదుగా"

"అయినా ఇవ్వాళా రేపూ మంచి మెడిసిన్స్, ట్రీట్ మెంట్ అందుబాటులో ఉన్నాయి."

"అవును డాక్టర్ గారు చెప్పారు. రేపటి నుండి ట్రీట్‌మెంట్ మొదలు. అందుకే ఒకసారి చూసి వెళ్దామని. కీమో థెరపీ వల్ల జుట్టు రాలిపోతుందన్నదే కాస్త బెంగగా ఉంది. అయినా మళ్లీ ఆర్నెల్లలో వచ్చేస్తుందని అన్నారులే" తేలిగ్గా నవ్వుతూ,

"అన్నట్టు శాంత ఎలావుంది?" అని అడిగింది భవాని.

# రుగ్మత

స్వాతి



శాంత అదే కాలనీలో ఉంటుంది. ఆవిడ కూడా భవానీ, నిర్మలతో పాటే పనిచేసింది. కాదంటే కొంచం పై పోస్ట్‌లో. ఈ మధ్యనే ఆవిడ భర్తపోయాడు. అప్పట్లో ఒకసారివెళ్లి పలకరించి వచ్చారు కూడా.

" ఎలా ఉందని చెప్పను? ఇదే కాలనీలోముప్పై ఏళ్లుగా ఉంటున్నామా? కనీసం రెండు రోజులు ఆ భార్యాభర్తా సవ్యంగా గడిపింది లేదు. చండికలా మొగుణ్ణి చీల్చి చెండాడేది.

చివరకు మంచం మీదున్న వాణ్ణి కూడా కాల్చుకుతింది.

ఇప్పుడేమో ఒకటే శోకాలు. 'ఆయనెందుకు పోవాలి భగవంతుడు నన్నైనా తీసుకు పోలేదంటూ...' మరో రెండు నెలల్లో సంవత్సరీకాలు వస్తున్నా ఎవరైనా కనబడితే చాలు శోకాలు."

"ఎలా ఉన్నావు శాంతా?" "ఎలా ఉంటాను? ఏం ఉంటాను? అప్పటి శాంత ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడున్నది ఒక జీవచ్ఛవం, అంతే" అంటూ వలవలా ఏడుపు మొదలుపెట్టింది.
"ముందు కళ్లు తుడుచుకో శాంతా, జీవితంలో విషాదాలు మామూలే కదా ఎవరికి లేవు? మేమెన్ని బాధలు పడలేదు?" పైకి ఓదార్పుగా మాట్లాడినా అతను బెడ్ మీద ఉన్నప్పుడు ఆవిడ తిట్టడం – "నువ్వు పోయినా నాకు పీడా పోతుంది ఈ సేవలు చెయ్యలేక చస్తున్నాను" అని విసుక్కోడం ఇద్దరికీ తెలిసినదే.



"ఒకసారి పలకరించి వద్దామా?" కుతూహలంగా అడిగింది భవాని.

"నీకు భరించే ఓపిక ఉంటే అలాగే వెళ్దాం."

ఇద్దరూ నాలుగిళ్ల అవతల ఉన్న శాంత ఇంటికి బయల్దేరారు.

తలుపులు చేరవేసి ఉన్నాయి. లోపల నుండి మైక్ పెట్టినట్టి టీవీ డైలాగ్ లు వినబడుతున్నాయి. బహుశా ఏదో సీరియల్ కావచ్చు.

"శాంతా... శాంతా" రెండు మూడుసార్లు పిలిచి ఇహ లాభంలేక డోర్ బెల్ కొట్టారు.

కొంచం మొహం చిట్లించుకుని నింపాదిగా లేచి "తలుపు తీసే ఉంది" అంటూ బార్లా తెరిచి ఇద్దరినీ చూసి

"రండి" అంటూ ఆహ్వానించింది.

లోపలికి వెళ్తూనే టీవీ ఆఫ్ చేసి సోఫాలో వాలింది.

"ఎలా ఉన్నావు శాంతా?"

"ఎలా ఉంటాను? ఏం ఉంటాను? అప్పటి శాంత ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడున్నది ఒక జీవచ్ఛవం, అంతే"

అంటూ వలవలా ఏడుపు మొదలుపెట్టింది.

"ముందు కళ్లు తుడుచుకో శాంతా, జీవితంలో విషాదాలు మామూలే కదా ఎవరికి లేవు? మేమెన్ని బాధలు పడలేదు?" పైకి ఓదార్పుగా మాట్లాడినా అతను బెడ్ మీద ఉన్నప్పుడు ఆవిడ తిట్టడం – "నువ్వు పోయినా నాకు పీడా పోతుంది ఈ సేవలు చెయ్యలేక చస్తున్నాను" అని విసుక్కోడం ఇద్దరికీ తెలిసినదే.

"నా దేవుడు వెళ్లిపోయి నాకెంత అన్యాయం చేసాడు? ఎందుకు నాకీ బతుకు?" రాగాలు తీస్తూనే ఉంది.

ఇద్దరూ కాస్సేపు కూచుని లేచారు వెళ్లడానికి.

ఈ లోగా పనిమనిషి జ్యూస్ పట్టుకు వచ్చింది.

"ఇలా అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. నేనే ముందు పోతాననుకున్నాను మహరాజు ముందే వెళ్లిపోయాడు"

అక్కడ ఉన్నంత సేపూ తన దుఃఖాన్ని వెయ్యింతలు చేసి చూపటం తప్ప మరో మాట మాట్లాడలేదు.

"చూశావుగా భవానీ దానికి పిచ్చిపట్టినట్టుంది. అది నిజంగా బాధపడు తోందో.. లేదూ నాటాకాలాడుతోందో తెలీడం లేదు."

"పాపం"

"జాలిపడుతున్నావా?"

"అవును నిర్మలా, జాలిపడుతున్నాను. శాంత ఒకరకమైన ఆత్మన్యూనతలో ఉంది. అవును. ఎవరూ తనపట్ల ఏ శ్రద్ధా చూపడం లేదని... నిజానికి భర్త ఉన్ననాళ్లూ తన ఆత్మన్యూనతతో ఆయనను కించపరచి తనే గొప్ప అన్నట్టుగా ఫీలయిపోయేది. ఇప్పుడు జనాల సానుభూతి కోసం ఇలా. సరే నిర్మలా వస్తాను మరి"

"ధైర్యంగా ఉండు భవానీ" ధైర్యం ఇవ్వబోయింది నిర్మల.

"దేనికి నిర్మలా, మనిషన్నాకా ఏదో ఒక జబ్బు చెయ్యడం మామూలే. మన స్థాయిలో మనం దాన్ని ఎదుర్కోవాలని చూస్తాం. ఏమవుతుందనేది దైవ నిర్ణయం.

అయినా నిర్మలా నేను అదృష్టవంతురాలిని. తగ్గుతుందో తగ్గదో కాని రుగ్మత సోకినది శరీరానికే. సానుభూతి వెదుక్కునే మానసిక రుగ్మత కాదు. రేపటి నుండి చికిత్స మొదలు. చూద్దాం. ఫలితం ఎలా ఉన్నా మళ్లీ కలుద్దాంలే "

అంటూ కారెక్కింది భవాని. ★



## ఆగస్ట్ 4న సోమేపల్లి సోమయ్య స్మారకోపన్యాసం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంతప్రచారక్‌గా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందించిన సోమేపల్లి సోమయ్య స్మారకోపన్యాస కార్యక్రమం ఆగస్ట్ 4, ఆదివారం నిర్వహిస్తున్నారు. శ్రీశైలం శ్రీశివాజీ స్ఫూర్తికేంద్రం సంఘటనా కార్యదర్శి సోమయాజుల నాగేశ్వరరావు స్మారకోపన్యాసం ఇస్తారని సోమేపల్లి సోమయ్య స్మారక సేవా అధ్యయన సమితి అధ్యక్షులు రేమెళ్ల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలియచేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సోమయ్యను ఆయన మాతృమూర్తి కట్టెలు అమ్మి పెంచారు. కానీ ఆయన దేశం కోసం జీవితాన్ని వెలిగించారు. తెలుగు రాష్ట్రాలలో అనేక మందికి ఆయన మార్గదర్శకులు. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ కళాశాల (కేఎంఐటీ, నారాయణగూడ), సర్దార్ పటేల్ హాల్‌లో సాయంత్రం 5.30లకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. అభిమానులు, స్వయంసేవకులు కుటుంబాలు సహా పది నిమిషాల ముందే సభా మందిరానికి విచ్చేయాలని, కార్యక్రమం తరువాత భోజనం వసతి ఉంటుందని నిర్వాహకులు తెలియచేశారు. ★

వచ్చేవారం కథ..
**రింగాలజీ**
– సూరిశెట్టి వసంతకుమార్



పారిస్ వేదికగా ప్రారంభమైన 2024 ఒలింపిక్స్‌లో భారత్ రెండంకెల సంఖ్యలో పతకాలు సాధించాలన్న పట్టుదలతో ఉంది. 117 మంది అథ్లెట్ల బృందంతో 16 రకాల క్రీడల్లో పతకాలవేట మొదలు పెట్టింది.




# ఒలింపిక్స్‌లో భారత్ శుభారంభం..

పారిస్ ఒలింపిక్స్ మొదటి నాలుగురోజుల పోటీలలోనే భారత షూటర్లు రెండు కాంస్యపతకాలతో సరికొత్త చరిత్ర సృష్టించారు. మహిళల 10 మీటర్ల ఏర్ పిస్టల్ విభాగంలో మను బాకర్ కాంస్య పతకంతో భారత పతకాల ఖాతా తెరిచింది. ఆ తరువాత రెండురోజులకే సరబ్ జ్యోత్ సింగ్ తో జంటగా 10 మీటర్ల ఏర్ పిస్టల్ మిక్సిడ్ టీమ్ విభాగంలో సైతం మరో కంచు పతకం అందుకొంది. 124 సంవత్స రాల ఒలింపిక్స్ చరిత్రలో.. ఒకే గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత తొలి, ఏకైక అథ్లెట్ ఘనతను మను బాకర్ సాధించింది.

**పారిస్ నుంచి టోక్యో వరకూ...**

1896లో మొట్టమొదటి ఒలింపిక్స్ ప్రారంభ మైనా.. భారత్ మాత్రం 1900 పారిస్ ఒలింపిక్స్ నుంచే పాల్గొంటూ వస్తోంది. స్వాతంత్ర్యా నికి పూర్వం నుంచే భారత అథ్లెట్లు పాల్గొంటూ వస్తున్నారు. పారిస్ వేదికగా తొలిసారిగా జరిగిన 1900 ఒలింపిక్స్ లో భారత్ తరపున బరిలోకి దిగిన బ్రిటీష్ అథ్లెట్ నార్మన్ పిట్ చార్డ్ పరుగు అంశాలలో రెండు రజత పతకాలతో పతకాలవేటకు శ్రీకారం చుట్టాడు. అయితే.. ఇంగ్లండ్‌లో జన్మించి భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన నార్మన్ ఏ దేశం తరపున పతకాలు సాధించాడు అన్న అంశమై ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది.

**అసలు సిసలు భారత విజేత కెడీ జాదవ్...**

1920 ఒలింపిక్స్‌లో భారత్‌కు చెందిన అథ్లెట్లు తొలిసారిగా పాల్గొనగా,1928 ఆమ్ స్టర్ ఒలింపిక్స్‌లో కానీ భారత హాకీజట్టు తొలి బంగారు పతకం సాధించలేకపోయింది. వ్యక్తిగత విభాగంలో ఓ భారత అథ్లెట్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి 1952 గేమ్స్ వరకూ వేచిచూడాల్సి వచ్చింది. పురుషుల కుస్తీలో కెడీ జాదవ్ కాంస్య పతకం సాధించడం ద్వారా చరిత్ర సృష్టించాడు.

12 దశాబ్దాల భారత ఒలింపిక్స్ లో చరిత్రలో తొలి పతకం సాధించిన అసలు సిసలు భారత క్రీడాకారుడిగా జాదవ్ రికార్డు నెలకొల్పాడు. ఆ తరువాత వ్యక్తిగతంగా భారత్ పతకం గెలుచు కోడానికి 44 సంవత్సరాల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. అట్లాంటా ఒలింపిక్స్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో లియాండర్ పేస్ కాంస్య పతకం నెగ్గే వరకూ భారత్‌కు మరో వ్యక్తిగత పతకం లేకుండా పోయింది.

**నాటికీ నేటికీ రెండే స్వర్ణాలు...**

1900 పారిస్ ఒలింపిక్స్ నుంచి గత 24 గేమ్స్‌లో పాల్గొంటూ వచ్చిన భారత్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించడానికి 2008 బీజింగ్ ఒలింపిక్స్ వరకూ వేచిచూడాల్సి వచ్చింది. పిస్టల్ షూటింగ్ పురుషుల విభాగంలో అభినవ్ బింద్రా తొలి స్వర్ణంతో చరిత్ర సృష్టిస్తే..ఆ తర్వాతి పుష్కర కాలంలోనే భారత్ కు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బల్లెంవీరుడు నీరజ్ చోప్రా రెండో స్వర్ణ పతకం అందించగలిగాడు.

వ్యక్తిగత విభాగంలో రజత పతకాలు సాధించిన వారిలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, పీవీ సింధు, మీరాబాయి చాను సైతం ఉన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన భారత తొలి మహిళగా తెలుగుతేజం కరణం మల్లీశ్వరి నిలిచింది. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆమె కాంస్య పతకం సాధించగా.. ఆ తరువాత పీవీ సింధు, సైనా నెహ్వాల్, సాక్షి మాలిక్, లవ్లీనా బోర్గెయిన, మీరాబాయి చాను మహిళా పతక విజేతల జాబితాలో చోటు సంపాదించారు. ఒలింపిక్స్‌లో రెండేసి పతకాలు సాధించిన భారత అథ్లెట్లుగా పీవీ సింధు, సుశీల్ కుమార్ ఉన్నారు.

**టీమ్ విభాగంలో హాకీదే అగ్రస్థానం...**

ఒలింపిక్స్‌లో భారత్‌కు అత్యధిక పతకాలు సాధించి పెట్టిన ఘనత జాతీయక్రీడ హాకీకి మాత్రమే దక్కుతుంది. 1928 ఆమ్ స్టర్ డామ్ ఒలింపిక్స్ నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ వరకూ 8 స్వర్ణాలతో సహా మొత్తం 12 పతకాలను భారత హాకీ జట్టు అందించింది. గత ఒలింపిక్స్ లో కాంస్య పతకం నెగ్గడం ద్వారా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిన భారత్ ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో ఉంది. క్రీడల వారీగా చూస్తే భారత్ ఇప్పటి వరకూ హాకీలో 12, కుస్తీలో 7, షూటింగ్ లో 4, బ్యాడ్మింటన్లో మూడు పతకాలు సాధించింది.

**క్రమంగా పెరుగుతూ వచ్చిన పతకాలు...**

ఒలింపిక్స్ ప్రారంభంలో ఒకటి లేదా రెండు పతకాలకు మాత్రమే పరిమితమైన భారత్ 2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి ఎక్కువసంఖ్యలో పతకాలు గెలుచుకోడం మొదలు పెట్టింది. బీజింగ్ ఒలింపిక్స్ లో 3 పతకాలు, 2012 లండన్ ఒలింపిక్స్‌లో 6 పతకాలు సాధించిన భారత అథ్లెట్లు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం రికార్డుస్థాయిలో 7 పతకాలు సాధించగలిగారు. ఇందులో నీరజ్ చోప్రా సాధించిన స్వర్ణంతో పాటు రెండు రజత, 4 కాంస్య పతకాలు సైతం ఉన్నాయి. వచ్చే రెండు వారాలపాటు సాగే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పదికి పైగా పతకాలు సాధించా లన్న లక్ష్యంతో పటిష్టమైన అథ్లెట్ల బృందాన్ని తయారు చేసింది.

**ర్యాంకులవారీగా భారత్...**

ప్రపంచ యుద్ధాల కారణంగా నిలిచిపోయిన 1916, 1940, 1944 క్రీడలతో పాటు 1896, 1904, 1908, 1912 ఒలింపిక్స్ కు భారత్ దూరంగా ఉంది. 1900 పారిస్ ఒలింపిక్స్ నుంచి 2020 టోక్యో ఒలింపిక్స్ వరకూ గత 24 గేమ్స్‌లో పాల్గొంటూ వచ్చిన భారత్ అత్యధిక పతకాలు సాధించిన మొదటి 10 దేశాల జాబితాలో చోటు సంపాదించలేకపోయింది. గత 12 దశాబ్దాల ఒలింపిక్స్‌లో భారత్ మొత్తం 57 పతకాలు మాత్రమే గెలుచుకోగలిగింది. వీటిలో 10 స్వర్ణ, 9 రజత, 16 కాంస్య పతకాలు ఉన్నాయి.


ఒలింపిక్స్‌లో మొత్తం 204 దేశాలు తలపడు తుంటే 2020 టోక్యో ఒలింపిక్స్ పతకాల పట్టికలో 140 కోట్ల జనాభా కలిగిన భారత ర్యాంకు 47 మాత్రమే. ★



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# భిన్నమైన ఆలోచన, దూరదృష్టితోనే సంఘ స్థాపన

**- మన్మోహన్ వైద్య**



**భాగ్యనగర్ :** వైద్యవిద్యను అభ్యసించినా ధనార్జన గురించి ఆలోచించకుండా దేశానికి స్వాతంత్ర్యం ఎలా సిద్ధింప జేయాలన్న ఆలోచనలోనే డాక్టర్‌జీ ఉండేవారని రాష్ట్రీయ స్వయంసేవక్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు డాక్టర్ మన్మోహన్ వైద్య అన్నారు. "మ్యాన్ ఆఫ్ ది మిలీనియా డాక్టర్ హెడ్గేవార్" పుస్తక ఆవిష్కరణ సభ జూలై 24, 2024న కూకట్‌పల్లిలోని వివేకానంద సేవాసమితిలో జరిగింది. ముఖ్య అతిథిగా డిఆర్‌కె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్స్‌పల్ డా॥ నిట్టా జ్ఞానేశ్వరరావు హాజరయ్యారు.

ముఖ్యవక్త డాక్టర్ మన్మోహన్ వైద్య మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో డాక్టర్జీ క్రియాశీలకంగా పనిచేశారన్నారు. దేశం ఎప్పటి వరకైతే బానిసత్వంలో ఉంటుందో అప్పటి వరకు వైద్యవృత్తిని నిర్వర్తించనని, ధన సముపార్జన చేయనని, వివాహం కూడా చేసుకోనని డాక్టర్జీ ప్రతిన పూనారని వైద్య చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కనిపించే అన్ని మార్గాల లోను డాక్టర్జీ పాల్గొన్నారని, కలకత్తా కేంద్రంగా జరిగిన విప్లవోద్యమంలో, లోకమాన్య తిలక్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కాంగ్రెస్ ఆందోళనలో, హిందూ మహాసభ.. ఇలా సక్రియంగా పాల్గొన్నారని వివరించారు. ఇంత చేస్తున్నా. అసలు భారత్ ఆంగ్లేయుల చేతిలో ఎందుకు బందీ అయ్యింది. అన్న ప్రశ్న ఆయన్ను వేధించేదని అన్నారు. దీని మూల మేమిటో తెలుసుకోవాలన్న తపన నిత్యం డాక్టర్జీ మనసులో రగులుతూనే ఉండేదని పేర్కొన్నారు.

1921 ఖిలాఫత్ ఉద్యమం విఫలమైన తర్వాత దేశంలోని చాలా ప్రాంతాల్లో అల్లర్లు జరిగాయని, ముఖ్యంగా కేరళలోని మలబార్‌లో అల్లర్లు జరిగాయని, వీటికి స్పందించే డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను స్థాపించారన్న ధోరణిలో కొందరు ఉండేవారని, అది శుద్ధతప్పు అని మన్మోహన్ వైద్య స్పష్టం చేశారు. ఆరెస్సెస్ స్థాపన ఏదో ఒక సంఘటనకు ప్రతిస్పందనగా జరగలేదన్నారు. డాక్టర్‌జీకి చిన్నతనం నుంచే హిందూ సమాజ ఐక్యత కోసం ఏదో చేయాలన్న స్పష్టమైన ఆలోచన ఉండేదని, ఈ విషయాన్ని ఆయన తన స్నేహితులతో అనేవారని, ఈ విషయాన్ని స్వయంగా డాక్టర్‌జీ చిన్ననాటి స్నేహితులే తమతో పంచుకున్నారని వెల్లడించారు.

సమాజంలో అప్పటి నుంచే అనేక సామాజిక, ధార్మిక సంస్థలు ఉండేవని, అవి ఇప్పటికీ ఉన్నాయని, సమాజం కోసం చాలా చేస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ కూడా ఇలాగే పనిచేస్తుందన్న సాధారణ ఆలోచనే అందరిలో ఉండేదన్నారు. కానీ.. డాక్టర్‌జీ ఈ ఆలోచనలన్నింటికీ భిన్నంగానే దూరదృష్టితో ఆలోచించేవారని వైద్య గుర్తు చేశారు. నాగపూర్‌లో సంఘ ప్రారంభమైన తొలినాళ్ల నుంచే సంపూర్ణ హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారని తెలిపారు. ముందు నుంచి కూడా సమాజానికి ఉపయోగపడే కార్యాలకు ఆర్థికంగా సహాయం చేసే వ్యక్తులున్నారని, కానీ,డాక్టర్‌జీ వారి నుంచి ఆశించకుండా ప్రతి స్వయంసేవక్ కూడా ఈ సంఘ కార్యం తనదని, ఈ కార్యం కోసం మొత్తం శక్తిని ఇవ్వాలని, త్యాగ నిరతిని అలవర్చుకోవాలని, ఈ హిందూ సంఘటన అన్న కార్యంకోసం తామే స్వయంగా ఆర్థికవ్యవస్థను సృష్టించుకోవాలన్న భిన్నమైన ఆలోచన డాక్టర్‌జీకి ఉండేదని వివరించారు.

గురుదక్షిణ అన్న సంప్రదాయం ధార్మిక పరంపరలో ఉంది కానీ సామాజిక క్షేత్రంలో లేదన్నారు వైద్య. డాక్టర్‌జీ గురుదక్షిణ అన్న మాధ్యమం ద్వారా స్వయంసేవకులు సమర్పణ చేయాలన్న విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. అప్పుడు విద్యార్థి స్వయంసేవకులకు ఇప్పటి లాగా పాకెట్ మనీ ఉండేది కాదని, దీంతో కట్టెలు కొడుతూ, తద్వారా వచ్చిన డబ్బును గురుదక్షిణగా సమర్పించేవారని వైద్య వెల్లడించారు. సంఘం ఆర్థికంగా పూర్తిగా స్వావలంబన సాధించాలన్నదే డాక్టర్‌జీ ఆలోచన అని వివరించారు.

అప్పట్లో సంఘ ప్రార్థన చివర్లో సమర్థ రామదాసు స్వామి మహారాజ్ కీ జై అనేవారమని.. దీంతో సమర్థ రామదాస్‌నే గురువుగా భావించే వీలుండేదని, అలాగే చాలామంది డాక్టర్‌జీయే గురువు అని అనుకునేవారని, కానీ..సంఘ్ గురువుని ఎంచుకునే ప్రక్రియలోనూ డాక్టర్‌జీ అత్యంత భిన్నమైన శైలిని ఎంచుకున్నారన్నారు. ఎందుకంటే సంఘ పని మొత్తం హిందూ సమాజాన్ని సంఘటితం చేసే పని అని, ఈ సమాజం అత్యంత ప్రాచీన సమాజం అని, అలాగే గురువుకూడా అత్యంత ప్రాచీనతను సూచించేదిగా ఉండాలని భావించి, భగవాధ్వజాన్ని గురువుగా స్వీకరించారన్నారు. అయితే.. సంఘానికి సంబంధించిన ధ్వజంపై ఎలాంటి గుర్తూ లేదని, ఎందుకంటే. మొత్తం సమాజాన్ని సంఘటితం చేస్తుందని, ఇదేదో సమాజంలో ఓ వర్గానికి చెందిన సంస్థ కాదన్నారు. వీటన్నింటినీ చూస్తే.. హెడ్గేవార్‌ది ఎంత దూరాలోచనో అర్థమవుతుందన్నారు. ఆత్మ విస్మృతిలో ఉన్న సమాజాన్ని మొత్తం సంఘటితం చేయాలన్న ఆలోచనే ఉండేదన్నారు. మామూలుగా నిత్య, అనిత్య కార్యాలు అని రెండు ఉంటాయని, సంఘం నిత్య కార్యమని, నిరంతరం నడుస్తూనే ఉండాలన్నారు. అనిత్య కార్యం వైపు కూడా దృష్టి పెట్టాలన్నది డాక్టర్‌జీ ఆలోచనగా ఉండేదన్నారు. ఓ వైపు సంఘం కార్యమన్న నిత్య కార్యం, మరోవైపు స్వాతంత్ర్య కాంక్ష అన్న కార్యం కూడా నడవాలన్న వివేకంతో డాక్టర్‌జీ ఆలోచించేవారని, ఇదే వారి చింతనలోని విశేషమని తెలిపారు.

అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి డాక్టర్‌జీ


ఆధునికంగా కూడా ఆలోచించేవారని, అసలు యూనిఫారమ్ (గణవేష) అన్న పద్ధతే హిందూ సమాజంలో ఉండేది కాదని, కానీ.. సమానత్వం, ఏకత్వం కోసం యూనిఫారమ్ అవసరమని డాక్టర్‌జీ ఆలోచించారన్నారు. దీని కోసం ధోవతి, కుర్తా లాంటివి కూడా తీసుకురావచ్చుగానీ.. హెడ్గేవార్ అత్యంత ఆధునికమైన మిలటరీ యూనిఫారాన్ని సంఘానికి తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా పరేడ్ అనేది కూడా హిందూ సమాజానికి కొత్తదని, భారతీయ రాజుల సైన్యాలు కూడా ఈ పరేడ్‌ను చేసేవి కావని వైద్య తెలిపారు. కానీ...సమాజంలో ఓ అనుశాసనం (క్రమశిక్షణ) తీసుకురావడానికి ఈ పరేడ్ అవసరమని డాక్టర్‌జీ ఆలోచించారు. ఇప్పుడు దానిని సంఘంలో సమత అంటున్నారన్నారు. అలాగే బ్యాండ్‌తో సహా పరేడ్ చేయడం హిందూ సమాజంలో లేదని, శౌర్య భావన తీసుకురావడానికి బ్యాండ్‌ను కూడ సంఘానికి పరిచయం చేశారన్నారు. వీటన్నింటినీ చూస్తే ఆధునికతను డాక్టర్‌జీ స్వాగతించేవారని అర్థమవుతోందని, తన లక్ష్యాన్ని చేరుకోవడానికి దానిని స్వీకరిస్తూనే... మూలాన్ని మాత్రం విడిచిపెట్టలేదన్నారు.

1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసిందని, అప్పుడు ఇంగ్లాండ్, జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్ దెబ్బ తిన్నాయని, తిరిగి తమ దేశాలను పునర్నిర్మించుకొనే పనిని తమకున్న అతి తక్కువ వనరులతో ప్రారంభించారన్నారు. 1947లో భారత్‌కి స్వాతంత్రం వచ్చింది. అయితే.. పై దేశాల్లాగా మన దేశం అంతలా దెబ్బతినలేదు. గత 70 ఏళ్లలో ఈ దేశాలు ఎంతగా అభివృద్ధి చెందాయో భారత్ అంతలా అభివృద్ధి చెందలేకపోవడానికి కారణం మన మూలాలను మనం తెలుసుకోకపోవడమే అసలు ఇబ్బందన్నారు. ఈ నాలుగు దేశాలు కూడా తామెవరో తెలుసుకున్నాయని, తమ పూర్వికుల గురించి, తమ మూలాలు తెలుసుకోవడం వల్లే తిరిగి వేగంగా పుంజుకున్నాయని వివరించారు.

కానీ.. భారత్‌కి స్వాతంత్రం వచ్చిన తర్వాత విద్య,రక్షణ, ఆర్థికరంగాలు మన మూలాల ఆధారంగా నడవడంలేదని, పశ్చిమ దేశాలను అనుసరించడం వల్లే ఈ దుర్గతి అని వైద్య అన్నారు. భారత్ ఇతిహాసం కొన్నివేల సంవత్సరాలదని, కానీ.. ఇతర దేశాలను అనుసరించడం వల్లే ఈ ఇబ్బందులన్నారు. యూరోపియన్ దేశాల్లో అన్ని పనులు ప్రభుత్వాలే చేస్తుంటాయని, ఇది భారత్ పద్ధతి కాదని ప్రముఖ కవి రవీంద్రనాథ్ టాగూర్ అనేవారని, రాజ్యం మీద అతి తక్కువ ఆధారపడే సమాజమే 'స్వదేశీ సమాజ'లక్షణమని ఆయన అనేవారని మన్మోహన్ వైద్య గుర్తు చేశారు.

కార్యక్రమంలో దాదాపు రెండువందలమంది పురప్రముఖులు పాల్గొన్నారు. ★

# ఒంగోలులో కార్గిల్ విజయ దివస్




**ఒంగోలు :** జూలై 26న కార్గిల్ విజయదివస్ సందర్భంగా ఆంధ్రకేసరి విద్యాకేంద్రం కాలేజిలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థిప్రముఖ్ విజయభాస్కర్. 400మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇతిహాస సంకలన సమితి కార్యశాల




**భాగ్యనగర్ :** జూలై 28, 2024 ఇతిహాస సంకలన సమితి మియాపూర్-గచ్చిబౌలి-కూకట్‌పల్లి ప్రఖండ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ అధ్యక్షతన ఇతిహాస సంకలన యోజన గురించి వివరించారు. మన చరిత్రలో హిందువుల మధ్య అనైక్యత అనే అంశంపై ప్రొఫెసర్ డా.ముదిగొండ శివప్రసాద్ ఉపన్యాసించారు. ఆల్వాల్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ స్వాతంత్ర్య పోరాటాన్ని విశ్లేషించారు. అందులో ఆర్యసమాజ పాత్ర కీలకమైనదని సోదాహరణంగా నిరూపించారు.సంస్థ ప్రధాన కార్యదర్శి వీరేందర్ ఇతిహాస సంకలన యోజన ప్రధాన లక్ష్యాలను వివరించారు. వక్రీకరించిన చరిత్రను సక్రమమైన మార్గంలో విద్యార్థులకు అందించాలనే కోరికతో బాబాసాహెబ్ ఆప్టే, రామ్‌సాఠే వంటి మహనీయులు సంస్థ అభివృద్ధి కోసం కృషి చేశారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌కు 33 మంది హాజరయ్యారు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం — అమరారామం- అమరావతి



ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా,అమరావతిలో ఈ దేవాలయం కొలువుదీరింది. పంచారామాలలో ఒకటైన అమరారామం (అమరావతి) కృతయుగంలోనే ఆవిర్భవించిన విశిష్టమైన పుణ్యక్షేత్రం. పురాణాల్లో క్రౌంచతీర్థంగా పేర్కొన్నారు. ఇక్కడి శివలింగాన్ని చంద్రుడు ప్రతిష్ఠించి, అమరేశ్వరుడనే నామకరణం చేసి పూజించినట్టు స్థలపురాణం తెలియజేస్తోంది. ఈ ఆలయంలో మహాశివరాత్రి, నవరాత్రి, కళ్యాణి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

## కథ — కుందేలు పిరికితనం!

ఒకానొక ఒక అడవిలో కుందేలు నివసిస్తూ ఉండేది.

అది చాలా పిరికిది. ప్రతి చిన్న విషయానికి భయపడుతూ ఉండేది. పైగా కంగారు కూడా ఎక్కువే.

అది ఒకరోజు ఓ మామిడి చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటోంది.

ఆ చెట్టు పక్కనే ఒక పెద్ద కొండ కూడా ఉంది. అయితే అనుకోకుండా ఒక మామిడి పండు ఆ కుందేలు మీద పడింది.

వెంటనే ఉలిక్కిపడ్డ కుందేలు.. కొండ విరిగి తన మీద పడుతుందనుకొని ‘అందరూ పారిపోండి’ అని గట్టిగా అరుస్తూ పరిగెత్తసాగింది.

దాన్ని చూసి ఇతర జంతువులు కూడా పరిగెత్తసాగాయి.

అలా కొద్ది సమయానికే ఈ విషయం తెలిసి అడవి మొత్తం అల్లకల్లోలం అయ్యింది.

ఇంతలో అడవికి రాజైన సింహం వచ్చి ఏమైంది? అని అడిగింది. జంతువులు



జరిగింది వెల్లడించాయి.

కొండ ఎక్కడ పడిందో చెప్పమని సింహం కుందేలును అడిగింది. అది ఆ

## పద్యము

పరహితమైన కార్యమతి భారతముతోడిదియైన పూను స
త్పురుషుడు లోకము ల్పొగడ, పూర్వమునం దొక రాలవర్షమున్
కురియగ చొచ్చినన్ కదిసి గొబ్బున గోజన రక్షణార్థమై
గిరి నొక కేల ఎత్తెనట కృష్ణుడు ఛత్రము భాతి భాస్కరా!

**భావం :** లోకులకు హితాన్ని కలిగించే పని ఎంత కష్టమైనది అయినా మంచివాడు పూనుకుంటాడు. పూర్వం రాళ్ల వర్షం కురిసినప్పుడు గోవులను, గోపాలకులనూ రక్షించటానికి కృష్ణుడు కొండనే ఎత్తి గొడుగుగా పట్టాడు.

## శ్లోకము

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్ర బాన్ధవాః
జిహ్వాగ్రే బన్ధనప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధ్రువమ్

**భావం :** లక్ష్మి నాలుక కొనపైన ఉంటుంది. మిత్రులు, బంధువులు నాలుక కొనపైన ఉంటారు. బంధన ప్రాప్తి కూడా నాలుక కొనమీదే ఉంటుంది. చివరికి మరణం కూడా నాలుక కొనపైనే ఉంటుంది. అంటే మంచిమాటలవల్ల మంచి; చెడు మాటల వల్ల చెడు కలుగుతుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| అష్టముడి | రాజస్తాన్ |
| పుష్కర్ | ఉత్తరాఖండ్ |
| గోహ్నా | కేరళ |
| ఊలర్ | రాజస్తాన్ |
| సాంబర్ | జమ్ముకశ్మీర్ |

జవాబులు : అష్టముడి–కేరళ, పుష్కర్–రాజస్తాన్, గోహ్నా–ఉత్తరాఖండ్, ఊలర్–జమ్ముకశ్మీర్, సాంబర్–రాజస్తాన్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### మృదుల సారాబాయి



గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. 1911, మే 6న అహ్మదాబాద్‌లో జన్మించారు. గాంధీజీ నేతృత్వంలో సాగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు 1929లో తన చదువును కూడా మానేశారు. విదేశీ వస్త్రాలు-బ్రిటిష్ వస్తువులను బహిష్కరించారు. ఉద్యమంలో భాగంగా అనేకసార్లు అరెస్ట్ కూడా అయ్యారు. 1974, అక్టోబరు 26న మరణించారు.



మామిడి చెట్టు దగ్గరికి సింహాన్ని తీసుకెళ్లింది.

అక్కడ సింహం మొత్తం వెతకగా గాలికి కింద పడిన మామిడి పండు తప్ప ఏమీ కనిపించలేదు.

దీంతో సింహానికి కోపం వచ్చి 'ఓయి మూర్ఖపు కుందేలా? ఇక్కడ పడింది కొండ కాదు, మామిడి పండు. నీ పిరికితనం, కంగారు వల్ల అడవి లోని జంతువులన్నిటిని ఇబ్బంది పెట్టావు. కాబట్టి నీకు శిక్ష తప్పదు' అని చెప్పి వెళ్లిపోయింది.

విషయం తెలిసి ఇతర జంతువులు కూడా కుందేలును తిట్టసాగాయి.

ఏం చేయాలో పాలుపోక కుందేలు తలదించుకుంది. ★

### జనరల్ నాలెడ్జ్

1. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏ రాష్ట్రంలో ఉంది?
2. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్రంలో ఏ శాఖకు సహాయ మంత్రిగా ఉన్నారు?
3. థార్ ఎడారి ఏ రాష్ట్రంలో ఉంది?

సమాధానాలు : 1. కోల్‌కతా (పశ్చిమ బెంగాల్); 2. కేంద్ర హోం శాఖ; 3. రాజస్తాన్

### మెదడుకు మేత

ఇంటి వెనుక
ఇంగువ చెట్టు ఎంత
కోసినా తరగదు..
ఏమిటది?

జవాబు : పొగ

### మంచిమాట

అందంగా మాట్లాడటం ఒక కళ. అనవసరంగా మాట్లాకుండా ఉండటం కూడా అంతకన్నా పెద్ద కళ.



# వారఫలాలు

05-11 ఆగస్ట్ 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రముఖులతో పరిచయాలు, దేవాలయాల సందర్శన. ఊహించని కాంట్రాక్టులు లభిస్తాయి. ఆదాయం మరింత పెరుగుతుంది. ఉద్యోగులకు విధుల్లో అనుకూల పరిస్థితులు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. క్రీడాకారులకు పురస్కారాలు. 5,6 తేదీల్లో మనశ్శాంతి లోపిస్తుంది. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీ నృసింహస్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సమాజంలో పలుకుబడి, దైవకార్యాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణయత్నాలు, వాహనాలు, ఆభరణాలు కొనుగోలు, విద్యార్థుల కృషి కొంతమేర ఫలిస్తుంది. వ్యాపారులు పెట్టుబడులతో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు విధి నిర్వహణ ప్రశాంతం. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. వైద్యులు, క్రీడాకారులకు నూతన ఉత్సాహం. దూరప్రయాణాలు. 7,8 తేదీల్లో బంధువులతో వివాదాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

సన్నిహితులనుంచి ఒత్తిడులు పెరుగుతాయి. కష్టమే తప్ప ఫలితం లేని స్థితి. బంధువులతో విభేదిస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. దేవాలయ దర్శనాలు. రావలసిన సొమ్ము అందక ఇబ్బంది పడతారు. వ్యాపారులకు లావాదేవీలు అసంతృప్తి. ఉద్యోగులకు కొన్ని బాధ్యతలు సవాలుగా మారతాయి. రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలలో ఆటంకాలు. శుభవార్తా శ్రవణం. 8,9 తేదీల్లో ఆకస్మిక ధనలాభం. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

సమాజంలో గౌరవప్రతిష్ఠలు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. చిన్ననాటి స్నేహితులతో కష్టసుఖాలు విచారిస్తారు. దైవారాధనలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. నిరుద్యోగుల ఆశలుఫలిస్తాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు దక్కుతాయి. పారిశ్రామిక, కళారంగాలవారు ఊహలు నిజం చేసుకుంటారు. రచయితలకు విశేష గౌరవం. 10,11 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిళ్లు. విష్ణుధ్యానం చేయండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలలో పురోగతి. నిరుద్యోగులకు అవకాశాలు. వాహనాలు, స్థలాలు కొనుగోలులో ఇబ్బందులు తొలగుతాయి. శుభకార్యాలకోసం ప్రయత్నాలు. మొండిబాకీలు కూడా వసూలవుతాయి. వ్యాపారులకు అభివృద్ధి కనిపిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులు విజయాల బాట. రచయితలు, వ్యవసాయదారుల యత్నాలు సఫలం. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. దుర్గామాతను స్మరించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ఆలోచనలు కార్య రూపందాలుస్తాయి. వాహన, భూయోగం. రావలసిన డబ్బు అందుతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు సంతోషకర సమాచారం. రాజకీయవేత్తలకు శ్రమ ఫలిస్తుంది. కళాకారులు, క్రీడాకారులకు మంచి గుర్తింపు. 10,11 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువుల నుంచి ఒత్తిళ్లు. గణేశాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

సన్నిహితులతో విభేదాలు పరిష్కరించుకుంటారు. నిరుద్యోగులు పోటీపరీక్షల్లో విజయం. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆస్తి వివాదాలు పరిష్కారం. వ్యాపారులకు భాగస్వాములతో వివాదాలు తీరతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రశంసలు. రాజకీయవేత్తలకు పదవీయోగం. కళాకారులు, పరిశోధకులకు విశేష ఆదరణ. 5,6 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఆంజనేయదండకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

సన్నిహితులతో ఆనందంగా గడుపుతారు. ముఖ్య కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. వివాహ, ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి. ఆదాయానికి ఇబ్బందులు తీరుతాయి. అందరిలోనూ మీ మాటే చెల్లుబాటు. వ్యాపారులకు మరింత ప్రోత్సాహకరం. ఉద్యోగులకు సరైనగుర్తింపు. కళాకారులు, రచయితల ఆశయాలు నెరవేరతాయి. 9,10 తేదీల్లో శారీరక రుగ్మతలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

సన్నిహితుల సాయం పొందుతారు. కార్యక్రమాలలో విజయం. ఆదాయం మరింత అనుకూలం. కుటుంబసభ్యులతో మనస్పర్థలు తొలగును. ఆరోగ్యం మరింత మెరుగు. ఉద్యోగులకు ఊహించని విధంగా ఇంక్రిమెంట్లు లభించవచ్చు. రాజకీయ, కళారంగాల వారు విజయాలవైపు సాగుతారు. క్రీడాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. శ్రీదత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు. దైవకార్యాలలో పాల్గొంటారు. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. నిరుద్యోగుల యత్నాలు సఫలం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపార విస్తరణ యత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు కోరుకున్న విధంగా మార్పులు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు అనుకూలం. క్రీడాకారులు ప్రతిభను నిరూపించుకుంటారు. 8,9 తేదీల్లో మానసిక అశాంతి. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

సన్నిహితులు, స్నేహితులతో సంతోషంగా గడుపుతారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కాంట్రాక్టులు పొందుతారు. వాహన, కుటుంబ సౌఖ్యం. ఇతరుల నుంచి రావలసిన సొమ్ము అందుకుంటారు. వ్యాపారులకు అనుకున్న లాభాలు. ఉద్యోగులకు విధుల్లో ఒత్తిడులు తొలగుతాయి. కళాకారులు, పరిశోధకులకు నూతనోత్సాహం. 10,11 తేదీల్లో దూరప్రయాణాలు. లక్ష్మీస్తోత్రాలు పఠిచండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

సమాజంలో గౌరవం. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. వాహన యోగం. దైవకార్యాలు చేపడతారు. కొన్ని వివాదాల నుంచి బయటపడతారు. ఆకస్మిక ధనలాభాలు. వ్యాపారులు లాభాలు దిశగా పయనిస్తారు. ఉద్యోగులు ఓర్పుతో విధులు నిర్వహించి ప్రశంసలు. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు అనుకున్న అవకాశాలు లభిస్తాయి. దూర ప్రయాణాలు. 6,7 తేదీల్లో బంధువులతో విభేదిస్తారు. శ్రీకృష్ణాష్టకం పఠించండి. ★

నిర్వహణ : పోపూరి విశ్వనాథ్ 9133197111

# పదరసం-475

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ | 4 | | 5 |
| | ■ | | ■ | 6 | | | | ■ | |
| 7 | | | ■ | | ■ | ■ | 8 | | |
| ■ | ■ | 9 | 10 | | 11 | ■ | | ■ | |
| 12 | | ■ | | ■ | 13 | 14 | ■ | 15 | ■ |
| | ■ | 16 | | ■ | ■ | 17 | | | |
| | ■ | ■ | 18 | 19 | | | ■ | | ■ |
| 20 | | 21 | ■ | | ■ | 22 | 23 | | |
| | ■ | 24 | | | ■ | ■ | | ■ | ■ |
| 25 | | | ■ | ■ | 26 | | | | |

## ఆధారాలు

**అడ్డం**

1) వాడుక భాషలో అతి ఆరాటం (4)

4) చెదరిన అసత్యం (3)

6) అపహాస్యం (4)

7) అటునుంచి వచ్చిన ఆపద (3)

8) క్షేమం (3)

9) కళ్ళెదురుగా (4)

12) (మజ్జిగ) చిలికే సాధనం (2)

13) భార్య తండ్రి (2)

16) అరికాలిలో పుట్టే కదుము కురుపు(2)

17) ఒక నృత్యనాటక కళారీతి (4)

18) ఉపజాతికి చెందిన ఒకానొక పద్య రీతి(4)

20) తేడా సరిగాలేదు (3)

22) దయ (4)

24) దాసి (3)

25) రూపొందించు (3)

26) సమయానికి తగినట్లుగా ప్రవర్తించుట (5)

**నిలువు**

1) రక్షరేకు (3)

2) భారతం తెనిగించినవారు అటూ ఇటూ అయ్యారు (4)

3) నీళ్ళుకాచుటకు వాడే పెద్ద బిందె (2)

4) కుచేలుడు శ్రీకృష్ణునికి స్నేహపూర్వకంగా సమర్పించినవి (4)

5) బతికుంటే దీనిని తినొచ్చని సామెత (4)

6) నాణేలు, నోట్లరూపంలో ఉన్న సొమ్ము (3)

10) "పైకొచ్చిన" దీనిని కదిలిస్తే పురుగులు భయంకరంగా కుడతాయి (4)

11) తలక్రిందులైన పలుకు (2)

12) ఒక శృంగారనాయిక (6)

14) గజిబిజి గజిబిజిగానే ఉంది (4)

15) పైకొచ్చిన గారడీ (4)

19) పెద్దసుత్తి తలక్రిందులైంది (3)

21) ఏనుగుమీది పీఠం (3)

23) 22 అడ్డానికి వ్యతిరేకం (3)

### పదరసం - 474 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| తి[1] | రు | ణా[2] | ళ్ళు | ■ | ప[3] | ■ | ర[4] | మ | తా[5] |
| ర | ■ | గ | ■ | క[6] | ర్ర | ■ | ఊ | ■ | క |
| గ[7] | త్త | ర | ■ | లు | ■ | ఆ[8] | ట | ప[9] | ట్టు |
| మూ | ■ | ప[10] | ర్య | వ | సా | నం | ■ | ధ్యం | ■ |
| త[11] | చిం[12] | ■ | ■ | పూ | ■ | ద[13] | మ్ము | ■ | పి[14] |
| ■ | ద | ■ | పా[15] | వు | ■ | బై | ■ | గి[16] | ట్ట |
| ప[17] | ర | వ | శం | ■ | వి[18] | ర | జా | జి | ■ |
| ■ | వం | ■ | ■ | శ్రీ[19] | ■ | వి | ■ | గా | ■ |
| ఆ[20] | ద | ర | ణ[21] | ■ | పా[22] | ■ | పం[23] | డు | గ[24] |
| ■ | ర | ■ | జా[25] | వ | ళి | ■ | క్తి | ■ | చ్చు |

# రెండు... అంతకు మించి!

కథలు చెప్పడం రెండు రకాలు! కట్టె కొట్టె తెచ్చె అని మూడు ముక్కల్లో చెప్పేయడం ఒకటైతే... కథలోని పాత్రల గురించి విపులంగా తెలియచేస్తూ సుదీర్ఘంగా వివరించడం రెండోది. మన తెలుగు దర్శకులు కొందరిప్పుడు రెండో రకానికి అలవాటు పడిపోయారు. మూడు గంటల నిడివిలో కథ చెప్పడం కుదరదని... కనీసం ఆరు గంటలు అంతకు మించి సమయం కావాలంటున్నారు. దాంతో సినిమా నిడివి పెరిగిపోయి... రెండు అంతకు మించిన భాగాలుగా అవి విడుదలకు సిద్ధమౌతున్నాయి.





ఒక థీమ్‌ను అనుకుని దానిని వివిధ నటీనటులతో, రెండు, మూడు, నాలుగు భాగాలుగా తీయడం అనేది ఎప్పటి నుండో ఉన్నదే. అయితే అవన్నీ ఫ్రాంచైజ్ కేటగిరిలోకి వస్తాయి. అందులో కథా వస్తువు ఒక్కటే ఉండాల్సిన అవసరం లేదు. పాత్రలు వాటి, స్వభావాలు, వాటి లక్ష్యాలు సినిమా సినిమాకూ మారిపోతుంటాయి. కానీ సీక్వెల్స్ అలా కాదు. కథ ఒకటే ఉంటుంది. అందులోని పాత్రలన్నీ ఒకే రకంగా ప్రవర్తిస్తుంటాయి. కథ కాస్తంత పెద్దది తప్పితే... ఒకదానికి ఒకదానిని సంబంధం లేకుండా ఉండదు. ఇప్పుడు ఇలాంటి సినిమాలే ఎక్కువగా వస్తున్నాయి. 'బాహుబలి' సినిమాను రాజమౌళి రెండు భాగాలుగా తీసి, మొదటి దానిని మించిన విజయాన్ని రెండో దానితో అందుకున్న తర్వాత 'మనం అలా ఎందుకు సీక్వెల్స్ తీయకూడద'నే ఆలోచన అత్యధికశాతం దర్శకులు, నిర్మాతలలో కలగడం మొదలైంది. మరీ ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలకు భారీ మొత్తం ఖర్చు అవుతుండటంతో రెండు భాగాలుగా అయితే వాటిని వెనక్కి తెచ్చుకోవడం సులువు అనే ఆలోచనలో నిర్మాతలు పడ్డారు. విస్తారమైన కథను ఎంచుకోవడం వల్ల, వాటిని కాస్తంత అర్థమయ్యేలా చెప్పడం కోసం రెండు భాగాలుగా తీయడంలో అర్థముంటుంది. 'బాహుబలి'తో పాటు తమిళంలో మణిరత్నం తీసిన 'పొన్నియన్ సెల్వన్' ఆ కేటగిరికీ వస్తాయి. కానీ పెరిగిన బడ్జెట్ ను రాబట్టుకోవడం కోసం, తొలి భాగం విజయవంతమైంది కాబట్టి రెండో భాగాన్ని తీద్దామని అనుకోవడం పక్కా వాణిజ్యం తప్పితే మరొకటి కాదు. ఈ కోవలో చాలా సినిమాలు రెండు, మూడు భాగాలుగా రాబోతున్నాయి.

ప్రభాస్ సినిమాలే తీసుకుంటే 'సలార్' ను రెండు భాగాలుగా తీయబోతున్నట్టు దర్శక నిర్మాతలు ముందే ప్రకటించారు. దానికి తగ్గట్టే రెండో భాగం త్వరలోనే పట్టాలు ఎక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన 'కల్కి'ని ప్రస్తుతానికి రెండు భాగాలలో పూర్తి చేస్తామని అంటున్నారు. కానీ అది మరో భాగంగా వచ్చే ఆస్కారాన్ని తోసి పారేయలేం. అలానే త్వరలో ప్రారంభం కానున్న మహేశ్ బాబు, రాజమౌళి చిత్రం సైతం రెండు లేదా మూడు భాగాలుగా వచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అలానే 'పుష్ప' కు సీక్వెల్‌గా 'పుష్ప–2' తెరకెక్కుతోంది. దీనిని కూడా మూడో భాగం ఉంటుందనే ప్రచారం ఇటీవల జోరందుకుంది. అయితే ఇవన్నీ ఊహాగానాలు మాత్రమే. అయితే ఖచ్చితంగా మూడు భాగాలుగా రాబోతున్న సినిమాలో 'కార్తికేయ –3', 'పొలిమేర –3' ఉన్నాయి. నిఖిల్ హీరోగా నటించిన 'కార్తికేయ' తొలి భాగం తెలుగులోనే వచ్చినా, 'కార్తికేయ–2' పాన్ ఇండియా మూవీగా విడుదలై ఘన విజయం సాధించింది. దాంతో దానికి కొనసాగింపుగా మూడో భాగం తీయాలని నిర్మాతలు ఫిక్స్ అయిపోయారు. అలానే 'మా ఊరి పొలిమేర' చిత్రానికి మంచి ఆదరణ లభించడంతో 'పొలిమేర–2' వచ్చింది. ఇప్పుడు 'పొలిమేర –3'ని అనౌన్స్ చేశారు. సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాలు విజయం సాధించడంతో 'టిల్లు క్యూబ్' తెరకెక్కబోతోంది.


సంక్రాంతి కానుకగా వచ్చిన 'హనుమాన్' మూవీ రెండో భాగం 'జై హనుమాన్'. ఇందులో హనుమంతుడి పాత్రకు చిరంజీవిని తీసుకోవాలని నిర్మాతలు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా సాగుతోంది. త్వరలోనే ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కుతుందని నిర్మాతలు చెబుతున్నారు. దీనిని రెండు భాగాలతో ఆపకుండా ఇండియన్ సూపర్ హీరోస్‌ను బేస్ చేసుకుని ప్రశాంత్ వర్మ యూనివర్స్ పేరుతో పలు చిత్రాలు రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. ఎన్టీఆర్‌తో కొరటాల శివ తెరకెక్కిస్తున్న 'దేవర' మొదటి భాగం ఈ యేడాది సెప్టెంబర్ 27న వస్తోంది. కొన్నేళ్ల క్రితం వచ్చిన 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'జి2' రాబోతోంది. నందమూరి కళ్యాణ్ రామ్ 'బింబిసార' మూవీతో చక్కని విజయాన్ని అందుకున్నాడు. దాంతో దానికి ప్రీక్వెల్ చేసే పనిలో పడ్డాడు. ఈ సినిమాను అనిల్ పాదురి డైరెక్షన్ చేయబోతున్నాడు. ఫిబ్రవరిలో వచ్చిన రవితేజ 'ఈగిల్' మూవీకి సీక్వెల్ గా 'ఈగిల్ – యుద్ధ కాండ' వస్తుందని ముగింపులో ప్రకటించారు. అలానే నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి తన బావ మరిది విరాట్ కర్ణను హీరోగా పరిచయం చేస్తూ 'పెదకాపు –1' చిత్రాన్ని తీశాడు. ఈ సినిమా కూడా కమర్షియల్‌గా ఫ్లాప్ అయ్యింది. దాంతో రెండో పార్ట్ వస్తుందో లేదో డౌటే! ఇక ఎన్టీయార్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన 'మ్యాడ్' కు సీక్వెల్ గా 'మ్యాడ్ మ్యాక్స్' రాబోతోంది. వీటి సంగతి ఇలా ఉంటే... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా సైతం రెండు భాగాలుగా రాబోతోంది. ఆ రకంగా అగ్ర కథానాయకులు మొదలుకొని యంగ్ హీరోస్ వరకూ అందరూ రెండు, అంతకు మించిన భాగాలతో సినిమాలు చేయడానికి మానసికంగా సిద్ధమైపోతున్నారు. మరి ప్రేక్షకులు వీటిని ఏమేరకు ఆదరిస్తారోచూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
## మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.90/-




వెల : ₹.390/-




వెల : ₹.220/-




వెల : ₹.360/-




వెల : ₹.200/-



వెల : ₹.360/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.90/-




వెల : ₹.100/-




వెల : ₹.250/-




వెల : ₹.799/-



వెల :₹.495/-



వెల : ₹.549/-



వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 39

DSC
DHRUV SCHOOL OF CIVILS

DHRUV SCHOOL OF CIVIL SERVICES STUDIES

A unit of Dhruv Foundation for Education & Research
Affiliated to Central Sanskrit University, New Delhi

B A (Hons.) (Civil Services Studies)

Contains 5 Core Subjects: 1. SANSKRIT 2. HISTORY 3. POLITY 4. ECONOMICS 5. GEOGRAPHY

- 4 Years BA (Hons.) Program
- Extensive Mock Interviews
- Regular Test Series
- Detailed Coverage of CSAT
- 100% Smart Class Rooms
- Elaborative Doubt Clearance
- Library with 10,000+ Books
- Student Centric Pedagogy
- 3000+ hours of Teaching
- Daily Current Affairs
- Fee Waiver and Scholarship
- One-on-One Mentorship
- Earning while Learning
- Focus on Ethics & Values
- Covers Syllabus of UPSC Exam (Prelims, Mains & Interview)
- 600+ hours of Essay Writing Program & Personalised Feedback
- Practice of Previous Years' Questions & Trends Analysis

"Spoorthy" Chatra Shakti Bhawan, Street No. 9
Lane No.1, Tarnaka, Secunderabad - 500 017

9100009767 www.dearedu.org